
'మహిళల ముఖాలు
కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ,
సమాజమూ బాగుంటాయి'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00
సంపుటి: 12
సంచిక: 90

శుక్రవారం 21-6-2019




**మార్కెట్‌కు 'ఫెడ్' జోష్!**
489 పాయింట్లు లాభపడి
39,602కు సెన్సెక్స్ – బిజినెస్‌లో



**ఆస్ట్రేలియా అదరహో**
వార్నర్ సెంచరీ. బంగ్లాదేశ్‌పై
48 పరుగులతో ఆసీస్ గెలుపు –స్పోర్ట్స్‌లో


SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



# ప్రపంచంలోనే అతిపెద్ద బహుళ దశల ఎత్తిపోతల పథకం భారతదేశానికి గర్వకారణం – తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం బహుళార్థ సాధక ఎత్తిపోతల పథకం





శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గారు
గౌ॥ గవర్నర్, తెలంగాణ & ఆంధ్రప్రదేశ్



శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ గారు
గౌ॥ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర



శ్రీ వైఎస్. జగన్మోహన్ రెడ్డి గారు
గౌ॥ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

ముఖ్య అతిథులుగా పాల్గొంటుండగా
**శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారు
గౌ॥ ముఖ్యమంత్రి, తెలంగాణ గారి చేతుల మీదుగా

## కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నేడే ప్రారంభోత్సవం

తేది: 21 జూన్ 2019, సమయం : ఉదయం 10.30 గంటలకు
స్థలం: మేడిగడ్డ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.

తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారు చేసిన భగీరథ ప్రయత్నం ఫలించి, బృహత్తర కాళేశ్వరం ప్రాజెక్టు నేడు ప్రారంభం కావడం తెలంగాణ ప్రజలందరికీ పండుగ రోజు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం నిర్మించిన రికార్డు సృష్టించడం భారతదేశానికి గర్వకారణం.

అంతర్రాష్ట్ర వివాదాలను స్నేహభావంతో పరిష్కరించుకుని, కేంద్ర ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు సాధించి, అడ్డంకులన్నింటినీ చాకచక్యంతో అధిగమించి, కేవలం మూడేళ్ల అతి స్వల్ప వ్యవధిలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బహుళార్థక సాధక ప్రాజెక్టు కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నేడే జాతికి అంకితం.



### కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా...

- 45 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది.
- ప్రతి ఇంటికి ప్రతి రోజు రక్షిత మంచినీరు అందించే 'మిషన్ భగీరథ' పథకానికి అవసరమైన నీటి సరఫరా జరుగుతుంది.
- కోటి జనాభా కలిగిన గ్రేటర్ హైదరాబాద్ మహానగరానికి ప్రతీ రోజు మంచినీరు అందుతుంది.
- రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పరిశ్రమలకు కావాల్సిన నీటిని అందిస్తుంది.
- జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది.

### భారతదేశ నీటి పారుదల రంగం చరిత్రలో కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టిస్తున్న కొత్త రికార్డులు

- ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా 139 మెగావాట్ల గరిష్ట సామర్థ్యం కలిగిన పంపులు.
- ప్రపంచంలోనే అతిపొడవైన 203 కిలోమీటర్ల సొరంగ మార్గం.
- ఒక రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోయగలిగిన ప్రాజెక్టు మొత్తం ప్రపంచంలో కాళేశ్వరం ఒక్కటే. వచ్చే ఏడాది నుంచి మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.
- ఒకే ఒక ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు మంచినీరు, వందలాది పరిశ్రమలకు నీరు అందించడం ప్రపంచంలో ఇదే ప్రథమం.
- గోదావరి నీటిని 92 మీటర్ల ఎత్తు నుండి వివిధ దశల్లో నీటిని ఎత్తిపోసి, ఎక్కడికక్కడ ఆయకట్టుకు నీరందిస్తూ, చివరికి 618 మీటర్ల ఎత్తు వరకు నీటిని పంపడం ఇదే ప్రథమం.

### 92 మీటర్ల నుంచి 618 మీటర్ల దాకా దశల వారీ ఎత్తిపోతలు

| ప్రాంతం | ఎత్తు (మీటర్లలో) | లిఫ్టు చేసే ఎత్తు (మీటర్లలో) | నీటి వినియోగం టి.ఎమ్.సి. |
|---|---|---|---|
| మేడిగడ్డ | 92 | | 16.7 |
| ఎల్లంపల్లి | 148 | 56 | 75 |
| మిడ్ మానేరు | 318 | 170 | 25.873 |
| శ్రీరాం సాగర్ | 332.54 | 14.54 | 200 |
| మలక్‌పేట్ | 432.50 | 127.5 | 8.6 |
| అనంతగిరి | 397 | 95 | 3 |
| రంగనాయక్ సాగర్ | 490 | 117 | 11 |
| మల్లన్న సాగర్ | 557 | 103 | 108 |
| కొండ పోచమ్మ సాగర్ | 618 | 120 | 29 |

జారీ చేసిన వారు : కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

సాక్షి స్పోర్ట్స్
శుక్రవారం
21-6-2019

## భారత్‌పై ఐఓసీ ఆంక్షల ఎత్తివేత

లుసానె: ప్రపంచ స్థాయి క్రీడా టోర్నీల నిర్వహణ విషయంలో భారత్‌పై విధించిన ఆంక్షలను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) గురువారం ఎత్తివేసింది. పుల్వామా ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో... గత ఫిబ్రవరిలో ఢిల్లీ వేదికగా జరిగిన షూటింగ్ ప్రపంచ కప్‌లో పాల్గొనేందుకు పాకిస్తాన్ షూటర్లకు వీసాలు ఇచ్చేందుకు భారత్ నిరాకరించింది. దీంతో భవిష్యత్‌లో ఒలింపిక్ అర్హత సంబంధిత క్రీడా పోటీల నిర్వహణను కేటాయించేది లేదంటూ ఐఓసీ మన దేశంపై ఆంక్షలు విధించింది. ఈ పర్యవసానం పలు పోటీలపై పడింది. అయితే, ఇకపై అర్హులైన క్రీడాకారులు ఎవరికీ రాజకీయ కారణాలతో వీసాలు నిరాకరించమని రెండ్రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఐఓసీ మెత్తబడింది.

## ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే.–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా | జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 6 | 5 | 1 | 0 | 0.849 | 10 | శ్రీలంక | 5 | 1 | 2 | 2 | -1.778 | 4 |
| న్యూజిలాండ్ | 5 | 4 | 0 | 1 | 1.591 | 9 | వెస్టిండీస్ | 5 | 1 | 3 | 1 | 0.272 | 3 |
| ఇంగ్లండ్ | 5 | 4 | 1 | 0 | 1.862 | 8 | దక్షిణాఫ్రికా | 6 | 1 | 4 | 1 | -0.193 | 3 |
| భారత్ | 4 | 3 | 0 | 1 | 1.029 | 7 | పాకిస్తాన్ | 5 | 1 | 3 | 1 | -1.933 | 3 |
| బంగ్లాదేశ్ | 6 | 2 | 3 | 1 | -0.407 | 5 | అఫ్గానిస్తాన్ | 5 | 0 | 5 | 0 | -2.089 | 0 |

# ఆసీస్ అదరహో

**ప్రపంచకప్‌లో మరో విజయం**

- వార్నర్ 147 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్స్‌లతో 166
- ముష్ఫికర్ రహీమ్ అజేయ సెంచరీ వృథా
- 48 పరుగులతో ఓడిన బంగ్లాదేశ్

భారత్ చేతిలో పరాజయం తర్వాత ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియా ఒక్కసారిగా చెలరేగుతోంది. గత రెండు మ్యాచ్‌లలో పాకిస్తాన్, శ్రీలంకలను ఓడించి జోరు పెంచిన కంగారూలు ఇప్పుడు 'హ్యాట్రిక్' విజయాన్ని అందుకున్నారు. తనదైన శైలిలో చెలరేగిన డేవిడ్ వార్నర్ మరో భారీ సెంచరీతో కదం తొక్కగా... ఉస్మాన్ ఖాజా, ఫించ్ అండగా నిలిచి భారీ స్కోరుకు కారణమయ్యారు. చిన్నదైన ట్రెంట్‌బ్రిడ్జ్ మైదానంలో బంగ్లా పేలవ బౌలింగ్‌ను చితక్కొట్టిన ఆసీస్ పరుగుల వరద పారించింది. కొండంత లక్ష్యం ముందుండగా బంగ్లా పోరాడేందుకు సిద్ధమైంది. సీనియర్లు ముష్ఫికర్, మహ్మదుల్లా, తమీమ్, షకీబ్ తమ స్థాయిలో గట్టిగా ప్రయత్నించినా... వన్డేల్లో తమ అత్యధిక స్కోరు చేసినా విజయానికి చేరువలో రాలేకపోయింది. గత మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ఆటతో విండీస్‌పై భారీ లక్ష్యాన్ని ఛేదించి సత్తా చాటిన బంగ్లా... ఆసీస్ పదునైన బౌలింగ్‌లో మాత్రం చివరి వరకు అదే ధాటిని కనబర్చలేక ఓటమిపాలైంది.

**నాటింగ్‌హామ్:** డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా వరల్డ్ కప్‌లో ఐదో విజయంతో మళ్లీ అగ్రస్థానానికి చేరుకుంది. గురువారం ఇక్కడ జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ 48 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 381 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' డేవిడ్ వార్నర్ (147 బంతుల్లో 166; 14 ఫోర్లు, 5 సిక్సర్లు) కెరీర్‌లో 16వ సెంచరీ సాధించాడు. ఉస్మాన్ ఖాజా (72 బంతుల్లో 89; 10 ఫోర్లు), ఆరోన్ ఫించ్ (51 బంతుల్లో 53; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలక పాత్ర పోషించారు. తొలి వికెట్‌కు ఫించ్‌తో 121 పరుగులు జోడించిన వార్నర్, రెండో వికెట్‌కు ఖాజాతో 192 పరుగులు జత చేశాడు. అనంతరం బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 333 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (97 బంతుల్లో 102 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) కెరీర్‌లో ఏడో సెంచరీ సాధించగా... మహ్మదుల్లా (50 బంతుల్లో 69; 5 ఫోర్లు, 3 సిక్సర్లు), తమీమ్ ఇక్బాల్ (74 బంతుల్లో 62; 6 ఫోర్లు), షకీబ్ అల్ హసన్ (41 బంతుల్లో 41; 4 ఫోర్లు) రాణించారు.

### రెండు శతక భాగస్వామ్యాలు...

ఆస్ట్రేలియాకు ఓపెనర్లు వార్నర్, ఫించ్ మరోసారి అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. గత మ్యాచ్‌లో ఫించ్ భారీ సెంచరీతో చెలరేగిపోతే ఈసారి ఆ బాధ్యతను వార్నర్ తీసుకున్నాడు. వీరిద్దరి చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేశారు. 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వార్నర్ ఇచ్చిన క్యాచ్‌ను షబ్బీర్ వదిలేయడం ఆసీస్‌కు కలిసొచ్చింది. పది ఓవర్లు ముగిసేసరికి ఆసీస్ స్కోరు 53 పరుగులకు చేరింది. ఇదే జోరులో ముందుగా వార్నర్ 55 బంతుల్లో, ఆ తర్వాత ఫించ్ 47 బంతుల్లో అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఎట్టకేలకు ఫించ్‌ను తన తొలి ఓవర్లోనే ఔట్ చేసి పార్ట్‌టైమర్ సౌమ్య సర్కార్ ఓపెనింగ్ జోడీని విడదీశాడు. వన్‌డౌన్‌లో వచ్చిన ఖాజా వార్నర్‌కు చక్కటి సహకారం అందించాడు. షకీబ్ బౌలింగ్‌లో సింగిల్‌తో ఈ ప్రపంచ కప్‌లో వార్నర్ రెండో సెంచరీ (110 బంతుల్లో) పూర్తయింది. అనంతరం సైతం వార్నర్, ఖాజా దూకుడు తగ్గకుండా ఆడారు. ఫలితంగా ప్రపంచకప్ చరిత్రలో ఆసీస్ తొలిసారి మొదటి రెండు వికెట్లకు సెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేసింది. సరిగ్గా 50 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న ఖాజా.. ముస్తఫిజుర్ వేసిన ఇన్నింగ్స్ 42వ ఓవర్లో పండగ చేసుకున్నాడు. ఈ ఓవర్లో 4 ఫోర్లు కొట్టిన మొత్తం 19 పరుగులు రాబట్టడం విశేషం. వార్నర్ ధాటిని కొనసాగిస్తూ 150 పరుగుల మైలురాయి (139 బంతుల్లో) అధిగమించాడు. చివరకు సర్కార్ బౌలింగ్‌లోనే థర్డ్‌మ్యాన్‌కు క్యాచ్ ఇవ్వడంతో అతడి అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది.

నంబర్ 4లో దిగిన మ్యాక్స్‌వెల్ (10 బంతుల్లో 32; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) క్రీజ్‌లో ఉన్నంత సేపు అదరగొట్టాడు. రూబెల్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 6 బాదాడు. ఖాజా మరో ఫోర్ కొట్టడంతో ఈ ఓవర్లో 25 పరుగులు వచ్చాయి. రెండు పరుగుల వ్యవధిలో ఆసీస్ 3 వికెట్లు కోల్పోయింది. ఖాజాతో సమన్వయ లోపంతో మ్యాక్సీ రనౌట్ కాగా... ఖాజా, స్మిత్ (1) వెంటవెంటనే వెనుదిరిగారు. 49 ఓవర్ల తర్వాత వర్షంతో ఆట ఆగిపోయినా... కొద్ది సేపటికి అంపైర్లు మళ్లీ కొనసాగించారు. చివరి ఓవర్లో స్టొయినిస్ (17 నాటౌట్) రెండు ఫోర్లు కొట్టడంతో మరో 13 పరుగులు జతచేరాయి. చివరి పది ఓవర్లలో ఆస్ట్రేలియా ఏకంగా 131 పరుగులు సాధించడం విశేషం.



ముష్ఫికర్



ఖాజా

### రాణించిన షకీబ్...

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాకు పేలవ ఆరంభం లభించింది. లేని సింగిల్ తీసే ప్రయత్నంలో సౌమ్య సర్కార్ (10) రనౌట్ కావడంతో జట్టు తొలి వికెట్ కోల్పోయింది. ఇద్దరు సీనియర్లు తమీమ్, షకీబ్ కలిసి ఆదుకునే ప్రయత్నం చేశారు. సూపర్ ఫామ్‌లో ఉన్న షకీబ్ అదే జోరును కొనసాగించగా, తమీమ్ సొగసైన షాట్లు ఆడారు. ఫలితంగా పవర్‌ప్లే ఆసీస్‌లాగే బంగ్లా సరిగ్గా 53 పరుగులు చేసింది. వీరిద్దరు రెండో వికెట్‌కు 79 పరుగులు జోడించాక స్టొయినిస్ బౌలింగ్‌లో షకీబ్ వెనుదిరిగాడు. 65 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న తమీమ్‌ను అద్భుత బంతితో స్టార్క్ బౌల్డ్ చేయడంతో బంగ్లా కష్టాల్లో పడింది. లిటన్ దాస్ (20) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. ఈ దశలో ముష్ఫికర్, మహ్మదుల్లా జోడి బంగ్లా బృందంలో విజయంపై ఆశలు రేపింది. వీరిద్దరు ఒకరితో పోటీ పడి మరొకరు దూకుడుగా ఆడారు. 54 బంతుల్లో ముష్ఫికర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా, జంపా ఓవర్లో రెండు భారీ సిక్సర్లు బాదిన మహ్మదుల్లా 41 బంతుల్లోనే ఆ మైలురాయిని అందుకున్నాడు. 80 బంతుల్లోనే ఈ భాగస్వామ్యం 100 పరుగులు దాటడం విశేషం. సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయిన పరిస్థితుల్లో... 28 బంతుల్లో 80 పరుగులు చేయాల్సి ఉండగా మహ్మదుల్లా, షబ్బీర్ (0)లను వరుస బంతుల్లో కూల్టర్ నైల్ ఔట్ చేయడంతో బంగ్లా పరాజయం ఖాయమైంది.

**2** ప్రపంచకప్‌లో ఆసీస్ తరఫున వార్నర్ రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు (166) సాధించాడు. అగ్రస్థానంలో కూడా అతనే (178, అఫ్గానిస్తాన్‌పై 2015లో) ఉన్నాడు.

**6** వార్నర్ కెరీర్‌లో 150కుపైగా స్కోరు చేయ డం ఇది ఆరోసారి. ఈ జాబితాలో రోహిత్ (7) మాత్రమే అతనికంటే ముందున్నాడు.

**3** ఆసీస్ తరఫున అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్లలో గిల్‌క్రిస్ట్‌తో సమంగా వార్నర్ (16) నిలిచాడు. రికీ పాంటింగ్ (29), మార్క్‌వా (18) మాత్రమే ముందున్నారు.

**3** ఆస్ట్రేలియాకు వన్డేల్లో ఇది మూడో అత్యుత్తమ స్కోరు. గతంలో ఆ జట్టు 434/4, 417/6 స్కోర్లు సాధించింది.




వార్నర్ సెంచరీ సంబరం

### స్కోరు వివరాలు

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (సి) రూబెల్ (బి) సర్కార్ 166; ఫించ్ (సి) రూబెల్ (బి) సర్కార్ 53; ఖాజా (సి) ముష్ఫికర్ (బి) సర్కార్ 89; మ్యాక్స్‌వెల్ (రనౌట్) 32; స్టొయినిస్ (నాటౌట్) 17; స్మిత్ (ఎల్బీ) (బి) ముస్తఫిజుర్ 1; క్యారీ (నాటౌట్) 11; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ) 381.**
**వికెట్ల పతనం:** 1–121, 2–313, 3–352, 4–353, 5–354. **బౌలింగ్:** మొర్తజా 8–0–56–0, ముస్తఫిజుర్ 9–0–69–1, షకీబ్ 6–0–50–0, రూబెల్ 9–0–83–0, మెహదీ హసన్ 10–0–59–0, సర్కార్ 8–0–58–3.

**బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తమీమ్ (బి) స్టార్క్ 62; సర్కార్ (రనౌట్) 10; షకీబ్ (సి) వార్నర్ (బి) స్టొయినిస్ 41; ముష్ఫికర్ (నాటౌట్) 102; లిటన్ దాస్ (ఎల్బీ) (బి) జంపా 20; మహ్మదుల్లా (సి) కమిన్స్ (బి) కూల్టర్‌నైల్ 69; షబ్బీర్ రహమాన్ (బి) కూల్టర్‌నైల్ 0; మెహదీ హసన్ (సి) వార్నర్ (బి) స్టార్క్ 6; మొర్తజా (సి) మ్యాక్స్‌వెల్ (బి) స్టొయినిస్ 6; ఎక్స్‌ట్రాలు 17, **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 333.**
**వికెట్ల పతనం:** 1–23, 2–102, 3–144, 4–175, 5–302, 6–302, 7–323, 8–333.
**బౌలింగ్:** స్టార్క్ 10–0–55–2, కమిన్స్ 10–1–65–0, మ్యాక్స్‌వెల్ 3–0–25–0, కూల్టర్ నైల్ 10–0–58–2, స్టొయినిస్ 8–0–54–2, జంపా 9–0–68–1.

# శంకరా... ఏంటి సంగతి?

**ప్రాక్టీస్‌లో విజయ్ కాలికి బలంగా తాకిన బుమ్రా యార్కర్**

- ఇబ్బందేం లేదన్న జట్టు మేనేజ్‌మెంట్
- మరో 8 రోజుల తర్వాతే భువనేశ్వర్ ఫిట్



గురువారం ప్రాక్టీస్ సెషన్‌లో జాగింగ్ చేస్తున్న విజయ్ శంకర్, భువనేశ్వర్

**సౌతాంప్టన్:** ఇప్పటికే బొటన వేలి గాయంతో ఓపెనర్ శిఖర్ ధావన్ పూర్తిగా దూరమై, ఫిట్‌నెస్ సమస్యలతో పేసర్ భువనేశ్వర్ ఇబ్బంది పడుతున్న వేళ... టీమిండియాను కొంత కలవరపరిచే సంఘటన చోటుచేసుకుంది. బుధవారం ప్రాక్టీస్ సందర్భంగా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా వేసిన యార్కర్‌ను ఎదుర్కొనే క్రమంలో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ ఎడమ కాలి పాదానికి బంతి బలంగా తగిలింది. దీంతో అతడు నొప్పితో విలవిల్లాడాడు. అనంతరం పరిస్థితిని పర్యవేక్షించిన జట్టు మేనేజ్‌మెంట్ సాయంత్రానికి శంకర్ కోలుకున్నాడని, ఆందోళన అవసరం లేదని ప్రకటించింది. మరోవైపు గురువారం ప్రాక్టీస్‌లో దినేశ్ కార్తీక్ చాలాసేపు బ్యాటింగ్ సాధన చేశాడు. ఈ తీరు చూస్తుంటే శనివారం అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌లో అతడు తుది జట్టులో ఉండే అవకాశం కనిపిస్తోంది. శంకర్ మాత్రం బ్యాట్ పట్టలేదు. కాసేపు జాగింగ్ చేశాడు. ఇతర ఆటగాళ్ల ప్రాక్టీస్‌ను గమనిస్తూ ఉండిపోయాడు. గాయం ప్రభావం లేనట్లు సాధారణంగానే నడిచాడు. చివర్లో కొద్దిసేపు బౌలింగ్‌కు దిగినా షార్ట్ రనప్‌తో సరిపెట్టాడు. ప్రస్తుత సమీకరణాల్లో జట్టు కూర్పులో కీలకంగా మారిన శంకర్‌కు టోర్నీ ప్రారంభానికి ముందు సైతం నెట్స్‌లో బంతి మోచేతికి బలంగా తాకింది. దీంతో అతడిని న్యూజిలాండ్‌పై సన్నాహక మ్యాచ్ ఆడించలేదు. ధావన్ దూరమై, రాహుల్ ఓపెనింగ్‌కు వెళ్లిన నేపథ్యంలో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో చోటుదక్కిన శంకర్ రెండు కీలక వికెట్లు తీశాడు. శుక్రవారం టీమిండియా ప్రాక్టీస్ నుంచి విరామం తీసుకోనుంది. శనివారం అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్ ఆడనుంది.

బ్యాట్స్‌మెన్‌ను గాయపర్చాలని బౌలర్లెవరూ కోరుకోరు. మా ప్రాక్టీస్ మేం చేసుకోవాలి కదా?. నావరకైతే బ్యాట్స్‌మెన్‌కు బంతులేయడమే మంచి సాధన. ఆ దిశగానే ప్రయత్నిస్తుంటా. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. ఇదంతా ఆటలో ఒక భాగమే. నేనేం విజయ్‌ను లక్ష్యంగా చేసుకోలేదు (నవ్వుతూ). అతడు క్షేమంగానే ఉన్నాడు. ధావన్ జట్టుకు ముఖ్యమైన ఆటగాడు. తను దూరమవడం దురదృష్టకరం. దీనిని మర్చిపోయి ముందుకెళ్లాలి.



–జస్‌ప్రీత్ బుమ్రా, భారత పేసర్

### భువీ పరిస్థితేమిటో!

ప్రపంచకప్‌లో జట్టు రెండో ప్రధాన పేసర్‌గా నమ్మకం ఉంచిన భువనేశ్వర్ మరో 8 రోజుల తర్వాతే మైదానంలో దిగే పరిస్థితి కనిపిస్తోంది. తొడ కండరాలు పట్టేయడంతో పాక్‌తో మ్యాచ్ నుంచి మధ్యలో తప్పుకొన్న భువీ ఇంగ్లండ్‌తో మ్యాచ్ (జూన్ 30) సమయానికి కానీ కోలుకోడని తెలుస్తోంది. ఇప్పటికైతే అతడు ఫిట్‌నెస్ సాధిస్తాడనే బీసీసీఐ భావిస్తోంది. భువీ... బుధవారం జాగింగ్‌కే పరిమితమయ్యాడు. నెట్స్‌లో బౌలింగ్ చేయలేదు.

# లంకకు జీవన్మరణం

- నేడు ఇంగ్లండ్‌తో మ్యాచ్
- మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

**లీడ్స్:** సెమీస్ రేసులో నిలవాలంటే ఆడబోయే నాలుగు మ్యాచ్‌లూ గెలవాల్సిన పరిస్థితుల్లో మాజీ చాంపియన్ శ్రీలంక శుక్రవారం టోర్నీ ఫేవరెట్ ఇంగ్లండ్‌ను ఎదుర్కోనుంది. ప్రస్తుతం ఐదు మ్యాచ్‌ల ద్వారా నాలుగు పాయింట్లతో (ఒక గెలుపు, రెండు రద్దు, రెండు ఓటములు) ఉన్న లంకకు... జోరుమీదున్న ఆతిథ్య జట్టును నిలువరించడం శక్తికి మించిన పనే కానుంది. కరుణరత్నె బృందం మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్ ఘోర వైఫల్యాలతో పరాజయ బాటలో ఉండగా, అందుకు పూర్తి భిన్నంగా మోర్గాన్ సేన భీకర హిట్టింగ్‌తో దుమ్ము రేపుతోంది. కండరాల గాయంతో ఓపెనర్ జేసన్ రాయ్ దూరమైనా, బెయిర్‌స్టో సరైన సమయంలో జోరందుకుని ఇంగ్లండ్‌కు బెంగ లేకుండా చేశాడు. రూట్ నిలకడకు తోడు తానెంత విధ్వంసకరంగా ఆడగలడో గత మ్యాచ్‌లో కెప్టెన్ మోర్గాన్ చాటాడు. వీరికి ప్రత్యర్థి పేసర్లు లసిత్ మలింగ, నువాన్ ప్రదీప్ ఏ మేరకు కళ్లెం వేయగలరో చూడాలి. ఓపెనర్లు కెప్టెన్ కరుణ రత్నె, కుశాల్ పెరీరా మినహా మిగతా వారు పరుగులు చేయలేకపోతుండటం లంక ఓటములకు ప్రధానం కారణం. ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 205/3 నుంచి 247కు ఆలౌటైన తీరే దీనికి నిదర్శనం. కుశాల్ మెండిస్, మాథ్యూస్, తిసారా పెరీరా పూర్తిగా విఫలమవుతున్నారు. ఈ త్రయం రాణిస్తే జట్టు ఇంగ్లండ్‌పై పోరాడగలదు. ఫామ్‌లో ఉన్న పేసర్లు ఆర్చర్, వుడ్‌లను తట్టుకుని వీరు క్రీజులో నిలవడం అనుమానమే.

### ముఖాముఖి రికార్డు

ప్రస్తుత బలాబలాలు ఎలా ఉన్నా మొత్తం వన్డే గెలుపోటముల గణాంకాల్లో ఇంగ్లండ్‌కు శ్రీలంక దీటుగా నిలుస్తోంది. ఇరు జట్లు ఇప్పటివరకు 74 మ్యాచ్‌ల్లో తలపడగా లంక 35 మ్యాచ్‌ల్లో గెలిచింది. ఇంగ్లండ్ 36 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ 'టై' కాగా, రెండింట్లో ఫలితం తేలలేదు. ప్రపంచ కప్‌లో 10 మ్యాచ్‌లకుగాను నాలుగింట్లో లంక, ఆరు మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి.



కరుణరత్నె

## వచ్చే కామన్వెల్త్ క్రీడల్లో మహిళల క్రికెట్

**బర్మింగ్‌హామ్:** మహిళా క్రికెట్‌కు మరింత ప్రోత్సాహం అందించే దిశగా ఓ అడుగు పడింది. 2022లో ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్ వేదికగా నిర్వహించే కామన్వెల్త్ క్రీడల్లో మహిళల క్రికెట్‌నూ ఓ అంశంగా చేరుస్తూ కామన్వెల్త్ క్రీడల సమాఖ్య (సీజీఎఫ్) గురువారం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గత నవంబరులో అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ), ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) సంయుక్తంగా సమర్పించిన బిడ్‌ను పరిశీలించి ఆమోదించింది. 'ఇది మహిళా క్రికెట్ విశ్వవ్యాప్తం కావడానికి, మహిళా సాధికారత సాధనకు లభించిన గొప్ప అవకాశం' అని ఐసీసీ ఓ ప్రకటనలో పేర్కొంది. 1998లో కౌలాలంపూర్‌లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో తొలిసారిగా పురుషుల క్రికెట్‌ను ఓ క్రీడాంశంగా చేర్చారు. ఆ టోర్నీలో దక్షిణాఫ్రికా విజేతగా నిలిచింది. తర్వాత మరెప్పుడూ క్రికెట్ ఇందులో భాగం కాలేదు.

## పంకజ్ అద్భుత విజయం

**ఆసియా స్నూకర్ టోర్నీలో ఫైనల్లోకి**



**దోహా:** ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ ప్లేయర్ పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 5–4 (31–68, 1–54, 40–76, 1–96, 78–8, 89–33, 55–14, 89–24, 52–26) ఫ్రేమ్‌ల తేడాతో అస్జద్ ఇక్బాల్ (పాకిస్తాన్)పై అద్వితీయ విజయం సాధించాడు. బెస్ట్ ఆఫ్–9 ఫ్రేమ్‌ల పద్ధతిలో జరిగిన సెమీఫైనల్లో పంకజ్ తొలి నాలుగు ఫ్రేమ్‌లను చేజార్చుకొని ఓటమి అంచుల్లో నిలిచాడు. అయితే పంకజ్ అనూహ్యంగా పుంజుకొని ఆ తర్వాత వరుసగా ఐదు ఫ్రేమ్‌లను సొంతం చేసుకొని విజయాన్ని ఖాయం చేసుకోవడం విశేషం. నేడు జరిగే ఫైనల్లో ధనావత్ తిరపోంగ్‌పైబూన్ (థాయ్‌లాండ్)తో పంకజ్ తలపడతాడు. క్వార్టర్ ఫైనల్లో పంకజ్ 5–4తో ఆదిత్య మెహతా (భారత్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–1తో ఫంగ్ క్వోక్ వాయ్ (హాంకాంగ్)పై, రెండో రౌండ్‌లో 4–2తో నొప్పడన్ సాంగ్‌నిల్ (థాయ్‌లాండ్)పై గెలుపొందాడు.


‘జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+20 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 90

శుక్రవారం 21-6-2019

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


## రూ.30 వేల కోట్లతో ఉక్కు ఫ్యాక్టరీ


సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన పోస్కో సంస్థ ప్రతినిధులు

ఏర్పాటుకు ‘పోస్కో’ సంసిద్ధత

రూ.1,600 కోట్లతో టైర్ల కంపెనీ.. జపాన్ ‘ఏటీజీ’ ఆసక్తి

- వివరాలు 4లో

# ప్రణాళికా లోపానికి పరాకాష్ట


గురువారం హెలికాప్టర్ నుంచి పోలవరం ప్రాజెక్ట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల తీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆగ్రహం**

స్పిల్ వే, స్పిల్ ఛానల్ పూర్తి చేయకుండానే కాఫర్ డ్యామ్ పనులు చేపట్టడం ఏమిటి?

నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా పనులు ఎలా చేపట్టారు?

ఇప్పటి వరకు జరిగిన పనులపై నిపుణుల కమిటీతో ఆడిటింగ్ చేయిద్దాం...

2020 మే నాటికి 113 గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

2021 ఫిబ్రవరి నాటికి ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాల్సిందే

రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేద్దాం

పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం

పోలవరం నుంచి ‘సాక్షి’ ప్రత్యేక ప్రతినిధి

పోలవరం ప్రాజెక్ట్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్నామని, యుద్ధ ప్రాతిపదికన ఆ ప్రాజెక్టును పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఆయన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా గురువారం పోలవరం ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ప్రాజెక్టు వద్దకు చేరుకున్న జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం పనులపై మూడుసార్లు ఏరియల్ సర్వే నిర్వహించారు. తర్వాత ప్రాజెక్టు ప్రాంతంలో కలియతిరిగారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్, ఎగువ కాఫర్ డ్యామ్.. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్), డయాఫ్రమ్ వాల్, దిగువ కాఫర్ డ్యామ్ పనులను

మిగతా 2వ పేజీలో ▶

## ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణం


జస్టిస్ వెంకటరమణతో ప్రమాణం చేయిస్తున్న ఏసీజే జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్


జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌తో ప్రమాణం చేయిస్తున్న ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్

- వివరాలు 4లో








## టీడీపీ రాజ్యసభాపక్షం బీజేపీలో విలీనం

తీర్మానం చేసిన సుజనా, సీఎం రమేష్, టీజీ, గరికపాటి



గురువారం ఢిల్లీలో బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా సమక్షంలో ఆ పార్టీలో చేరిన సుజనాచౌదరి, టీజీ వెంకటేశ్, సీఎం రమేశ్

- రాజ్యసభ చైర్మన్‌కు విలీనం లేఖ అందచేసిన ఎంపీలు.. వెంకయ్యకు సమ్మతి లేఖను సమర్పించిన బీజేపీ
- ముగ్గురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జేపీ నడ్డా
- అస్వస్థతకు గురికావడంతో హాజరుకాని గరికపాటి

2లో

## ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం

- ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించాలని సీఎం వైఎస్ జగన్ ఆదేశం
- అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన
- వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టీకరణ
- నిపుణుల కమిటీ తొలి భేటీలో కీలక అంశాలపై చర్చ
- ఆగస్ట్ 20వ తేదీ నాటికి ముఖ్యమంత్రికి నివేదిక!

- వివరాలు 4లో

## లోయలో పడిన బస్సు

44 మంది మృతి

- హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలో ఘటన
- 34మందికి గాయాలు

9లో










# ప్రణాళికా లోపానికి పరాకాష్ట


గురువారం పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

"మాపై ప్రజలు అత్యంత విశ్వాసంతో అఖండ విజయాన్ని చేకూర్చారు. మాట ఇచ్చాక తప్పకూడదు. మాపై ప్రజల్లో ఉన్న సదభిప్రాయాన్ని కోల్పోవడానికి మేం సిద్ధంగా లేము. క్షేత్రస్థాయిలో పరిస్థితులను బేరీజు వేసుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేయవచ్చో చెప్పండి. పనులు పూర్తి చేయడానికి సరైన ప్రణాళిక వేసుకుందాం. అవసరమైన వనరులు సమకూరుస్తాం. ప్రాజెక్టును పూర్తి చేద్దాం"

పోలవరం ప్రాజెక్టులో ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి ఇదిగో అప్పుడు కుడి కాలువకు గ్రావిటీపై నీళ్లు ఇస్తాం.. ఇదిగో ఇప్పుడు చేస్తామని మాట మారుస్తూ వచ్చారు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు పూర్తి చేయకుండానే కాఫర్ డ్యామ్ పనులు చేపట్టడం అతి పెద్ద తప్పు. ఇటు కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేయలేకపోయారు. అటు స్పిల్ వే, స్పిల్ ఛానల్ కూడా పూర్తి చేయలేకపోయారు. పోనీ కాఫర్ డ్యామ్ నిర్మాణం పూర్తి చేసి కుడి కాలువకు నీళ్లు ఇచ్చే ఉద్దేశమైనా ఉందా అంటే అదీ లేదు. అందుకు అవసరమైన టన్నెల్(కుడి అనుసంధానం), అప్రోచ్ ఛానల్ పనులు చేయకపోవడమే అందుకు నిదర్శనం. 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని నిర్వాసితులకు పునరావాసం కల్పించలేదు. ప్రణాళిక లోపానికి, తప్పుడు విధానాలకు ఇదో పరాకాష్ట. జూలై నుంచి అక్టోబర్ వరకూ గోదావరికి భారీగా వరదలు వస్తాయి. కాఫర్ డ్యామ్, స్పిల్ వే, స్పిల్ ఛానల్ మీదుగా వరద ప్రవాహం దిగువకు వెళ్తుంది. దీనివల్ల నాలుగు నెలలపాటు ఎలాంటి పనులు చేపట్టడానికి అవకాశం ఉండదు

▶ మొదటి పేజీ తరువాయి
నిశితంగా పరిశీలించారు. వాటి స్థితిగతులపై జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ శ్రీధర్‌లను ప్రశ్నించారు. పనుల్లో పురోగతి లేకపోవడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. నిపుణుల కమిటీని పంపించి ఇప్పటివరకు చేసిన పనులపై ఆడిటింగ్ చేయిద్దామన్నారు. పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన వనరులు సమకూరుస్తామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి, రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేద్దామని అధికారులకు జగన్ పిలుపునిచ్చారు. పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత కాన్ఫరెన్స్ హాల్‌లో ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్, జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మంత్రులు కన్నబాబు, విశ్వరూప్, తానేటి వనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, ముఖ్యమంత్రి కార్యదర్శి సాల్మన్ ఆరోగ్యరాజ్, అదనపు కార్యదర్శి ధనుంజయరెడ్డిలతో కలిసి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.

### అప్పుడెంత.. ఇప్పుడెంత?

పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్‌లో 58.19 శాతం, కుడి కాలువ పనులు 91.64, ఎడమ కాలువ పనులు 69.33 శాతం.. వెరసి మొత్తం ప్రాజెక్టు పనులు 66.77 శాతం పూర్తయినట్లు ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, సీఈ శ్రీధర్‌లు జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. 2014కు ముందు పోలవరం ప్రాజెక్టు ఎంత పరిమాణం పూర్తయింది? 2014 నుంచి 2019 వరకూ ఎంత పరిమాణం పూర్తయిందో చెప్పాలని అన్నారు. పనుల పరిమాణం లెక్కలు లేవని అధికారులు బదులిచ్చారు. ఆ గణాంకాలను తన ముందుంచాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా లోతుగా సమీక్షించారు.


పోలవరం ప్రాజెక్టు పనుల గురించి అధికారులతో మాట్లాడుతున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు

"పోలవరం స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులను నవంబర్‌లో పున:ప్రారంభించి, వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సిందే. 2020 మే నాటికి స్పిల్ వేకు గేట్లు బిగించే పనులు పూర్తి కావాలి. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకోవద్దు. స్పిల్ వే, స్పిల్ ఛానల్ పనులు పూర్తయితేనే గోదావరి వరదను దిగువకు మళ్లించవచ్చు. లేదంటే ఇప్పటిలానే పరిస్థితి తయారవుతుంది. నాలుగు నెలల సమయం వృథా అవుతుంది. స్పిల్ వే, స్పిల్ ఛానల్‌కు సమాంతరంగా కాఫర్ డ్యామ్ పనులను 2020 మే నాటికి పూర్తి చేయాల్సిందే. 2020 ఫిబ్రవరి నుంచి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్(ఈసీఆర్ఎఫ్) పనులు ప్రారంభించి పది నెలల్లో పూర్తి చేస్తామంటున్నారు. పది నెలల్లో కాదు.. 12 నెలల్లో అంటే 2021 ఫిబ్రవరి నాటికి ఈ పనులు పూర్తి చేయాల్సిందే. 2020 మే నాటికి తొలి దశలో 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 113 గ్రామాల్లోని నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి"
– పోలవరం ప్రాజెక్టు పనులపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

## సమీక్షలో ముఖ్యమంత్రి, అధికారుల మధ్య సంభాషణ

**సీఎం జగన్:** స్పిల్ వే, స్పిల్ ఛానల్‌లో ఇప్పటికీ 156.54 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి పని తవ్వకం, 8.53 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు మిగిలిపోయాయి. రోజుకు ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి, కాంక్రీట్ పనులు చేయగలరు?
**సీఈ శ్రీధర్:** ఏప్రిల్ వరకూ రోజుకు గరిష్ఠంగా 40 వేల క్యూబిక్ మీటర్ల మట్టి పని, సగటున 5 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేశాం. కానీ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఆదేశాల మేరకు మే నుంచి పనులు ఆపేశాం.
**సీఎం జగన్:** స్పిల్ వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్ పనులను మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారు?
**ఈఎన్‌సీ:** అక్టోబర్ వరకూ గోదావరిలో వరద ఉంటుంది. అప్పటిదాకా పనులు చేపట్టడం సాధ్యం కాదు.
**సీఎం జగన్:** నాలుగు నెలల సమయం వృథా అన్నమాట. నాయకులకు అధికారులు వాస్తవాలు చెప్పాలి. తప్పుదోవ పట్టించకూడదు. ప్రణాళిక లేకపోవడం వల్లే కాఫర్ డ్యామ్ కట్టారు. స్పిల్ వేను పూర్తి చేయలేకపోయారు. ఇప్పుడు వాస్తవాలు చెప్పండి. స్పిల్ వే, స్పిల్ ఛానల్, కాఫర్ డ్యామ్‌ను ఎప్పటిలోగా పూర్తి చేయొచ్చు.
**సీఈ శ్రీధర్:** కేంద్ర జలసంఘం నుంచి కొన్ని డిజైన్‌లు ఆమోదం పొందాల్సి ఉంది. ఆ డిజైన్‌లు వస్తే మూడు లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ తగ్గుతుంది. అంటే.. 5.53 లక్షల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు మాత్రమే చేయాలి. స్పిల్ వే స్తంభాలు (ఫియర్స్)కు క్రిటికల్ కాంక్రీటింగ్ చేయాల్సి ఉంటుంది.
**'నవయుగ' సంస్థ ప్రతినిధి శ్రీధర్:** మార్చి నాటికి స్పిల్ వే, స్పిల్ చానల్‌ను పూర్తి చేస్తాం.
**సీఎం జగన్:** స్పిల్ వేకు గేట్ల కోసం 18 వేల టన్నుల స్టీల్ అవసరమైతే ఇప్పటిదాకా 12,583 టన్నుల స్టీల్ సేకరించారు. మిగతాది ఎప్పటిలోగా సేకరిస్తారు? హైడ్రాలిక్ సిలిండర్లు, హాయిస్ట్‌లను ఎప్పటిలోగా తెప్పిస్తారు? 2020 మే నాటికి గేట్ల పనులు పూర్తి చేయగలరా?
**'బీకెమ్' సంస్థ ప్రతినిధి:** 2020 ఫిబ్రవరి నాటికి స్పిల్ వే ఫియర్స్‌ను పూర్తి చేస్తే.. మే నాటికి గేట్ల పనులు పూర్తి చేస్తాం. జర్మనీ నుంచి హైడ్రాలిక్ సిలిండర్లు, ఇటలీ నుంచి హాయిస్ట్‌లను దిగుమతి చేసుకుంటున్నాం.
**సీఎం జగన్:** 2020 మే నాటికి స్పిల్ వే గేట్లు బిగించే పనులు పూర్తి చేయాల్సిందే. స్పిల్ వే, స్పిల్ ఛానల్‌కు సమాంతరంగా కాఫర్ డ్యామ్ పనులు 2020 మే నాటికి పూర్తి చేయాలి. లేకపోతే మళ్లీ ఇప్పటి పరిస్థితే ఉత్పన్నమవుతుంది. వీటికి సమాంతరంగా ఈసీఆర్ఎఫ్ పనులు చేపట్టవచ్చు కదా? ఎప్పటిలోగా పూర్తి చేస్తారు?
**'నవయుగ' ప్రతినిధి శ్రీధర్:** 2020 ఫిబ్రవరి నుంచి ఈసీఆర్ఎఫ్ పనులు ప్రారంభించి.. పది నెలల్లో అంటే 2020 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం.
**సీఎం జగన్:** పది నెలలు కాదు.. 12 నెలల్లో అంటే 2021 ఫిబ్రవరి నాటికి ఈసీఆర్ఎఫ్‌ను పూర్తి చేయండి. 2021 మే నాటికి జలాశయంలో 39 మీటర్ల మేర నీటిని నిల్వ చేయవచ్చు. అప్పుడు ఎన్ని మీటర్ల కాంటూర్ వరకూ ఎన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయి?
**ఈఎన్‌సీ:** జలాశయంలో 222 గ్రామాలు ముంపునకు గురవుతాయి. 39 మీటర్ల మేర జలాశయంలో నీటిని నిల్వ చేస్తే 41.15 మీటర్ల కాంటూర్ పరిధి వరకూ 113 ముంపు గ్రామాలకు పునరావాసం కల్పించాలి. 25 వేల నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంటుంది.
**సీఎం జగన్:** తొలి దశలో 113 గ్రామాల నిర్వాసితులకు 2020 మేలోగా పునరావాసం కల్పించాల్సిందే. ఇందుకు ఎంత డబ్బులు అవసరమో చెప్పండి?
**ఆర్అండ్ఆర్ కమిషనర్ రేఖారాణి:** 45 పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టాం. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం.
**సీఎం జగన్:** పునరావాస కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లు నాణ్యంగా లేవని నిర్వాసితులు ఫిర్యాదులు చేస్తున్నారు. నిర్వాసితులకు ఇళ్లు నిర్మించి ఇవ్వకుండా, అందుకు సమానమైన డబ్బులు ఇవ్వండి. కాలనీల్లో ప్లాట్లు కేటాయించండి.. నిర్వాసితులు ఇళ్లు నిర్మించుకుంటారు. అంతర్గత రహదారులు, మురుగునీటి కాలువలు, విద్యుత్ సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించండి.
**రేఖారాణి:** పునరావాస కాలనీ నిర్మాణాన్ని కాంట్రాక్టర్లకు అప్పగించాం.
**తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మురళీధర్‌రెడ్డి:** ఇళ్ల నిర్మాణంపై కాంట్రాక్టర్లు ఆసక్తి చూపడం లేదు.
**సీఎం జగన్:** అందుకే వాటికి అయ్యే వ్యయాన్ని నిర్వాసితులకు ఇవ్వమంటున్నా. పునాది వేసుకుంటే ఇంత.. కిటికీల వరకూ గోడలు నిర్మిస్తే ఇంత.. రూఫ్ లెవల్ వరకూ నిర్మిస్తే ఇంత.. పైకప్పు వేస్తే ఇంత అని నిర్ణయించి నిర్వాసితులకే ఇవ్వండి. దీనివల్ల ఒక్కో నిర్వాసితుడిపై రూ.60 వేల మేర జీఎస్టీ భారం తగ్గుతుంది కదా?
**రేఖారాణి:** అలాగే చేస్తాం.
**సీఎం జగన్:** గిరిజన నిర్వాసితులకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని హామీ ఇచ్చాం. 2005లో సేకరించిన భూమికి ఎకరానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ఇస్తామన్నాం. ఈ రెండు హామీల అమలుకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు పంపండి. జూలై నుంచి అక్టోబర్ వరకూ నాలుగు నెలల్లో వరదల వల్ల ప్రాజెక్టు పనులు చేయలేరు కాబట్టి నిపుణుల కమిటీని పంపించి ఇప్పటివరకు చేసిన పనులపై ఆడిటింగ్ చేయిద్దాం. పోలవరం నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. రెండో దశలో మొత్తం నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తాం. ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి.. కుడి, ఎడమ కాలువల ఆయకట్టుతోపాటు రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేద్దాం.



పోలవరం ప్రాజెక్ట్‌పై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్. చిత్రంలో సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, మంత్రులు అనిల్‌కుమార్ యాదవ్, పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆళ్ల నాని, అధికారులు

## నలుగురు నేతలు పార్టీని వీడితే నష్టం లేదు
### టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు



**సాక్షి, అమరావతి:** నలుగురు నాయకులు పార్టీ మారినంత మాత్రాన నష్టంలేదని, పార్టీ మారుతున్న నేతలు భవిష్యత్తులో పశ్చాత్తాప పడాల్సి వస్తుందని తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరడంపై విదేశీ టూర్‌లో ఉన్న చంద్రబాబు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రత్యేక హోదా కోసం బీజేపీతో టీడీపీ పోరాడిందని, అది మనసులో పెట్టుకుని ఈ విధమైన దుశ్చర్యలకు బీజేపీ పాల్పడటం గర్హనీయమన్నారు. ఒకరిద్దరు నేతలు స్వార్థం కోసం పార్టీ జెండాను వదిలేసినా.. భుజానికెత్తుకుని మోసే కార్యకర్తలు లక్షలాదిమంది ఉన్నారని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీలో చేరి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతామని పార్టీ మారిన నేతలు చెప్పటం అవకాశవాదానికి నిదర్శనమన్నారు. టీడీపీకి సంక్షోభాలు కొత్త కాదన్నారు.

## బీజేపీ వైపు వారే ఆకర్షితులవుతున్నారు
### 'కమలం' గూట్లో నేతల చేరికలపై ఎంపీ జీవీఎల్

**సాక్షి, న్యూఢిల్లీ :** బీజేపీ ప్రభుత్వ పనితీరుపట్ల, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల దేశ ప్రజల్లో ఉన్న ఆదరణకు ఆకర్షితులయ్యే ఏపీ, తెలంగాణ నుంచి వివిధ రాజకీయ పార్టీల నేతలు బీజేపీలో చేరుతున్నారని ఎంపీ జీవీల్ నరసింహారావు అన్నారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'బీజేపీని బలోపేతం చేసేందుకు ఇతర పార్టీల నేతలను ఆహ్వానిస్తామని ముందుగానే చెప్పాం. మేం ఏ నాయకులను ఆకర్షించలేదు. మా పార్టీపట్ల, ప్రధాని మోదీపట్ల ప్రజల్లో ఉన్న ఆదరణవల్ల అనేక పార్టీల నేతలు మా పార్టీ వైపు చూస్తున్నారు.ఎవరైనా బీజేపీలో చేరాలనుకుంటే వారిని చేర్చుకోవడంపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం'అని జీవీఎల్ చెప్పారు.

## కేసులకు భయపడి బీజేపీలో చేరలేదు
### మీడియా సమావేశంలో టీడీపీ ఎంపీ సుజనాచౌదరి

**సాక్షి, న్యూఢిల్లీ :** రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేసేందుకు బీజేపీలో చేరానని, కేసులకు భయపడి చేరలేదని టీడీపీ నుంచి బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యుడు సుజనాచౌదరి చెప్పారు. ఇక్కడి తన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'బీజేపీలోకి వెళ్లడానికి ముఖ్య కారణం ఇటీవలి ఎన్నికల తర్వాత ప్రజానాడి స్పష్టంగా తెలిసిపోయింది. బీజేపీలో చేరినందుకు చాలా సంతోషంగా ఉంది. అలాగే, మా మాతృ పార్టీ టీడీపీని వీడినందుకు బాధగా కూడా ఉంది. దేశానికి మోదీ సరైన నాయకుడు అని భావించాం. ఎన్డీయే నుంచి బయటకొచ్చినప్పుడు కూడా నేను అప్పటి మా నాయకుడికి వద్దని.. మంచిది కాదని గట్టిగా చెప్పాను. కానీ, ఆయన తన వ్యూహం ప్రకారం వెళ్లారు. హోదా అనేది ముగిసిన అధ్యాయం' అని సుజనా చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తామన్నారు.

## ఫిరాయింపులు విచారకరం

- టీడీపీ ఎంపీలు గల్లా, కేశినేని, కింజరాపు, సీతారామలక్ష్మి
- వెంకయ్య బీజేపీ మనిషి కాబట్టే ఇలా జరిగింది: కేశినేని

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం తీవ్ర విచారకరమని టీడీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ రాజ్యసభ సభ్యులు నలుగురు లెజిస్లేటివ్ పార్టీని బీజేపీలో విలీనం చేయాలంటూ ఉపరాష్ట్రపతికి రాసిన లేఖ చెల్లదని టీడీపీ పేర్కొంది. టీడీపీ ఎంపీలు గల్లా జయదేవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, తోట సీతారామలక్ష్మి గురువారం రాత్రి మీడియాతో మాట్లాడారు. కేశినేని నాని మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ వెంకయ్య నాయుడు బీజేపీ మనిషి కాబట్టే ఈ రోజు ఇలా ఈ కార్యక్రమం (టీడీపీ రాజ్యసభ ఎల్పీని బీజేపీలో విలీనం చేయాలని నలుగురు ఎంపీలు వెంకయ్యకు లేఖ ఇవ్వడం) జరిగిందని అన్నారు. పార్టీ అధ్యక్షుడు, పార్లమెంటరీ పార్టీ అనుమతి లేకుండా టీడీపీ రాజ్యసభ ఎంపీలు రాసిన లేఖ చెల్లదని ఎంపీ కనకమేడల అన్నారు.

# టీడీపీ రాజ్యసభా పక్షం బీజేపీలో విలీనం

- తీర్మానం చేసిన సుజనా, సీఎం రమేష్, టీజీ, గరికపాటి
- రాజ్యసభ చైర్మన్‌కు విలీనం లేఖ అందచేసిన ఎంపీలు
- వెంకయ్యకు సమ్మతి లేఖను సమర్పించిన బీజేపీ
- ముగ్గురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జేపీ నడ్డా
- అస్వస్థతకు గురి కావడంతో హాజరుకాని గరికపాటి


టీడీపీ రాజ్యసభాపక్షాన్ని బీజేపీలోకి విలీనం చేయడంపై ఉపరాష్ట్రపతికి లేఖ ఇస్తున్న సుజనా చౌదరి, సీఎం రమేష్ టీజీ వెంకటేష్

**విలీనం లేఖ ఇలా..**
'రాజ్యసభలో తెలుగుదేశం పక్షం ఈరోజు పక్ష నేత వైఎస్ చౌదరి, ఉప నేత సీఎం రమేశ్‌ల నాయకత్వంలో సమావేశమైంది. నరేంద్రమోదీ నాయకత్వం, అభివృద్ధి విధానాల నుంచి స్ఫూర్తి, ప్రోత్సాహం పొంది జాతి శ్రేయస్సు దృష్ట్యా మేం రాజ్యాంగం పదో షెడ్యూలులోని పేరా 4 పరిధిలో బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించాం. సంప్రదింపుల అనంతరం ఈ కింది తీర్మానం చేశాం. 1. టీడీపీ రాజ్యసభ పక్షాన్ని తక్షణం పదో షెడ్యూలు ప్రకారం బీజేపీలో విలీనం చేయాలి. 2. విలీనాన్ని ఆమోదించాలని బీజేపీ అధ్యక్షుడికి లేఖ రాయాలి. ఆయన సమ్మతిని ఒక తీర్మానం ద్వారా రాజ్యసభ చైర్మన్‌కు తెలియపరచాలని కోరాలి. 3. విలీనాన్ని పదో షెడ్యూలు ప్రకారం ఆమోదించాలని, మమ్మల్ని బీజేపీ పక్షంలో భాగస్వాములుగా గుర్తించాలని కోరుతూ రాజ్యసభ చైర్మన్‌కు లేఖ రాయాలి..' అని తీర్మానిస్తూ నలుగురు ఎంపీలు సంతకాలు చేశారు.

**సాక్షి, న్యూఢిల్లీ:** అంచనాలను నిజం చేస్తూ టీడీపీ రాజ్యసభా పక్షం బీజేపీలో విలీనమైంది. ఈమేరకు నలుగురు టీడీపీ రాజ్యసభ సభ్యులు తీర్మానం చేసి లేఖను ఇవ్వడంతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అందుకు అంగీకారం తెలిపారు. అనంతరం టీడీపీ రాజ్యసభా పక్షాన్ని విలీనం చేస్తూ తీర్మానించిన లేఖను ఆ పార్టీ ఎంపీలు సుజనా చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ గురువారం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు నివాసానికి వెళ్లి అందజేశారు. బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజ్యసభలో బీజేపీ పక్ష నేత థావర్ చంద్ గెహ్లాట్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈ సమయంలో వారి వెంట ఉన్నారు. విలీనంపై బీజేపీ సమ్మతి లేఖను కూడా జేపీ నడ్డా ఈ సందర్భంగా వెంకయ్యనాయుడికి అందజేశారు. అనంతరం వారు బీజేపీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మీడియాతో మాట్లాడారు. బీజేపీలో విలీనం లేఖపై సంతకం చేసిన నలుగురు టీడీపీ ఎంపీల్లో ఒకరైన గరికపాటి మోహన్‌రావు అస్వస్థతకు గురికావడంతో ఉప రాష్ట్రపతి నివాసానికి, బీజేపీ కేంద్ర కార్యాలయానికి రాలేదు. జేపీ నడ్డా బీజేపీ కేంద్ర కార్యాలయంలో ముగ్గురు ఎంపీలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. తొలుత పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి భూపేంద్ర యాదవ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని, దీనిద్వారా ప్రభావితమై టీడీపీ రాజ్యసభా పక్షానికి చెందిన నలుగురు సభ్యులు బీజేపీలో విలీనం కావాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. అనంతరం జేపీ నడ్డా మాట్లాడుతూ 'చాలాకాలంగా వైఎస్ చౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్, మోహన్‌రావుల మనసులో ఈ ఆలోచన ఉంది. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం వృద్ధిపథంలో నడుస్తుండడం, అమిత్‌షా సంస్థాగత నిర్వహణ సామర్థ్యాలను చూసి ప్రభావితులై ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం వీరంతా బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. వైఎస్ చౌదరి నేతృత్వంలో టీడీపీ పక్షం సమావేశమై బీజేపీలో విలీనం కావాలని తీర్మానించారు. ఇప్పుడు వారు బీజేపీ సభ్యులు. బీజేపీ సానుకూల రాజకీయాలను నమ్ముతుంది. సబ్ కా సాత్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్‌ను విశ్వసిస్తుంది. తద్వారా మేం ముందుకు సాగుతాం. ఈ నలుగురు నేతలు ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని బలోపేతం చేస్తారని విశ్వసిస్తున్నాం' అని పేర్కొన్నారు.

**జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలనే: సుజనా**
'సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశం ఆలోచన ఏమిటన్నది మీ అందరికీ తెలుసు. మేం జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలని నిర్ణయించుకున్నాం. గత ఎన్డీఏ ప్రభుత్వంలో మూడున్నరేళ్లపాటు మోదీ కేబినెట్‌లో సహాయ మంత్రిగా పనిచేసిన అనుభవం నాకు ఉంది. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని అన్ని అంశాలు సాధ్యమైనంత త్వరగా సామరస్యపూర్వకంగా పరిష్కారం కోసం బీజేపీలో చేరుతున్నాం' అని సుజనా చౌదరి పేర్కొన్నారు.

**ఉదయమే ముహూర్తం**
గురువారం పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ముగిసిన అనంతరం రాజ్యసభ సమావేశమై వాయిదాపడింది. ప్రధాని అందరికీ అభివాదం చేస్తూ వెళుతున్న సందర్భంలో వైఎస్ చౌదరి అధికారపక్షం వైపు వెళ్లి జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్ తదితరులను పలకరించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కూడా అక్కడే ఉన్నారు. విలీన ప్రక్రియను ఈరోజే పూర్తి చేయాలని ఆయన వైఎస్ చౌదరికి సూచించినట్టు సమాచారం. అనంతరం నలుగురు టీడీపీ సభ్యులు రాజ్యసభ చైర్మన్ చాంబర్‌లోకి వెళ్లి సభలోకి వస్తూ మెట్లు దిగుతుండగా గరికపాటి మోహన్‌రావు పట్టుతప్పి కిందపడ్డారు. ఆయన కాలు బెణకడంతోపాటు బీపీ పెరగడంతో వైద్య పరీక్షల అనంతరం రాంమనోహర్ లోహియా ఆస్పత్రికి తరలించారు. ఆ తరువాత టీడీపీ రాజ్యసభా పక్ష సమావేశం నిర్వహించి విలీనంపై తీర్మానం చేశారు. విలీన పత్రంపై గరికపాటి మోహన్‌రావు కూడా సంతకం చేశారు.

# కాకినాడలో టీడీపీ కాపు మాజీ ఎమ్మెల్యేల భేటీ


గురువారం కాకినాడలో సమావేశమైన కాపు నేతలు

**సాక్షి ప్రతినిధి, కాకినాడ :** జగన్ ప్రభంజనం ముందు ఘోర పరాజయాన్ని మూటగట్టుకున్న తెలుగుదేశం పార్టీలో తీవ్ర నిస్తేజం అలుముకుంది. ఫ్యాన్ గాలికి గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీ తీర్థం పుచ్చుకోవడం.. ఆ విషయమై పార్టీలో తర్జన భర్జనలు పడుతుండగానే..గంటల వ్యవధిలోనే ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన 13 మంది కీలక నేతలతో సహా పలువురు కాకినాడలోని సిటీ ఇన్ హోటల్‌లో రహస్య సమావేశం నిర్వహించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చలకు దారితీస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఓసారి గమనిస్తే.. తమ పార్టీ అధికారంలో ఉండగా చేసిన తప్పులు ఎక్కడ చుట్టుకుంటాయోనని ఆత్మరక్షణలో పడిన నేతలు..రక్షణ ఇచ్చే షెల్టర్ వెతుక్కునే పనిలో పడ్డారు. అందులో భాగంగానే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు గురువారం హుటాహుటిన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దీని వెనుక చంద్రబాబు వ్యూహం ఉందనే అభిప్రాయం ఆ పార్టీ నేతల్లోనే వినిపిస్తోంది. నాడు తెలంగాణలో రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపించినట్టే.. నేడు కేసుల నుంచి కాపాడుకోవడానికి తమ రాజ్యసభ సభ్యులను బీజేపీలోకి పంపించారన్న వాదనలున్నాయి. తనకు సన్నిహితులు, వ్యాపార భాగస్వామ్యులు, బినామీలను వ్యూహాత్మకంగా బీజేపీలోకి పంపించిన చంద్రబాబు ఆ విషయాన్ని తమకు చెప్పకుండా రహస్యంగా దాచి ఉంచడమేమిటని ఆ పార్టీకి చెందిన కాపు సామాజిక వర్గ మాజీ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగానే తామంతా ఐకమత్యంగా ఉండి, భవిష్యత్తులో ఓ నిర్ణయం తీసుకోవాలన్న అజెండాతోనే కాకినాడలో రహస్య సమావేశం నిర్వహించారని సమాచారం.

**పార్టీ మారేదిలేదంటున్న నేతలు..**
కాకినాడలోని ఓ హోటల్‌లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన సమావేశంలో కాపు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలతో సహా రాష్ట్రం నలుమూలల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నేతలు పాల్గొన్నారు. సుమారు మూడు గంటలపాటు సమాలోచనలు చేసిన టీడీపీ మాజీ ఎమ్మెల్యేలు మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటమికి గల కారణాలను సమీక్షించుకునేందుకు మాత్రమే సమావేశమయ్యామని, పార్టీ మారే ప్రసక్తే లేదంటూ ఉద్ఘాటించారు. తాము ఇప్పుడు పార్టీ మారి ఐదేళ్లు వేరొక పార్టీని ఎందుకు మోయాలని, తాము పార్టీలోనే ఉంటూ బలమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని వివరించారు. ఢిల్లీలో రాజ్యసభ సభ్యులు బీజేపీకి వెళ్లిపోతున్నారన్న ప్రశ్నకు సమాధానమిస్తూ ఢిల్లీలో ఉన్న నాయకులకు, ఇక్కడ ఉన్న తమకు చాలా తేడాలున్నాయని, వారికి ఏవేవో వ్యాపార లావాదేవీలు ఉండడంతో అవసరాల దృష్ట్యా అలా చేసి ఉండొచ్చని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు తోట త్రిమూర్తులు, జ్యోతుల నెహ్రూ, బూరగడ్డ వేదవ్యాస్, బొండా ఉమ, బడేటి బుజ్జి, మీసాల గీత, కొండపల్లి అప్పలనాయుడు, పంచకర్ల రమేష్‌బాబు, ఈలి నాని, చెంగలరాయుడు, బండారు మాధవనాయుడు, కదిరి బాబూరావు, డీసీసీబీ చైర్మన్ వరుపుల రాజా తదితరులు పాల్గొన్నారు.

ఇదం జగత్


# రిటైర్డ్ స్పెషల్ టీచర్లకూ నోషనల్ ఇంక్రిమెంట్ల వర్తింపు

## ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో గతంలో రిటైరయిన స్పెషల్ టీచర్లకూ నోషనల్ ఇంక్రిమెంట్లు వర్తింపచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.398తో పనిచేసిన రిటైర్డ్ స్పెషల్ టీచర్స్‌కూ జీవో నెం. 28 ప్రకారం నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరుతో పెన్షన్లో మార్పులుంటాయన్నారు. ఈమేరకు అకౌంటెంట్ జనరల్ అధికారులు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం ఫిబ్రవరి 2019 వరకు నోషనల్ గాను, మార్చి నుండి ఆర్థిక ప్రయోజనం లభిస్తుందని తెలిపారు.

**భాషా పండితులకు న్యాయం చేయాలి**

ఉన్నతీకరించిన భాషాపండిత పోస్టుల పదోన్నతులు భాషాపండితులకే వచ్చేలా ఉత్తర్వులు జారీ చేసి భాషా పండితులకు న్యాయం చేయాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.రవిచంద్ర కుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చంద్ర నరేష్ బాబు విద్యాశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముందుగా భాషేతర ఎస్ఏ పోస్టులకు, ప్రధానోపాధ్యాయుల పోస్టులకు పదోన్నతులు ఇచ్చిన తరువాత ఉన్నతీకరణ పదోన్నతులు చేపడతామని, భాషా పండితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

**భాషోపాధ్యాయుల ఉన్నతీకరణ చేపట్టాలి**

ప్రధానోపాధ్యాయుల స్థాయి వరకు యాజమాన్యం వారీగా పదోన్నతులు చేపట్టేందుకు అనుమతిస్తూ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తొలి సంతకం చేయడాన్ని స్వాగతిస్తున్నామని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అధ్యక్షుడు అంకాల్ కొండయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. వీటితోపాటు మిగిలిన అన్ని స్థాయిల్లో పదోన్నతులు వెంటనే చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గత ప్రభుత్వం ఉన్నతీకరణ జీవో 91ని అమలు చేయడంలో విఫలమైందని, నూతన ప్రభుత్వం అయినా వెంటనే దీన్ని అమలు చేసి భాషోపాధ్యాయులు, వ్యాయామోపాధ్యాయులకు పదోన్నతులు చేపట్టాలని వారు ప్రభుత్వానికి విన్నవించారు.

# పోరాటానికి సిద్ధం కావాలి

**సాక్షి, అమరావతి:** బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల విద్వేష రాజకీయాలను ఓడించేందుకు సైద్ధాంతిక పోరాటానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు ఆ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలో పీసీసీ కార్యవర్గ సమావేశం నిర్వహించా రు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఊమెన్ చాందీ మాట్లాడుతూ.. ప్రజాభిమానం పొందాలంటే మళ్లీ మళ్లీ ప్రజల వద్దకు వెళుతూనే ఉండాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. గెలవలేమని తెలిసినా ధైర్యంతో అభ్యర్థులు ఎన్నికల్లో నిలబడ్డారని చెప్పారు. స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీలను కేంద్రం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా రఘువీరారెడ్డి కొనసాగాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ నాయకులు ప్రసాద్, గిడుగు రుద్రరాజు, మెయ్యప్పన్, క్రిస్టోఫర్ తిలక్, శైలజానాథ్, మస్తాన్ వలీ, కె.రాజుతో పాటు పోటీ చేసిన అభ్యర్థులు పాల్గొన్నారు.

# వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు చేయాలి

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలోని 14 యూనివర్సిటీల్లో 1,109 అసిస్టెంటు ప్రొఫెసర్ పోస్టులకు క్వాలిఫై అయిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఏపీ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ స్క్రీనింగ్ టెస్టు క్వాలిఫైడ్ సంఘం ప్రభుత్వానికి వి/జ్ఞప్తి చేసింది. ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను సంఘం నేతలు కలసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయానికి సంబంధించి త్వరలోనే అన్నీ పరిశీలించి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని సంఘం నేతలు రవిబాబు, పుష్పవల్లి, గోసాల థామస్, తెలిపారు.




**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**EDP శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన**

Adv. No.11/TTD-11021(58)/1/2019-IT-TTD, తేది: 19-06-2019
దిగువ NIT నంబర్‌తో గల పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ ఓపెన్ టెండర్లు కోరబడుచున్నవి.
EDP మేనేజర్, TTD, తిరుపతి : 33 నుండి 35/EDPM/TTD/TPT/2019-20
టెండరు ప్రకటన కోసం http://www.tirumala.org ని దర్శించండి. ఇ-టెండర్‌లో పాల్గొనుటకు https://tender.ape-procurement.gov.inకు లాగిన్ అవ్వండి లేదా https://www.apeprocurement.gov.in కు లాగాన్ అవ్వండి.
Roc. No.PR4/13907/Adv.No.126/PRO/2019, Dt: 20-06-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

**TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD**
**DEPARTMENT OF TECHNICAL EDUCATION**
**TSECET-2019 ADMISSION NOTIFICATION**
**PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING, CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING**

The Qualified candidates of TSECET-2019 (Diploma Holders including Pharmacy & B.Sc Mathematics candidates) desirous of seeking admission into University and Private Engineering & Pharmacy colleges of Telangana State under lateral entry system are informed that the Admission Counselling process will commence on 22-06-2019. Minority candidates who have not qualified or not appeared in TSECET-2019, but passed and secured required percentage of marks in qualifying examination can also attend for counselling to consider them for admissions into minority colleges in leftover vacancies. Further details and counselling schedule, can be seen in the website: https://tsecet.nic.in on 22-06-2019.

Date: 20-06-2019 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSECET- 2019 & CTE
DIPR RO No. 381-DP/CL/Advt/1/2019-20, Dt:20-06-19

**TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION HYDERABAD**
**DEPARTMENT OF TECHNICAL EDUCATION**
**TSEAMCET-2019 (M.P.C STREAM) ADMISSION NOTIFICATION**
**PAYMENT OF PROCESSING FEE, SLOT BOOKING CERTIFICATE VERIFICATION AND OPTION EXERCISE FOR WEB BASED COUNSELLING**

The Qualified candidates of TSEAMCET-2019 desirous of seeking Admission into B.E / B.Tech / Pharmacy Courses are informed that the Admission counselling process will commence on 24-06-2019. Minority candidates who have not qualified or not appeared in TSEAMCET-2019, but passed and secured required percentage of marks in qualifying examination can also attend for counselling to consider them for admission into minority colleges in leftover vacancies. Further details and counselling schedule, can be seen in the website: https://tseamcet.nic.in on 24-06-2019.

Date: 20-06-2019 Sd/- Navin Mittal, IAS
Place: Hyderabad Convenor, TSEAMCET- 2019 & CTE
DIPR RO No. 382 DP/CL/Advt/1/2019-20, Dt:20-06-19

# విజయవాడలో అమెజాన్ సార్ట్ సెంటర్

- ఇక్కడి నుంచి రాష్ట్రంలో 90 కేంద్రాలకు డెలివరీ
- రాష్ట్రంలో 8,500 మంది అమ్మకందారులతో ఒప్పందం
- అమెజాన్ డైరెక్టర్ అభినవ్ సింగ్



**సాక్షి, అమరావతి:** ఆన్‌లైన్‌లో కొనుగోలుదారులకు అత్యంత చౌకగా వేగంగా వస్తువులను అందించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు అంతర్జాతీయ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ ప్రకటించింది. ఇందుకోసం దేశవ్యాప్తంగా సార్ట్ కేంద్రాలను, డెలివరీ కేంద్రాలను పెద్ద ఎత్తున విస్తరిస్తోంది. రాష్ట్రంలోని వినియోగదారులకు త్వరితగతిన వస్తువులను చేరవేయడం కోసం విజయవాడలో 25,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో సార్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే రాంచి, గోవా, సిలిగురిల్లో ఉన్న సార్ట్ కేంద్రాలకు అదనంగా విజయవాడలో మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమెజాన్ ఇండియా డైరెక్టర్ అభినవ్ సింగ్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి రాష్ట్రంలోని 90 డెలివరీ కేంద్రాలకు వేగంగా వస్తువులను చేర్చాలన్నది తమ లక్ష్యమన్నారు. ఇప్పటికే రెండేళ్ల క్రితం విజయవాడలో 20,000 క్యూబిక్ అడుగులకు పైగా నిల్వ సామర్థ్యంతో ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా రాష్ట్రంలో కొండపల్లి బొమ్మల దగ్గర నుంచి ప్రసిద్ధి చెందిన అనేక వస్తువులను అమెజాన్ ద్వారా విక్రయిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం దాదాపు 8500 మంది అమ్మకం దారులతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. వచ్చే దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకొని 17 కోట్ల మంది ఖాతాదారులకు వేగంగా ఉత్పత్తులను అందించే విధంగా మౌలిక వసతులు సిద్ధం చేసినట్లు తెలిపారు.

# రుణాల కోసం 24న కౌలు రైతుల ధర్నా

**సాక్షి, అమరావతి:** స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులు, కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన గ్రామీణ బ్యాంకుల వద్ద ధర్నాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆయా బ్యాంకుల మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వాలని పేర్కొంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై 20 రోజులు అవుతున్నా బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలోనూ కౌలు రైతులకు ఎంత మేరకు రుణాలు ఇస్తారనేది స్పష్టంగా లేదని, కేవలం పద్దుల సర్దుబాటు మాత్రమే చేస్తున్నారని ఆరోపించారు. సెంటర్ ఫర్ ఎకనమిక్, సోషల్ స్టడీస్ (సెస్) గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 32 లక్షల మంది కౌలు రైతులుంటే ప్రభుత్వం మాత్రం 16 లక్షలేనని పేర్కొంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.




సాక్షి ఉద్యోగ అవకాశాలు

**DENMARK PHOSPHATES**
AGRO - CHEMICAL COMPANY
**WANTED**
- A growing Agro Chemical Pesticides Company looking for **Areawise Sales Officers & Area Sales Managers** in Andhra Pradesh, Telangana
- **Experience :** Minimum **2 Yrs** in Agro Chemical Company.
- **Note :** Apply within **7 days**

daci.india@gmail.com

**BHASKAR AGRO CHEMICALS LIMITED**
Factory :94/1, Toophranpet Village, Choutuppal (M), Yadadri Bhuvangiri Dist.T.S 508252
Off. : 503, Riviera Apartment, 6-3-347/9, Dwarakapuri Colony, Panjagutta, Hyderabad-500 082

**Executive Assistant :** Diploma or relevant work exp., Excellent communication skills, Correspondence, MS Office.
**Accountant :** B.Com with Min 3-5 yrs exp. with Tally, GST, TDS, Book Keeping , Day to Day Accounts , Liasion with statutory department.
**Accounts Officer :** B.Com with Min 1-2 yrs. exp. with computer knowledge MS Office, Tally.
**Office Assistant :** Data Entry cum Office Assistant with experience in Word, Excel etc.
**Trainee :** Diploma/ITI Minimum 1-2 years experience in manufacturing industry.

Note : Positions are for both Office and Factory
Salary is negotiable for deserving candidates. Please send your resume to careers@bhaskaragro.com or post to our office address

**SRI SARVARAYA SUGARS LTD REQUIRES**

We are one of the reputed companies engaged in production of Sugar, Industrial Alcohol, Power, Beverages etc., having manufacturing units in East Godavari, West Godavari Districts, Andhra Pradesh and Khammam District, Telangana. We are on the lookout for the following candidates.

**GENERAL MANAGER (FINANCE & ACCOUNTS)**
*(The Candidate Should be a Qualified)*

C.A., With over 10 years experiecne in Finance & Accounts and having good computer skills in Microsoft Office Software. He willbe responsible for statutory & Cost Audits, Taxation of Direct & indirect Taxes. Interact with Company's Bankers & Financial institutions for arranging Working Capital & Term Loans, periodical reviews relating to Financial Matters, Budgets. Liaison with Statutory Authorities & Bankers/ Financial Institutions, supervision of imports & Exports documents etc., activities of Sugar, Co-Generation. Distillery, Co2 Plants. Age around 45 years. Location will be at the sugar plant in Chelluru. East Godavari District A.P.

**SALES EXECUTIVES** *(The Candidate Should be a Qualified)*

B.Sc., (Agriculture) Graduate having minimum experience of five years in sale of agriculture Products such as Organic or Inorganic fertilizers, pesticides, etc. Age around 25 to 30 years. Knowledge of Telugu is essential Candidates should be able to travel extensively and closely interact & advise the farmers. Location will be at the sugar Plant in Chelluru, East Godavari District., A.P.

**JUNIOR CHEMISTS - DISTILLERY**
*(The Candidate Should be a Qualified)*

B.sc., (maths, Physics & Chemistry) Graduate and P.G. Diploma in Fermentation & Alcohol Technology in VSI or NSI having minimum experience of 3 years in Distillery operations, quality control in Distillery operations, & analysis skills to maintain fermentation and distillation processes Age around 25 to 30 years. Knowledge of Telugu is essential. Location will be at the sugar plant at Chelluru, East Godavari District A.p.

Pay and perquisites will be commensurate with the potential and experience of the candidates. interested candidates may apply within 15 days along with their latest Passport size photograph to:

**The Joint Managing Director**
**SRI SARVARAYA SUGARS LIMITED**
12, Ethiraj Salai, Egmore, Chennai - 600 008



# గురుకుల పోస్టుల భర్తీ అస్తవ్యస్తం

**మంత్రి విశ్వరూప్‌కు అభ్యర్థుల ఫిర్యాదు**

**సాక్షి, అమరావతి:** సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలో ఉద్యోగాల భర్తీపై ప్రతిష్టంభన నెలకొంది. ఎన్నికలకు ముందు పలు పోస్టుల భర్తీకి సొసైటీ నోటిఫికేషన్ జారీ చేసింది. జిల్లా కో–ఆర్డినేటర్ పోస్టులు 4, ప్రిన్సిపాల్ 27, టీజీటీ 552, వార్డెన్ (కేర్‌టేకర్) 167 ఉద్యోగాలకు 2019 ఫిబ్రవరి 14న నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎన్నికల కోడ్ వచ్చిందని ప్రక్రియ నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగియగానే ప్రిన్సిపాల్ పోస్టులు ముందుగా భర్తీ చేసేందుకు అధికారులు నిర్ణయించారు. పరీక్ష రాసిన వారి మెరిట్ జాబితా ప్రకటించకుండా వారు అనుకున్న వారికి ఫోన్‌లు చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం పిలిపించారు. వచ్చిన వారందరినీ అర్హులు కాదని తిరస్కరించారు. దీంతో వారంతా గురుకుల విద్యాలయ సంస్థముందు ఆందోళనకు దిగారు. మొత్తం 27 ప్రిన్స్‌పాల్ పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి మెరిట్ జాబితా ఎందుకు ప్రకటించలేదని అభ్యర్థులు నిలదీయడంతో మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. వెయిటేజీ మార్కులు కలిపేందుకు గురుకులం వారు నోటిఫికేషన్‌లో ఇచ్చిన దానికీ ఆచరణలో చేస్తున్న దానికీ సంబంధం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. వెయిటేజీ మార్కుల కోసం కనీసం పది సంవత్సరాల బోధనానుభవం ఉండాలనే నిబంధన విధించారు. అయితే ఎయిడెడ్ కాలేజీల్లో పనిచేస్తున్న వారిని పరిగణనలోకి తీసుకోవడం లేదని అభ్యర్థులు చెబుతున్నారు. గురుకుల విద్యాలయాల సంస్థలో జరుగుతున్న పరిణామాలపై మంత్రి విశ్వరూప్ సమీక్షలో వివరణ కోరారు. తాము చేస్తున్నదంతా సరైనదేనంటూ గురుకుల కార్యదర్శి మంత్రికి వివరణ ఇచ్చారు. పోస్టుల భర్తీ విషయంలో కొత్త ప్రభుత్వం వద్ద వివరాలు ఉంచడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రిన్సిపాల్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు తాము పడుతున్న బాధలను వివరిస్తూ సాంఘిక సంక్షేమశాఖ మంత్రి విశ్వరూప్‌కు అర్జీ ఇచ్చారు. దీనిపై విచారణ జరపాల్సిందిగా సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

# ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం

**ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశం**

- అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచన
- వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టీకరణ
- ఆరోగ్య శాఖలో సంస్కరణలపై సర్కారు దృష్టి.. నిపుణల కమిటీ నియామకం
- సచివాలయంలో నిపుణుల కమిటీ తొలి భేటీ.. కీలక అంశాలపై చర్చ
- ఆగస్టు 20వ తేదీ నాటికి ముఖ్యమంత్రికి నివేదిక!



గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిపుణుల కమిటీతో సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రక్షాళన దిశగా అడుగు ముందుకు పడింది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించిన సంగతి తెలిసిందే. ఆరోగ్య శాఖపై ఆయన ఇటీవల నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు దిశానిర్దేశం చేశారు. ఆరోగ్య శాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన మందులు అందజేయాలని చెప్పారు. వైద్యం ఖర్చు రూ.1,000 దాటితే ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఈ పథకం కింద దేశంలో ఎక్కడైనా వైద్య సేవలు పొందవచ్చు. ఆ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. '108', '104' అంబులెన్స్ సేవలను మరింతగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. అన్ని గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి, ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. హాస్పిటళ్లలో సరిపడా సిబ్బందిని నియమించాలని చెప్పారు. బాగా పేరున్న డాక్టర్లను జిల్లాల్లో నియమించాలని, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు నిపుణుల సలహాలు, సూచనలు తీసుకోవాలని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు.

**మందుల సరఫరా వ్యవస్థ లోపభూయిష్టం**

ప్రస్తుతం రాష్ట్రంలో మందుల కొనుగోలు, సరఫరా వ్యవస్థ అత్యంత లోపభూయిష్టంగా ఉందని నిపుణుల కమిటీ సభ్యుడు డా.దుట్టా రామచంద్రరావు అన్నారు. రాష్ట్ర మౌలిక వైద్యసదుపాయాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న టెండరింగ్ విధానాలు పారదర్శకంగా లేవని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. కమిటీలో సభ్యులైన డా.చంద్రశేఖర్‌రెడ్డి, డా.సాంబశివారెడ్డిలు కూడా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కమిటీ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డా.కె.జవహర్‌రెడ్డి, డీఎంఈ డా.కె.బాబ్జీ, ఆరోగ్యశ్రీ ఇన్‌చార్జి సీఈఓ డా.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

**కమిటీ సభ్యులు జిల్లాల పర్యటనకు వెళ్లాలి**

ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీలోని సభ్యులు బృందాలుగా ఏర్పడాలని, ఒక్కో బృందం మూడు జిల్లాల్లో పర్యటించాలని కమిటీ చైర్‌పర్సన్ సుజాతారావు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులతో పాటు నర్సులు, ఏఎన్‌ఎంలు, డాక్టర్లతో మాట్లాడాలని, ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల ప్రతినిధులతో, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులతోనూ చర్చించి, వారి సలహాలు సూచనలు తీసుకోవాలని చెప్పారు.

### ఆగస్టు 20న ముఖ్యమంత్రికి నివేదిక!

వచ్చే నెల 3వ తేదీ నుంచి వరుసగా మూడు రోజుల పాటు సమావేశం కావాలని నిపుణుల కమిటీ సభ్యులు నిర్ణయించారు. జులై 20న ముఖ్యమంత్రిని సంప్రదించి, ఆయన సూచనల మేరకు ముందుకెళ్లాలని తీర్మానించారు. ఆగస్టు 20వ తేదీలోగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తమ నివేదిక అందజేయాలని భావిస్తున్నారు.

### నిపుణుల కమిటీ తొలి భేటీ

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖలో సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిపై ఇటీవల నిపుణుల కమిటీని నియమించింది. కమిటీ చైర్‌పర్సన్ సుజాతారావు ఆధ్వర్యంలో గురువారం సచివాలయంలో కమిటీ తొలిసారి సమావేశమైంది. వివిధ కీలక అంశాలపై చర్చించారు. ఇకపై 20 పడకల ఆసుపత్రులనూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకురావాలని పలువురు సభ్యులు సూచించారు. రాష్ట్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఆ పైస్థాయి ఆస్పత్రులన్నీ 24 గంటలూ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని బలోపేతం చేయాలని కమిటీ నిర్ణయించింది. ప్రతి మండలానికి ఒక '108' వాహనం, ఒక '104' వాహనం ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాత వాహనాలు పనిచేయకపోతే కొత్తవి సమకూర్చుకోవాలని సభ్యులు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రులంటే ఒక మోడల్‌గా ఉండాలని కమిటీ సభ్యులు చెప్పారు. ఇలాంటి సమూల మార్పులు రెండేళ్ల వ్యవధిలో పూర్తిచేయాల్సి ఉంటుందని చర్చించారు. ఈ సమావేశంలో వైద్యవిద్యా సంచాలకులు, వైద్య విధాన పరిషత్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్, రాష్ట్ర మౌలిక వైద్యసదుపాయాల అభివృద్ధి సంస్థ, ఆరోగ్యశ్రీ ట్రస్ట్, ఔషధ నియంత్రణ మండలి తదితర విభాగాల అధికారులు తమ నివేదికలను సమర్పించారు.

## ఆరోగ్య సేవల్లో రాష్ట్రం ఆదర్శంగా నిలవాలి

**నిపుణుల కమిటీకి సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం**

**సాక్షి, అమరావతి:** ఆరోగ్యసేవల విషయంలో దేశానికి మోడల్‌గా రాష్ట్రం ఉండాలని, దీనికోసం కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఆరోగ్యసేవల్లో సంస్కరణల కోసం ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో భేటీ అయ్యింది. సుమారు 20 నిమిషాల పాటు ఈ భేటీ కొనసాగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పలు అంశాలపై కమిటీ సభ్యులకు రాష్ట్రంలో ఆరోగ్యసేవలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో తక్షణమే ఆరోగ్యశ్రీని పూర్తిగా సమీక్షించాలని, రోగి వైద్యానికి రూ. 1,000 బిల్లు దాటితే ఆ రోగికి వైద్యం ఉచితంగా అందేలా ఆరోగ్యశ్రీలో చేర్చాలని, వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. ఏ ఒక్కరికి కూడా ఆరోగ్యశ్రీ అందడం లేదన్న వ్యాఖ్యలు వినిపించకూడదని స్పష్టం చేశారు. ఎంత పెద్ద జబ్బు చేసినా పేదలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో మండలానికొక 104 వాహనాన్ని ఏర్పాటు చేసి, పల్లెల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ మందులు అందజేయాలని సూచించారు. అలాగే 108 అంబులెన్సులు కొత్తవి కొనుగోలు చేసి బాధితుడు ఫోన్ చేసిన 20 నిమిషాల్లో ఘటనా స్థలానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఈ అంబులెన్సుల కొనుగోలుకు ఈ బడ్జెట్‌లోనే నిధులిస్తామని చెప్పారు. రాష్ట్రంలో 104, 108, ఆరోగ్యశ్రీ పథకాల్లోని ప్రస్తుత పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలన్నారు, బాధితులకు సత్వరమే సేవలందించాలని ఆదేశించారు. ప్రభుత్వం నియమించిన ఈ నిపుణుల కమిటీ పని సిఫార్సులు చేయడం వరకే కాదని, ఆరోగ్యసేవలు ఎలా అందుతున్నాయో, పేదలకు లబ్ధి జరుగుతోందా లేదా అన్న దానిపైన పర్యవేక్షణ కూడా చేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ కమిటీతో తాను 15 రోజులకోసారి సమావేశం నిర్వహించి ఆరోగ్య సేవలను సమీక్షిస్తానని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కంటి వైద్య క్యాంపులు, హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, ప్రాథమిక దశలోనే జబ్బులను గుర్తించి దానికి సంబంధించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు.



మొదటి ఫైల్‌పై సంతకం చేస్తున్న మంత్రి పుష్పశ్రీవాణి

## ఆదర్శప్రాయంగా గిరిజన సంక్షేమం

**గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి**

**సాక్షి, అమరావతి:** గిరిజన సంక్షేమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ముందడుగు వేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పాముల పుష్ప శ్రీవాణి చెప్పారు. గురువారం సచివాలయంలో వేదపండితుల ఆశీర్వచనం మధ్య తన చాంబర్‌లోకి ప్రవేశించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పార్టీ మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేస్తామని, వైఎస్సార్ పెళ్లి కానుకగా రూ. లక్ష రూపాయలు, గిరిజన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, గిరిజన తండాలు గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు వంటి విషయాలలో తాము చెప్పింది కచ్చితంగా చేస్తామన్నారు. దేశ రాజకీయ చరిత్రలోనే తొలిసారి గిరిజనులకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గిరిజన జీవితాలలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి ఉన్నారన్నారు. కమ్యూనిటీ వర్కర్ల జీతాల పెంపునకు సంబంధించిన ఫైల్‌పై పుష్పశ్రీవాణి తొలి సంతకం చేసారు. గిరిజన ప్రాంతాలలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.19.97 కోట్లకు పరిపాలనా పరమైన ఆమోదం ఇస్తూ రెండో సంతకం చేసారు. ఐటీడీఏల్లో పాలనాపరమైన సంస్కరణలను తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుడు గంధం చంద్రుడు, జాయింట్ సెక్రటరీ నాయక్, ట్రైకార్ ఎండీ రవీంద్రబాబు, ఇంజనీర్ ఇన్ చీఫ్ శేషుకుమార్, శ్రీశైలం ఐటీడీఏ ఇఇ జగజ్యోతి, మంత్రి భర్త శత్రుచర్ల పరీక్షిత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుస్తాం

**విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టీకరణ**



సచివాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి సురేష్

**సాక్షి, అమరావతి:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటి రూపురేఖలు మారుస్తామని విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చెప్పారు. గురువారం వెలగపూడి సచివాలయంలోని తన చాంబర్లోకి మంత్రి ప్రవేశించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. స్కూళ్లలో మౌలిక సదుపాయాలపై ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ, ఇతర అంశాలకు సంబంధించి త్వరలోనే కమిషన్ ఏర్పాటు చేస్తామన్నారు. వైఎస్సార్ అక్షయపాత్ర ద్వారా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడమే సర్కారు లక్ష్యమని చెప్పారు. మంత్రి సురేష్ గురువారం మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. ఎస్‌జీటీ నుంచి హెడ్మాస్టర్ల వరకు దాదాపు 19 వేల మందికి పదోన్నతులు కల్పించేందుకు అనుమతిస్తూ తొలి సంతకం చేశారు. రాష్ట్రంలో 2019–2024 విద్యా విధానం దశదిశ నిర్దేశించేందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు వీలుగా మరో ఫైల్‌పై సంతకం చేశారు. సీసీఈ విధానంలో ప్రస్తుతం పదో తరగతిలో కొనసాగుతున్న 20 మార్కుల అంతర్గత మార్కులను రద్దు చేస్తూ మూడో సంతకం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి సురేష్‌ను మాజీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, కాలేజీ విద్య, ఇంటర్ విద్య, పాఠశాల విద్యల కమిషనర్లు సుజాతాశర్మ, కాంతిలాల్ దండే, సంధ్యారాణి, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, కత్తి నర్సింహారెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ నేతలు శేఖరరెడ్డి, వెంకటరెడ్డి సహా పలు సంఘాల నేతలు కలసి అభినందనలు తెలియచేశారు.

# రూ.30 వేల కోట్లతో ఉక్కు ఫ్యాక్టరీ

- ఏర్పాటుకు 'పోస్కో' సంసిద్ధత
- రూ.1,600 కోట్లతో టైర్ల కంపెనీ.. జపాన్ 'ఏటీజీ' ఆసక్తి
- రాష్ట్రానికి విదేశీ కంపెనీల రాక!
- సూపర్ ప్రోయాక్టివ్ కింద కంపెనీలకు అనుమతులివ్వాలని అధికారులకు సీఎం ఆదేశం



టీసీఎల్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమైన సీఎం వైఎస్ జగన్

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన కొద్ది రోజుల్లోనే భారీ పెట్టుబడులు పెట్టేందుకు పలు విదేశీ కంపెనీలు ముందుకొస్తున్నాయి. అంతర్జాతీయంగా పేరుపొందిన కొరియాకు చెందిన పోస్కో స్టీల్ కంపెనీ, జపాన్‌కు చెందిన ఏటీజీ టైర్ల కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేశాయి. సుమారు రూ.30,000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగ సంస్థ ఆర్‌ఐఎన్‌ఎల్ (విశాఖ స్టీల్)తో కలిపి ఏర్పాటు చేయడానికి పోస్కో ఆసక్తి చూపిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో కలిసిన పోస్కో కంపెనీ ప్రతినిధులు స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను తెలియచేశారు. పోస్కో ఇండియా చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ గిల్‌హో బాంగ్, పోస్కో మహారాష్ట్ర సీఎఫ్‌వో గూ యంగ్ అన్‌లతో పాటు పోస్కో సీనియర్ ప్రతినిధులు సీఎంను కలసిన వారిలో ఉన్నారు. ఇప్పటికే విశాఖలో స్టీల్ ప్లాంట్ ఉన్నందున వైఎస్సార్ జిల్లాలో కర్మాగారం ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వారిని కోరారు. దీనికి అంగీకరించిన పోస్కో ప్రతినిధులు కడపలో కర్మాగారం ఏర్పాటు సాధాసాధ్యాలపై మూడు నెలల్లో నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ యూనిట్ ఏర్పాటు ద్వారా సుమారు 6,000 మందికి ఉపాధి లభించనున్నట్లు కంపెనీ ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి రజిత్ భార్గవ, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ తదితరులు పాల్గొన్నారు.

**విశాఖలో ఏటీజీ టైర్ల కంపెనీ!**

విశాఖ జిల్లా అచ్యుతాపురం సమీపంలో సుమారు రూ.1,600 కోట్లతో భారీ టైర్ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు జపాన్‌కు చెందిన అలయన్స్ టైర్ గ్రూపు (ఏటీజీ) ఆసక్తి కనపరుస్తోంది. సుమారు 100–125 ఎకరాల్లో అచ్యుతాపురం సెజ్‌లో దీన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను అందచేసింది. వ్యవసాయ, నిర్మాణ రంగ యంత్రాలకు వినియోగించే భారీ టైర్లను ఏటీజీ తయారు చేస్తోంది. ఇప్పటికే మహారాష్ట్రలో ఒక యూనిట్ ఉండగా విశాఖ వద్ద మరో యూనిట్ ఏర్పాటు చేయడానికి కంపెనీ ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనలు పరిశీలించి త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

### టీసీఎల్ సమస్యలను తక్షణం పరిష్కరించాలి: సీఎం

చిత్తూరు జిల్లాలో టీవీ ప్యానల్ యూనిట్ ఏర్పాటు చేసిన చైనాకు చెందిన ఎలక్ట్రానిక్ సంస్థ టీసీఎల్ కంపెనీ ప్రతినిధులు కూడా ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. సుమారు రూ.2,200 కోట్లతో 153 ఎకరాల్లో డిస్‌ప్లే ప్యానల్ యూనిట్‌కు గత డిసెంబర్‌లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే భూమి, నీటి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయినట్లు టీసీఎల్ ఇండస్ట్రియల్ హోల్డింగ్స్ సీఈవో కెవిన్ వాంగ్, టీటీఈ ఎలక్ట్రానిక్స్ చైర్మన్ అలెన్ చెన్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సూపర్ ప్రోయాక్టివ్ క్లియరెన్స్ కింద అన్ని ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని, టీసీఎల్ సమస్యలను పరిష్కరించి త్వరగా పనులు మొదలయ్యేలా చూడాలని పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ శాఖల అధికారులను ఆదేశించారు. కంపెనీలకు అనుమతుల మంజూరులో అవినీతికి తావు ఉండకూడదని, ఉద్దేశపూర్వకంగా అనుమతులు ఆపినట్లు తెలిస్తే ఎంత స్థాయి రాజకీయ నాయకుడైనా, అధికారి అయినా క్షమించే ప్రశ్నే లేదని సీఎం స్పష్టం చేశారు. ఎంత మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి? రాష్ట్రానికి ఆర్థికంగా ఏ మేరకు ప్రయోజనం కలుగుతుందనే అంశాల ఆధారంగా ఆయా కంపెనీలకు రాయితీలు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఇద్దరు హైకోర్టు న్యాయమూర్తుల ప్రమాణం

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్, జస్టిస్ మటం వెంకటరమణలు ప్రమాణం చేశారు. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ గురువారం వీరితో ప్రమాణం చేయించారు. ప్రధాన న్యాయమూర్తి కోర్టు హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో.. మొదట వీరి నియామకాలకు సంబంధించి అటు రాష్ట్రపతి జారీచేసిన ఉత్తర్వులు, ఇటు కేంద్ర ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్లను రిజిస్ట్రార్ బి.రాజశేఖర్ చదివి వినిపించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, ఇద్దరు న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు, అడ్వొకేట్ జనరల్ సుబ్రహ్మణ్యశ్రీరామ్, అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ అనంతరం ఏసీజే జస్టిస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ కేసులను విచారించగా.. జస్టిస్ ఆకుల వెంకటశేషసాయితో కలిసి జస్టిస్ వెంకటరమణ కేసులను విచారించారు.

**జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ నేపథ్యం**

విజయనగరం జిల్లా పార్వతీపురంలో 1964 మేలో చీకటి నరహరిరావు, విజయలక్ష్మి దంపతులకు జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ జన్మించారు. వీరిది వ్యవసాయ కుటుంబం. వీరి తాత చీకటి పరశురాంనాయుడు విజయనగరం జిల్లాలో రైతు నాయకుడు, న్యాయవాది కూడా. 1980 దశలో రాష్ట్ర మంత్రిగా కూడా పనిచేశారు. మానవేంద్రనాథ్‌రాయ్ 2002లో జిల్లా జడ్జి కేడర్‌లో జుడీషియల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. 2003 జనవరి ఆరో తేదీ వరకు అనంతపురం మొదటి అదనపు జిల్లా జడ్జిగా, అనంతరం విశాఖపట్నం 4, 5, 6వ అదనపు జిల్లా జడ్జిగా, 2006 నుంచి 2009 ఏప్రిల్ వరకూ హైదరాబాద్ మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జిగా, 2009 నుంచి 2012 వరకు విశాఖ జిల్లా జడ్జిగా, 2012 నుంచి 2013 వరకు కృష్ణా జిల్లా జడ్జిగా, 2013 ఏప్రిల్ నుంచి 2015 జూన్ 30 వరకు ఏపీ వ్యాట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పనిచేశారు. 2015 జూలై నుంచి హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌గా పని చేస్తున్నారు. ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియ సాఫీగా సాగిపోవడంలో కీలక పాత్ర పోషించారు.

**జస్టిస్ వెంకటరమణ నేపథ్యం**

అనంతపురం జిల్లా, గుత్తి స్వస్థలం. ఆయన తండ్రి ఎం.నారాయణరావు. న్యాయవాదిగా ఆయనకు మంచి పేరుంది. 1982లో వెంకటరమణ న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యాక తండ్రి వద్దే మెళకువలు నేర్చుకున్నారు. తర్వాత సీనియర్ న్యాయవాది జయరాం వద్ద న్యాయవాదిగా రాటుదేలారు. 1987లో జుడీషియల్ సర్వీసులోకి ప్రవేశించి వివిధ హోదాల్లో పనిచేశారు. మొన్నటి వరకు హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జిగా వ్యవహరించారు. హైకోర్టు విభజన తర్వాత కర్నూలు ప్రధాన జిల్లా జడ్జిగా నియమితులయ్యారు.

**తెలంగాణ**

## 27 నుంచి ఇంజనీరింగ్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

**సాక్షి, హైదరాబాద్:** ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని తెలంగాణ ఎంసెట్ ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. గురువారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రవేశాల కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఫీజుల వ్యవహారంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో వీలైనంత త్వరగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. ఎంసెట్, ఈసెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎంసెట్‌కు ఈనెల 24 నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. స్లాట్ బుక్ చేసుకున్న వారికి హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ఈ నెల 27 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించాలని నిర్ణయించింది.

# ఇన్‌చార్జి మంత్రులు వీరే!

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌చార్జి మంత్రులను నియమించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాయిలో జరిగిన నిర్ణయం మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆదేశాలు జారీ అయ్యే అవకాశం ఉందని విశ్వసనీయంగా తెలిసింది. ఈ మంత్రులు తాము ఇన్‌చార్జిగా ఉండే జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలను, పాలనాపరమైన వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. ఇంఛార్జి మంత్రులుగా నియమితులు కానున్న వారి వివరాలు.. శ్రీకాకుళం –వెల్లంపల్లి శ్రీనివాస్ (దేవాదాయ శాఖ), విజయనగరం– చెరుకువాడ శ్రీ రంగనాథరాజు (గృహ నిర్మాణం), విశాఖపట్టణం–మోపిదేవి వెంకటరమణ (పశు సంవర్థక, మత్స్యశాఖ), తూర్పు గోదావరి– ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) ఉపముఖ్యమంత్రి (వైద్య, ఆరోగ్య శాఖ), పశ్చిమగోదావరి – పిల్లి సుభాష్ చంద్రబోస్–ఉపముఖ్యమంత్రి (రెవెన్యూ), కృష్ణా – కురసాల కన్నబాబు (వ్యవసాయ, సహకార శాఖ), గుంటూరు – పేర్ని వెంకట్రామయ్య (నాని) (రవాణా, సమాచార శాఖ), ప్రకాశం – పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ (జల వనరుల శాఖ), నెల్లూరు – మేకతోటి సుచరిత, ఉప ముఖ్యమంత్రి (హోంశాఖ), వైఎస్సార్ కడప – బుగ్గన రాజేంద్రనాథ్ (ఆర్థిక, ప్రణాళిక శాఖ), కర్నూలు – బొత్స సత్యనారాయణ (మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ), అనంతపురం–పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (పంచాయితీరాజ్–గ్రామీణాభివృద్ధి), చిత్తూరు–మేకపాటి గౌతమ్‌రెడ్డి (ఐటీ, పరిశ్రమల శాఖ).

# కోడెల కుటుంబ కబ్జా పర్వం

**17.52 ఎకరాలు ఆక్రమించిన కోడెల కుమారుడు.. 16 మంది ఫిర్యాదు**



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులు

**సాక్షి ప్రతినిధి, కాకినాడ/సత్తెనపల్లి:** అధికారాన్ని అడ్డం పెట్టుకొని మాజీ స్పీకర్ కోడెల కుటుంబం చేసిన దౌర్జన్యాల పర్వం రోజుకొకటి వెలుగు చూస్తోంది. తమకు చెందిన 17.52 ఎకరాల భూమిని కబ్జా చేశారంటూ కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామ్, అతని పీఏ గుత్తా నాగప్రసాద్‌పై సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామానికి చెందిన 16 మంది బాధిత రైతులు గురువారం సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ మౌనిషాకు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధిత రైతు గొడుగుల సుబ్బారావు మాట్లాడుతూ.. ధూళిపాళ్ల సమీపంలోని మొత్తం 17.52 ఎకరాల భూమిని 16 మంది రైతులు సాగు చేసుకుంటున్నారన్నారు. 1900 సంవత్సరం పూర్వం నుంచి తమ ముత్తాత తాతల నుంచి ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కుటుంబం కింద 7 గృహాలు ఉన్నాయన్నారు. అయితే ఈ స్థలంపై కోడెల కుమారుని కన్ను పడటంతో తమను వేధించడం మొదలు పెట్టారని వివరించారు. 2016 ఏప్రిల్ 2న రాత్రి 9.30 గంటల సమయంలో కోడెల శివప్రసాదరావు పీఏ గుత్తా నాగప్రసాద్, యెలినేడి శ్రీనుతోపాటు సుమారు 20 మంది రౌడీ షీటర్లు పౌల్ట్రీ ఫారంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలు పగుల గొట్టారన్నారు. రూ. 2 లక్షల డబ్బులు, 40 గ్రాముల గోల్డ్ చైన్ తీసుకొని ఇంట్లో మహిళలను కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూమిని వదిలి పెట్టి వెళ్లిపోకుంటే చంపేస్తామని బెదిరించారని తెలిపారు. 2016 ఏప్రిల్ 4న కూడా కోడెల అనుచరులు పోలీసుల సహాయంతో దౌర్జన్యం చేశారని వివరించారు. రెండు పౌల్ట్రీ షెడ్లలో ఉన్న 10 వేల కోళ్లు, వందలాది పొట్టేళ్లను తీసుకెళ్లారని చెప్పారు. కోటిన్నర విలువైన ఆస్తిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. వీరి వేధింపులు తాళలేక భయపడి ఇన్నాళ్లూ తమ కుటుంబం హైదరాబాద్‌లో తల దాచుకుందన్నారు. ప్రస్తుతం అందరూ కేసులు పెడుతున్నారని తెలిసి మేము ధైర్యంగా కేసు పెట్టామని, న్యాయం చేయాలని కోరారు.

**తూర్పుగోదావరిలోనూ కోడెల లీలలు**

కోడెల కుటుంబ అక్రమాలు తూర్పుగోదావరి జిల్లాలోనూ బయటపడుతున్నాయి. కోడెల శివరాం రాజానగరం గ్రామ రెవెన్యూ పరిధిలోని 10 ఎకరాల భూమిలో ఫార్మా ఉత్పత్తుల గోడౌన్ కోసం అడ్డగోలు నిర్మాణాలు ప్రారంభించారు. అటు పంచాయతీ నుంచిగానీ, ఇటు గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ (గుడా) నుంచి గాని ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. అప్పట్లో ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. తాజాగా ఈ నెల 19న గుడా అధికారులు శివరామకృష్ణకు నోటీసులు జారీ చేశారు. ఇదే విషయాన్ని గుడా వైస్ చైర్మన్ అమరేంద్ర కుమార్ 'సాక్షి' వద్ద ధ్రువీకరించారు.

**తెలంగాణ**

## నేడు 'కాళేశ్వరం' ప్రారంభం

**సాక్షి, హైదరాబాద్/అమరావతి:** కాళేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టును తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శుక్రవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించనున్నారు. మేడిగడ్డ పంప్‌హౌస్‌లోని 6వ నంబర్ మోటార్‌ను ఆన్ చేయడం ద్వారా గోదావరి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌లు హాజరుకానున్నారు. వైఎస్ జగన్ శుక్రవారం ఉదయం 8 గంటలకు విజయవాడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కాళేశ్వరం వెళ్తున్నారు. అక్కడ తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో కలిసి ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న తరువాత తిరిగి మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో విజయవాడ చేరుకుంటారు. తెలంగాణలోని 70 శాతం భూభాగానికి 40లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే దిశగా తొలి అడుగు పడనుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ప్రాజెక్టు పనులన్నీ ఇప్పటికే పూర్తయ్యాయి. గోదావరిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో తొలి ఎత్తిపోతలు మొదలు కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధికారులు మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్‌లలో ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. మేడిగడ్డ బ్యారేజీ, కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద యాగశాలలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. రుత్వికులు, పండితులు ఇప్పటికే అక్కడ హోమాలకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య గవర్నర్, ముగ్గురు ముఖ్యమంత్రులు మేడిగడ్డ బ్యారేజీ వద్ద పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అక్కడే ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. ఈ కార్యక్రమం ముగిసిన వెంటనే గవర్నర్, ముగ్గురు ముఖ్యమంత్రులు మేడిగడ్డ పంప్‌హౌస్ ఉన్న కన్నెపల్లికి హెలికాప్టర్‌లో చేరుకొని పూర్ణాహుతిలో పాల్గొంటారు.

www.Lntecc.com

# L&T Builds Infrastructure Project for Telangana's Lifeline.

## Hon'ble Chief Minister of Telangana, inaugurates Medigadda Barrage today!




An integral part of Telangana's ambitious Kaleshwaram Project, the Medigadda Barrage will be inaugurated today by the Hon'ble Chief Minister of Telangana, Shri K. Chandrashekar Rao, in the august presence of Hon'ble Governor, Telangana and Andhra Pradesh states, Shri E.S.L. Narasimhan and Chief Guests, Hon'ble Chief Minister of Maharashtra, Shri Devendra G Fadnavis and Hon'ble Chief Minister of Andhra Pradesh, Shri Jaganmohan Reddy.

Built by Larsen & Toubro in just 24 months, the Medigadda Barrage will be a vital irrigation infrastructure to lift an estimated 180 TMC of water per year from the river Godavari to the Sripada Yellampalli Project to provide drinking water, facilitate irrigation and meet industrial needs in 23 districts of Telangana.

The 1.6km long Medigadda Barrage has 85 gates, piers and associated guide bunds and flood bunds of 18.03km on either side of the barrage. This infrastructure project is another example of the engineering and construction prowess of L&T and an affirmation of its promise to build the projects that make the nation proud!

### Project Highlights

- 1,625m long barrage with 85 vents, piers length of 110m
- Barrage radial gates 17nos of 15m x 13m for under sluice bays and 68nos of 15m x 12m for spillway bays
- 18.03km guide bunds/flood bunds on both sides of the barrage
- Road bridge with clear carriage way of 7.50m on barrage and 17km approach roads on both the banks

**L&T Construction**
Heavy Civil Infrastructure
*A brand of Larsen & Toubro Limited*

Regd. Office: Larsen & Toubro Limited, L&T House, N. M. Marg, Ballard Estate, Mumbai - 400 001, INDIA. CIN: L99999MH1946PLC004768



**HONDA**
The Power of Dreams

కలలను సాకారం చేస్తాం

CB Shine **LIMITED EDITION**

## ఇప్పుడు షైన్ అయ్యేందుకు ఎటువంటి లిమిట్స్ లేవు

మీకు నచ్చిన సిబి షైన్, ఇప్పుడు లిమిటెడ్ ఎడిషన్‌లో కూడా,
రెండు ఆకర్షణీయమైన డ్యూయల్ టోన్ కలర్స్‌తో పాటు. కేవలం లిమిటెడ్ సమయానికి మాత్రమే.




**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49 - 50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**

Follow us on

**Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA:** Mithra Honda – 8297235235, 0866 -2442149; Sri Santosh Honda - 9703123445, 8019669955; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda- 9703247365, 9703218817; **GUDIVADA:** Pruthvi Honda - 8977185999, 8977803888; **JAGGAIAHPET:** Mithra Honda - 08297557149/50; **MYLAVARAM:** Mithra Honda - 8297568888; **KAANURU:** Sri Santosh Honda - 08666452666, 9618909494; **GANNAVARAM:** Sri Santosh Honda - 9912195558, 9391935558; **VISSANNAPETA:** Aishwarya Honda - 08673-272722, 9000866319; **TIRUVURU:** Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; **KAIKALURU:** Pruthvi Honda - 08677-225555, 9642854888; **MACHILIPATNAM:** Nagasai Honda - 9676945616; **KANCHIKACHERLA:** Sri Spandana Honda - 08678-273066, 8523034242; **NANDIGAMA:** Apple Honda - 07660867711, 08678-279001; **CHALLAPALLI:** Annapurna Honda - 8499900065; **NUZIVIDU:** Srishivani Honda - 7893194444; **VUYYURU:** Pruthvi Honda - 08676236236, 8142026888; **IBRAHIMPATNAM:** Leo Honda - 9348686966; **KANKIPADU:** Sri Santosh Honda - 7901097975; **HANUMAN JUNCTION:** Anvita Honda - 9492225959, 08656-245959.
**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**

సాక్షి

శుక్రవారం, జూన్, 21

# జమిలి పరీక్ష

'ఒక దేశం–ఒకే ఎన్నిక' పేరుతో వచ్చిన జమిలి ఎన్నికల ప్రతిపాదనపైన భిన్నాభిప్రాయాలు వెల్లడి కావడం సహజం. రెండవ విడత ప్రధానిగా ప్రమాణం స్వీకరించిన వెంటనే నరేంద్రమోదీ ప్రదర్శించిన పూనికలలో అత్యంత కీలకమైనది ఈ అంశం. మొత్తం నలభై రాజకీయ పార్టీలను సమాలోచనకు ఆహ్వానిస్తే దాదాపు సగం పార్టీల (21) ప్రతినిధులు ఢిల్లీలో బుధవారం జరిగిన అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్నారు. లోక్‌సభకూ, శాసనసభలకూ ఏకకాలంలో సమాంతరంగా ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన మోదీ మదిలో కొంతకాలంగా మెదులుతున్నదే. ఒకేసారి ఎన్నికలు జరిగితే ఖర్చు కలసి వస్తుందనీ, ఎన్నికల నియమావళి పేరుతో నిష్క్రియాపరత్వం పాటించవలసిన రోజుల సంఖ్య తగ్గుతుందనీ, ప్రతి సంవత్సరం రెండు, మూడు రాష్ట్రాలలో ఎన్నికలు జరగడం వల్ల కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ సైతం కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి సంకోచిస్తుందనీ, ఒకేసారి అన్ని ఎన్నికలు జరిగితే ప్రభుత్వాలన్నీ పరిపాలనపైన దృష్టి పెట్టవచ్చుననీ ఈ ప్రతిపాదనకు అనుకూలంగా చెప్పుకోదగిన అంశాలు. 1967 ఎన్నికలలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఏక ఛత్రాధిపత్యం అంతమైంది. ప్రాంతీయపార్టీల ప్రాభవం పెరిగింది. సంకీర్ణయుగం మొదలయింది. ఈ కారణాల వల్ల అస్థిరత చోటు చేసుకున్నది. పరిపాలనకు గండి పడింది. అతుకుల బొంతల సంకీర్ణాలు ప్రభుత్వాలు ఏర్పరచడం, పార్లమెంటులో అడుగుపెట్టకుండానే ప్రధాని రాజీనామా సమర్పించిన సందర్భం కూడా చూశాం. ఐదేళ్ళకు ఒకసారి అన్ని శాసన వ్యవస్థలకూ ఎన్నికలు జరగడం వల్ల దేశంలో రాజకీయ సుస్థిరత నెలకొనడానికి ఆస్కారం ఉన్నది. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలకు నష్టం వాటిల్లుతుందనీ, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి సహజమైన ఆధిక్యం ఉంటుందనీ, భిన్నత్వంలో ఏకత్వం సూత్రం దెబ్బతింటుందనీ, దేశ సమగ్రతకు జమిలి ఎన్నికలు భంగం కలిగిస్తాయనే వాదనలు ఉన్నాయి. పరోక్షంగా అధ్యక్ష వ్యవస్థకు దారితీసే ప్రమాదం ఈ ప్రతిపాదనలో ఉన్నదనే భయాలు వ్యక్తం అవుతున్నాయి. సందేహాలు ఉన్నంత మాత్రాన చర్చకు వెనకాడనక్కరలేదు. ప్రధాని అఖిలపక్షం ఏర్పాటు చేసినప్పుడు హాజరు కాకపోవడం పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. సమావేశానికి వెళ్ళి తమ అభిప్రాయాలను స్పష్టంగా చెప్పడమే విజ్ఞత.

జమిలి ఎన్నికలు నిర్వహించాలంటే కొన్ని శాసనసభల పదవీ కాలాన్ని పొడిగించాలి. మరి కొన్ని శాసనసభల గడువును కుదించవలసి రావచ్చు. ఇటువంటి పని ఏది చేయాలన్నా రాజ్యాంగ సవరణ అవసరం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందాలంటే ఉభయ సభలూ మూడింట రెండు వంతుల మెజారిటీతో ఆమోదించాలి. నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ)కి లోక్‌సభలో మూడింట రెండు వంతుల ఆధిక్యం ఉన్నది కానీ రాజ్యసభలో లేదు. అందుకే ప్రాంతీయ పార్టీలను ప్రసన్నం చేసుకోవడానికీ లేదా చీల్చడానికీ మోదీ ప్రభృతులు ప్రయత్నిస్తున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు రాజ్యసభ సభ్యులు పార్టీని చీల్చడం, బీజేపీలో విలీనం కావడం ఇందుకు తాజా నిదర్శనం. రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ ఎన్‌డీఏకి దక్కితే ఎన్నికల సంస్కరణలతో సరిపెట్టుకోదనీ, కశ్మీర్‌పైన ప్రభావం చూపించే 370వ అధికరణను సవరించే ప్రయత్నం చేయవచ్చుననీ ప్రజాస్వామ్యవాదులు కొందరు భయపడుతున్నారు. వారి భయాలు నిర్హేతుకమైననవి విశ్వాసం కలిగించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి ఉంది. సమాంతర ఎన్నికలపైన 2018 ఆగస్టులో లా కమిషన్ ఒక ముసాయిదా నివేదిక సమర్పించింది. దాని ప్రకారం చట్టానికి సవరణ చేసిన తర్వాత దానిని దేశంలోని సగం రాష్ట్రాల శాసనసభలు ఆమోదించాలి. బీజేపీ సగానికి పైగా రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కారణంగా అది తేలికే. మోదీ వంటి ప్రతిభావంతుడైన నాయకుడు ఎన్నికల ప్రచారం చేసిన తర్వాత ప్రజలు లోక్‌సభకీ, శాసనసభలకీ ఒకే విధంగా ఓటు చేసే అవకాశం ఉన్నది. 2019లో ఒడిశా ప్రజలు లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి పట్టం కట్టి శాసనసభ ఎన్నికలలో నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతాదళ్‌ను అయిదో విడత గెలిపించి విచక్షణాజ్ఞానం ప్రదర్శించారు. నిరుడు రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీని ఓడించిన ఓటర్లు మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో అదే పార్టీకి ఘనవిజయం కట్టబెట్టారు. కానీ అసెంబ్లీ ఎన్నికలూ, లోక్‌సభ ఎన్నికలూ ఒకేసారి జరిగి ఉంటే అసెంబ్లీ ఎన్నికలలో కూడా బీజేపీ గెలిచి ఉండేదేమో.

కేంద్రంలో ప్రభుత్వం గడువు కంటే ముందు పడిపోయినా, రాష్ట్రాలలోని ప్రభుత్వాలు పార్టీ ఫిరాయింపుల కారణంగా కుప్పకూలినా కష్టమే. కేంద్ర ప్రభుత్వం పడిపోతే లోక్‌సభకు మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలి. దానితో పాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకూ ఎన్నికలు నిర్వహిస్తారా? కేంద్రంలో కూడా రాష్ట్రపతి పాలన విధించాలంటూ కొత్త చట్టం తెస్తారా? ఏదైనా రాష్ట్రంలో ప్రభుత్వం పడిపోయి, ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం లేకపోతే సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకూ రాష్ట్రపతి పాలన విధించాలి. ఎటుచూసినా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అనుకూలమే. ఎవరైనా లోక్‌సభ సభ్యుడు కానీ శాసనసభ్యుడు కానీ మృతి చెందితే ఆ స్థానం మళ్ళీ సార్వత్రిక ఎన్నికలు జరిగే వరకూ ఖాళీగా ఉండాల్సిందే. జమిలి ఎన్నికల ప్రతిపాదనను సమర్థిస్తూ చెప్పే కారణాలు ఎంత బలమైనవో, వ్యతిరేకిస్తూ చెప్పే కారణాలు సైతం అంతే బలమైనవి. అందుకే కూలంకషంగా చర్చించి రాజ్యాంగస్ఫూర్తికీ, సమాఖ్య స్వభావానికీ, ప్రజాస్వామ్య స్ఫూహకూ అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సకల రాజకీయ పక్షాల నాయకులూ చర్చలో పాల్గొనాలి. విధివిధానాలు చర్చించడానికి ఒక కమిటీని నియమిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అన్ని కోణాల నుంచీ పరిశీలించి మౌలికమైన రాజ్యాంగ విలువలకు విఘాతం కలగకుండా సంయమనమే ప్రధానంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఆకాంక్ష.

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం, తిథి బ.చవితి సా.5.16 వరకు, తదుపరి పంచమి నక్షత్రం శ్రవణం సా.5.09 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం రా.9.30 నుంచి 11.15 వరకు, దుర్ముహూర్తం ఉ.8.06 నుంచి 8.58 వరకు, తదుపరి ప.12.26 నుంచి 1.19 వరకు అమృతఘడియలు... ఉ.5.45 నుంచి 7.30 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ఉ. 10.30 నుంచి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుంచి 4.30 వరకు

# పల్లెలు ఎడారులవుతున్న వేళ...!

విశ్లేషణ



దేవిందర్‌శర్మ

కొద్దిమంది వృద్ధుల్ని మినహాయిస్తే, అనంతపురం జిల్లాలోని ఒక గ్రామంలో జనం మొత్తంగా వలస వెళ్లిపోయారు. ఇది ఒక గ్రామం కథ మాత్రమే కాదు.. భారతదేశంలో కరువు పీడిత ప్రాంతాలన్నింటి వ్యథా ఇలాగే ఉంటోంది. ఉన్న ఊరులో బతికే పరిస్థితులు లేక మొత్తం జనం పనుల కోసం వలస వెళ్లిపోతున్నారంటే.. మన గ్రామీణ ప్రాంతాలు చాలావరకు నిర్మానుష్యంగా మారుతున్నాయని అర్థం. రుతుపవనాల రాకలో జాప్యం, వర్షపాతం తగ్గుముఖం పట్టడం, వీటి ప్రభావంతో ఉష్ణోగ్రత తారస్థాయికి చేరడం ఫలితంగా భారతదేశంలోని నగరాలు, పట్టణాలు, పల్లెలు వట్టిపోతున్నాయి. సంప్రదాయక నీటి వనరుల పరిరక్షణ, అడుగంటిన భూగర్భ జలాలను రీచార్జ్ చేయడం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. అభివృద్ధి పేరిట అడవుల్ని, జల వ్యవస్థలను విధ్వంసం చేసే ప్రక్రియను నిలిపివేయాలి.

''అందరికీ అభినందనలు... మనం ఈ సంవత్సరం 50 డిగ్రీల ఉష్ణోగ్రతను సాధించాము. వచ్చే సంవత్సరం 60 డిగ్రీల ఉష్ణోగ్రతను సాధించడానికి మనం మరిన్ని చెట్లను నరికేద్దాం పదండి'' పూర్తిగా వ్యంగ్యాన్ని చొప్పిస్తూ పోస్ట్ చేసిన ట్వీట్ నిజంగానే షాక్ కలిగించింది. అయితే ఈ వ్యంగ్యం ట్విట్టర్‌ను అనుసరిస్తున్న మెజారిటీ పాఠకుల తలకెక్కిందా లేక ఎక్కువమంది జనాలను స్థిమితంగా ఆలోచింపజేసిందా అనేది తేల్చి చెప్పడం కష్టమే.

ఈ ట్విట్టర్ వ్యాఖ్య ప్రభావం ఎంత అనే చర్చ పక్కన బెట్టి చూస్తే, గత 140 ఏళ్లలో అంటే ఉష్ణోగ్రతల స్థాయిలను ప్రపంచం నమోదు చేయడం మొదలు పెట్టిన తర్వాత నాలుగో అత్యంత ఉష్ణోగ్రతా సంవత్సరంగా 2018 సంవత్సరం చరిత్రకెక్కింది. 2019 సంవత్సరంలో మరింత ఉష్ణోగ్రత ఉంటుందని నాసా అంచనా. ఇప్పటికే వేడి మనుషులను అమాంతంగా చంపేస్తోంది. ఈ సంవత్సరం మార్చి నుంచి మే వరకు రుతుపవనాలకు ముందస్తుగా కురిసే వర్షపాతం భారత్‌లో 22 శాతం లోటును నమోదు చేసింది. ఇది గత 65 ఏళ్లలో రెండో అత్యంత తక్కువ వర్షపాతం. ఈ ఏడు రుతుపవనాలు రావడం 15 రోజులు ఆలస్యం కావడంతో పగటి ఉష్ణోగ్రతలు మండిస్తున్నాయి. రాజస్తాన్‌లోని ఛురు ప్రాంతంలో ఈ సీజన్‌లో ఇప్పటికే ఉష్ణోగ్రత 50 డిగ్రీల స్థాయిని మూడుసార్లు దాటేసింది. దేశ రాజధాని ఢిల్లీలో సైతం ప్రస్తుతం 48 డిగ్రీల సెల్సియస్‌తో మునుపెన్నడూ లేనంత అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది.

### నీటి వనరుల క్షీణతే కరువుకు కారణం

ఇప్పటికే దేశ భూభాగంలో దాదాపు 43 శాతం కరువుకోరల్లో చిక్కుకుంది. దాదాపు 60 కోట్లమంది కరువు బారిన పడ్డారని అంచనా. ఉష్ణోగ్రత పెరిగిపోవడంతో నీటి వనరులు శుష్కించిపోతున్నాయి. ఎండవేడికి బీళ్లుగా మారిన నేల ఎంత ప్రభావం చూపిస్తుందో మాటల్లో వర్ణించలేం. గార్డియన్ పత్రిక రిపోర్టు ప్రకారం భారతదేశంలో వందలాది గ్రామాల్లోని కుటుంబాలకు కుటుంబాలే కాసిన్ని నీటిచుక్కల కోసం తమ ఇళ్లను ఖాళీచేసి వలస పోతున్నాయి. మహారాష్ట్రలోని అహ్మద్ నగర్ జిల్లాలో కరువు ప్రభావం కారణంగా 50 వేలమంది పైగా రైతులు తమ పశువులను కాపాడుకోవడం కోసం 500 క్యాంపులకు తరలించారు. మహారాష్ట్రలో 1,501 పశు నిర్వహణా శిబిరాలు ఉంటున్నాయి. ఇక్కడ 72 శాతం భూభాగం కరువు బారినపడింది. ఇక ముంబై నగరం చుట్టూ ఉన్న గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయని వార్తలు. ఇక కర్ణాటకలో 88 శాతం పైగా భూభాగం తీవ్రకరువుతో కునారిల్లిపోతోంది. ఈ రాష్ట్రం లోని 176 తాలూకాలలో 156 తాలూకాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. గత 18 ఏళ్లలో 12 సంవత్సరాలు కర్ణాటక కరువు బారిన పడటం గమనార్హం.

2018–19 సంవత్సరానికి సంబంధించి కర్ణాటక ఆర్థిక సర్వే ప్రకారం వ్యవసాయంలో మైనస్ 4.8 శాతం ప్రతికూల వృద్ధి రేటును నమోదు చేసింది. కరువు వ్యవసాయ పంటలకు భారీ నష్టం కలిగించడంతోపాటు, వ్యవసాయాధారిత ఆర్థిక కార్యాచరణ కుప్పగూలిపోయింది. ఒక కర్ణాటక మాత్రమే కాకుండా, దాదాపు సగం దేశంలో క్షీణిస్తున్న భూగర్భజల మట్టాలు చివరకు దేశం దృష్టిని తమవైపు తిప్పుకున్నాయి. రాష్ట్రాల మధ్య, రాష్ట్రంలోని సామాజిక వర్గాల మధ్య, వ్యక్తుల మధ్య నీటికి సంబంధించిన ఘర్షణలకు తోడుగా నీటికోసం క్యూలలో



నిలుచున్న వ్యక్తుల మధ్య ఘర్షణలు కూడా గడచిన కొన్ని సంవత్సరాల్లో బాగా పెరుగుతూ వస్తున్నాయి. దీంతో మన విధాన నిర్ణేతలు నీటి పరిరక్షణ, నీటి పొదుపు ప్రాముఖ్యతను ఇప్పుడు గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దేశంలోని నాలుగు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు (బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ)తోసహా 21 నగరాలు 2020 నాటికల్లా భూగర్భజలాలు పూర్తిగా అడుగంటిపోవడాన్ని చవిచూడనున్నాయని నీతి ఆయోగ్ ఇటీవల వెలువరించిన నివేదిక నిజంగానే ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. భూగర్భజలాలు దేశప్రజలకు అవసరమైన 40 శాతం నీటి అవసరాలను తీరుస్తున్నందువల్ల, దేశవ్యాప్తంగా 60 కోట్ల మంది ప్రజలు రానున్న జల సంక్షోభం బారిన పడనున్నారు.

### జల సంక్షోభం తీసుకువస్తున్న ఘర్షణలు

అయితే భూగర్భ జల మట్టాలు క్షీణించిపోవడం నగరాలకే పరిమితం కాలేదు. నిజానికి భూగర్భజలాలను విచ్చలవిడిగా తోడిపారేయడం వల్లే వర్షపాతం కాసింతమేరకు తగ్గినా సరే అది విధ్వంసకరమైన కరువుకు దారితీస్తోంది. దేశంలోని చాలా ప్రాంతాల్లో సంవత్సరానికి భూగర్భ జలాల క్షీణత రేటు 0.5 మీటర్లకు మించి నమోదవుతోంది. ఇది ఒక మీటర్ వరకు పడిపోతోంది. ఇక ఎండిపోతున్న నదుల నుంచి లభ్యమయ్యే నీరు కూడా తగ్గిపోతోంది. ఇలా నీటి సంక్షోభం ప్రభావాలు ప్రమాదకర స్థాయికి చేరుకుంటున్నాయి. ఉదాహరణకు అత్యంత సమృద్ధమైన జలరాశికి నిలయమైన నర్మదా నదిలో నీటి లభ్యత గత దశాబ్ద కాలంగా తగ్గుముఖం పడుతూ వస్తోంది. కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం దేశంలోని 91 రిజర్వాయర్లలో నీటి మట్టం వాటి సామర్థ్యం కంటే 18 శాతం దిగువకు క్షీణించిపోయింది. పైగా, అనేక డ్యామ్‌ల లోని నీటిని వ్యవసాయ అవసరాలనుంచి తాగునీటితో సహా నగరప్రాంతాల అవసరాలకు మళ్లిస్తున్నారు. దీంతో రైతుల నిరసనలు తీవ్రతరమై గ్రామీణ–పట్టణ ఘర్షణలకు దారితీస్తున్నాయి.

గత కొన్ని సంవత్సరాలుగా నీటి పరిరక్షణ, నీటి నిల్వ, భూగర్భ జలాల రీచార్జ్ నుంచి ప్రభుత్వాల ప్రాధమ్యాలు మారిపోయాయి. కరువు ముంచుకొచ్చిన సమయాల్లో కీలకపాత్ర పోషించే సంప్రదాయక నీటి బావుల పునరుద్ధరణ పనులను పెడచెవిన పెడుతూ వచ్చారు. నీటి చెరువుల పునరుద్ధరణ, భూగర్భజలాల రీచార్జికి చేపట్టవలసిన చర్యలు అసంపూర్ణంగా ఉంటున్నాయి. లేదా వాటిని పూర్తిగా వదిలేశాయి. లేక చాలా నత్తనడకన సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇప్పటికీ 2 లక్షల మేరకు సంప్రదాయక చెరువులు, దిగుడుబావులు ఉంటున్నాయి. వీటన్నింటినీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. పంజాబ్‌లో 138 బ్లాక్‌లలో 110 బ్లాకులు డార్క్ జోన్‌లో ఉంటున్నాయి. అంటే వీటిలో నీటిని విపరీతంగా తోడేశారన్నమాట. 15 వేల చెరువులు, గుంతలను పునరుద్ధరించినట్లయితే భూగర్భజలాలు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉంది. ఇంతవరకు పంజాబ్‌లో 54 గ్రామీణ చెరువులను పునరుద్ధరించారు. ఆశ్చర్యమేమిటంటే, రాజస్థాన్‌లోనూ, తరాలుగా కొనసాగుతున్న అద్భుతమైన నీటి పరిరక్షణ నిర్మాణాలను పునరుద్ధరించడానికి బదులుగా బిందు సేద్యంపైనే ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. కర్ణాటకలో 39వేల సంప్రదాయక చెరువులు, ట్యాంకులు ఉనికిలో ఉంటున్నాయి. వీటిలో దాదాపు మూడొంతులకు పైగా చుక్కనీరు లేకుండా ఎండిపోయాయి. వీటిలో చాలావాటిని ఇప్పటికీ పునరుద్ధరించవచ్చు. ఈలోగా కర్ణాటక రాష్ట్రం జలామృత పథకాన్ని ప్రారంభించి సంప్రదాయక నీటి వనరులను పునరుజ్జీవింప చేయడానికి ప్రయత్నం మొదలెట్టింది. ఇది చాలా మంచి ప్రయత్నమే కానీ సంప్రదాయక నీటి వనరులను పునరుత్థానం చెందించడాన్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### సంప్రదాయక జల వనరులను పునరుద్ధరించాలి

సంప్రదాయక నీటి నిల్వ వ్యవస్థలు అదృశ్యమైపోయాయి. కర్ణాటక రాష్ట్రం 'కల్యాణీస్' అనే తనదైన సంప్రదాయక నీటి నిల్వ వ్యవస్థను పరిరక్షించాలని ప్రయత్నిస్తోంది. ఒడిశా అయితే 'కుట్టా, ముండా' అనే సంప్రదాయక నీటి నిల్వ వ్యవస్థను కలిగి ఉంటోంది. వీటిలో కొన్ని ఇప్పటికీ ఉనికిలో ఉంటున్నాయి. అయితే సంప్రదాయక నీటి నిల్వ వ్యవస్థల చుట్టూ ఉండే సంప్రదాయక జ్ఞానాన్ని మనం ఇప్పటికే చాలావరకు కోల్పోయాం. చాలా సంవత్సరాల క్రితం అమెరికాలోని టెక్సాస్ ఏ–ఎమ్ యూనివర్శిటీకి నేను వెళ్లినప్పుడు వారు తాము అనుసరిస్తున్న తమిళనాడులోని సంప్రదాయక నీటి పరిరక్షణ వ్యవస్థలను నాకు చూపించారు. ప్రస్తుతం తమిళనాడు ప్రభుత్వానికి తనదైన సంప్రదాయక నీటి పరిరక్షణ వ్యవస్థ గురించి ఏమైనా తెలుసా అనేది నాకు తెలీదు. కానీ కొంతకాలం క్రితం సెంటర్ ఫర్ సైన్స్ – ఎన్విరాన్‌మెంట్ సంస్థ దేశంలోని సంప్రదాయక నీటి పరిరక్షణ వ్యవస్థల జాబితాను పొందుపరుస్తూ 'డైయింగ్ విజ్‌డమ్' (అంతరిస్తున్న జ్ఞానం) అనే పుస్తకం ప్రచురించింది. జల వనరుల పరిరక్షణకు సంబంధించి అంతరిస్తున్న మన సంప్రదాయక విజ్ఞానాన్ని తిరిగి ఆవిష్కరించవలసిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది.

బోర్‌వెల్స్ ప్రపంచమంతటా రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో సంప్రదాయక నీటి పరిరక్షణ వ్యవస్థల వైపునకు మళ్లీ వెళ్లడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. పైగా బోర్‌వెల్స్ కూడా త్వరలోనో లేక ఆ తర్వాతో వట్టిపోక తప్పదు. అడుగంటిన భూగర్భ జలాలను రీచార్జ్ చేయడాన్ని అత్యవసర ప్రాతిపదికన చేపట్టాలి. అయితే యథాతథ స్థితి అనేది ఎప్పటిలాగే కొనసాగుతున్న తరుణంలో దీన్ని ఒక విడి చర్యగా చేపట్టకూడదు. అభివృద్ధి పేరిట అడవులను, జల వ్యవస్థలను, నదీపరివాహక ప్రాంతాలను విధ్వంసం చేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి. లేకపోతే ఉష్ణోగ్రతలు కనీవినీ ఎరుగని స్థాయికి పెరుగుతుండటం అనేది మనం ఊహించని ఉపద్రవాలకు దారితీయక మానదు.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ–మెయిల్ : hunger55@gmail.com

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### పోరాటం



"ఎన్నికల ఫలితాల కారణంగా చాలామంది కాంగ్రెస్ మద్దతుదారులు అసంతృప్తికి గురవ్వడాన్ని అర్థం చేసుకుంటున్నా. కానీ, ఎన్నికల సందర్భంగా మన పార్టీ లేవనెత్తిన సమస్యలన్నీ ఇప్పటికీ అలాగే ఉన్నాయి. పెరిగిన నిరుద్యోగం, వ్యవసాయ రంగంలో సంక్షోభం, కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థ, మైనారిటీ వ్యతిరేకత, పడకేసిన పాలన, జాతీయ భద్రత, రఫేల్ ఒప్పందంలో అవినీతి.. ఇంకా ఎన్నో. పోరాటం కొనసాగించండి"

– సంజయ్ ఝా, కాంగ్రెస్ నేత

### లక్ష్యం



"మూడేళ్ల క్రితం జరిగిన కస్టోడియల్ డెత్ కేసులో మాజీ పోలీస్ అధికారి సంజీవ్ భట్‌కు స్థానిక కోర్టు జీవిత ఖైదు విధించింది. 2012లో గుజరాత్‌లో జరిగిన ఎన్నికల్లో భట్ భార్య ప్రధాని మోదీపై పోటీ చేశారు. 2002లో జరిగిన గుజరాత్ అల్లర్ల విషయమై భట్ కూడా మోదీపై దృష్టి సారించారు"

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

### హిందువులు



"హైదరాబాద్ పోలీసులకు ధైర్యముంటే నా మీద, కార్యకర్తల మీద లాఠీచార్జ్ చేసిన అన్ని వీడియోలు విడుదల చేయాలి. మీ డిపార్ట్‌మెంట్ ఎప్పుడూ నన్నే లక్ష్యంగా చేసుకుని కొన్ని వీడియోలను మాత్రమే విడుదల చేయడం సరికాదు. ఎందుకు ఎప్పుడూ హిందువులనే లక్ష్యంగా చేసుకుంటారు"

– రాజాసింగ్, బీజేపీ ఎమ్మెల్యే

### వలస



"కశ్మీర్ నుంచి వలస వెళ్లిపోయినవారిని కశ్మీరీ హిందువులుగా పేర్కొనడానికి ఇదే సరైన సమయమని నేను అనుకుంటున్నా. ఇది కేవలం కశ్మీరీ పండిట్ల ఒక్కరి సమస్య మాత్రమే కాదు. ఇది అందరి హిందువుల సమస్య. అక్కడి పరిస్థితుల కారణంగా అనేకమంది తమ సొంత ఇళ్లనే వదిలి వెళ్లాల్సి వచ్చింది"

– షెఫాలీ వైద్య, రచయిత్రి

### అవకాశం



"శిఖర్, నీ గురించి తలచుకుంటే బాధగా ఉంది. నువ్వు చాలా బాగా ఆడుతూ, ఇటువంటి ముఖ్యమైన టోర్నమెంట్ మధ్యలో గాయపడటం విచారకరం. నువ్వు ఎప్పటిలాగే మరింత బలోపేతమై వస్తావని నాకు తెలుసు. రిషబ్ నువ్వు కూడా బాగా ఆడుతున్నావు. నీ సత్తాను చాటుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం దొరకదు. గుడ్ లక్"

– సచిన్ టెండూల్కర్, క్రీడాకారుడు

# భిల్లుల బతుకులతో గుమాస్తాల బంతాట

విశ్లేషణ



మాడభూషి శ్రీధర్

సర్కారీ గుమాస్తాలు, వారిపై అధికారులు ఈ దేశంలో ప్రజల బతుకులను నిర్ణయిస్తున్నారు. వాళ్లకు ఇష్టమైతేనే లేదా డబ్బు ముడితేనే ఫైళ్లు కదులుతాయి. ఆదివాసుల మనుగడ మట్టిపాలు చేయడానికి ఈ గుమాస్తాలు ఓ సులువైన మార్గం కనిపెట్టారు. అదే కాగితాలు మాయం చేయడం. అటవీ హక్కుల చట్టం కింద తమకు నివసించే హక్కు ఇవ్వాలని ఆదివాసులు అర్జీ పెట్టుకోవాలి. రుజువులు ఇవ్వాలి. అటవీ హక్కుల కమిటీ పెద్దలు పరిశీలించి దయకలిగితే ఇస్తారు. లేదా తిరస్కరిస్తారు. 60 రోజుల్లో అప్పీలు చేసు కోవాలి. భ్రష్ట గుమాస్తాలు ఏం చేస్తారంటే తిరస్కార ఉత్తర్వు పత్రాలను ఆదివాసులకు చేర్చరు. పంపినట్టు రాసుకుంటారు. అరవై రోజుల కాల పరిమితి వడిసిపోతుంది. తరువాత అప్పీలు చేసుకోవడానికి వీలుండదు. అంటే శాశ్వతంగా నివాస హక్కులు కోల్పోతారు. ఈ విధంగా దురాక్రమణదారులు ఇంతమంది ఉన్నారండీ అని వీరు సుప్రీంకోర్టుకు ప్రమాణ పత్రాల్లో అంకెలు అతివినయంతో సమర్పిస్తారు. వెళ్లగొట్టకుండా మీరేం చేస్తున్నారు అని న్యాయమూర్తులు కోప్పడి వెంటనే వారిని తరిమేసి మన అరణ్యాల్ని పర్వతాల్ని, పర్యావరణాన్ని రక్షించండి అని ఆదేశిస్తారు. బ్రిటిష్ వారి శిక్షణ ఇది. నరనరాల్లో జీర్ణించుకుపోయింది. తరతరాలకు పాకిపోతూ ఉంటుంది.

రాజస్తాన్ అడవుల్లో 61 మంది భిల్లు జాతి జనం శతాబ్దాల నుంచి ఉంటున్నారు. దానికి సాక్ష్యాలు ఎక్కడి నుంచి తెస్తారు. ఎక్కడెక్కడో కాగితాల్లో ఉన్న ప్రస్తావన ఆధారంగా కొన్ని పత్రాలు దేవీ లాల్ కష్టపడి సేకరించి తనతోపాటు 61 మంది భిల్లు ఆదివాసుల నివాస హక్కుల క్లెయిమ్‌లు జాగ్రత్తగా అటవీ హక్కుల కమిటీకి పంపారు. ప్రతిస్పందనగా 2015 లో దేవీలాల్‌కు ఇతర భిల్లులకు, ఫలానా తేదీన రమ్మని సమన్లు వచ్చాయి.

భిల్లులు రమ్మన్న రోజున వెళ్లారు. అధికారులు ఏమీ చెప్పరు. ఆ ఆంగ్లం అర్థం కాదు. వాళ్లు వెళ్లిపోతారు. తరువాత ఏమైందో తెలుసుకొమ్మని భిల్లులంతా దేవీలాల్‌ను పంపారు. ప్రతిసారీ అతను రావడం, వీళ్లు ఫైల్ ఈజ్ అండర్ ప్రాసెస్ అని చెప్పడం, ఈయన తిరిగి వెళ్లిపోవడం. 2015 నుంచి 2017 దాకా తిరిగిన తరువాత విసిగిపోయి మళ్లీ పాత కాగితాల దుమ్ము దులిపి కొత్తగా క్లెయిమ్‌లు రాసుకుని దస్తావేజులన్నీ పట్టుకుని దేవీలాల్ 61 మంది భిల్లుల బతుకుల కాగితాలని సర్కారు గుమాస్తాలకు సమర్పించుకున్నారు. గుమాస్తాలు పిడుగుపాటు వార్త అప్పుడు చెప్పారు. మీ క్లెయిమ్‌లు తిరస్కరించారు కనుక మీరు మళ్లీ క్లెయిమ్‌లు పెట్టుకునే వీల్లేదని. ఎందుకు నిరాకరించారంటే–దానికి జవాబు లేదు.

ఆర్టీఐ కింద దరఖాస్తులు పెట్టండి అని కొందరు శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారు. తమ క్లెయిమ్‌ల పైన తీసుకున్న చర్యల వివరాలు ఇవ్వగలరు అని సమాచార హక్కు కింద భిల్లులు కోరారు. కొన్నింటికి ఫైళ్లు లేవనీ, మరికొన్నింటికి పరిశీలనలో ఉంది అనీ తోచిన జవాబులు ఇచ్చారు సర్కారీ గుమాస్తాలు. మా హక్కుల అర్జీలు తిరస్కరించారంటున్నారు కదా ఆ ఉత్తర్వుల ప్రతులు ఇవ్వండి అని కోరారు.

అటవీ చట్టం సెక్షన్ 12 (ఎ)(3) ప్రకారం అర్జీ తిరస్కారానికి గురైతే ఆ విషయం వ్యక్తిగతంగా అధికారులు వెళ్లి సంబంధిత దరఖాస్తుదారులకు ఇవ్వాలి. అప్పుడే సకాలంలో వారికి అప్పీలు చేసుకునే వీలుంటుంది. సెక్షన్ 12(ఎ)(10)ప్రకారం ఆదివాసుల హక్కుల పత్రాలను తిరస్కరించడానికి కారణాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలి. ఈ రెండు సెక్షన్లను ఉల్లంఘించడం ద్వారా బ్రిటిషు గుమాస్తాలు ఈ దేశ ప్రభువుల స్థాయిలో ఆదివాసుల బతుకులతో బంతాట ఆడుకుంటున్నారు. ఆర్టీఐ కింద దేవీలాల్ తదితర భిల్లుల దరఖాస్తులకు ఇచ్చిన జవాబు ఏమంటే ఫైళ్లన్నీ భైరాంస్రోర్ఘర్ గ్రామ పంచాయతీకి పంపామని చెప్పారు. భైరాంస్రోర్ఘర్ గ్రామ పంచాయతీని ఆర్టీఐ కింద అడిగితే మాకు ఆ ఫైళ్లేవీ రాలేదన్నారు. ఈ విషయాలన్నీ అటవీ హక్కుల కమిటీ వారిని అడిగితే మౌనమే సమాధానం. ఇంతకూ ఆ ఫైళ్లన్నీ ఎక్కడున్నాయో ఎవరికీ తెలియదు. కానీ అటవీ అధికారుల కమిటీ మాత్రం మీ హక్కుల పత్రాలు తిరస్కరించారన్నారు. ఆ తిరస్కరణ ఉత్త ర్వులు ఉన్నాయో లేదో తెలియదు. కారణాలు తెలిస్తే వాటిని ఖండిస్తూ అప్పీలు చేసుకోవచ్చు. తిరస్కరణ ఉత్తర్వులు భిల్లులకు ఇవ్వకుండా మాయచేసి వారి నివాస హక్కులకు శాశ్వతంగా గండికొట్టిన ఈ గుమాస్తాలకు ఏ శిక్షలూ ఉండవు.

ఆర్టీఐ దరఖాస్తులు వేసే దాకా అటవీ హక్కుల కమిటీలు కూడా ఏర్పాటు చేయలేదు. ఆ కమిటీలు కూడా చట్టాలు, నియమాలకు భిన్నంగా రూపొందించారని తెలిసింది. సబ్ డివిజనల్ లెవల్ కమిటీలో ఎవరిని నియమించాలో వారిని నియమించలేదు. ఆదివాసుల హక్కులను గుర్తించడానికి పార్లమెంట్ చేసిన చట్టానికి గండికొట్టడం గుమాస్తాల తెలివి.

వ్యాసకర్త బెన్నెట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, కేంద్ర సమాచార శాఖ మాజీ కమిషనర్
madabhushi.sridhar@gmail.com

# టీడీపీలో అసలు ముసలం మొదలైనట్లేనా?

సందర్భం



పురిఘళ్ల రఘురామ్

తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎప్పుడూ పొత్తు లేకుండా ఎన్నికల్లో గెలవలేదన్న విషయాన్ని ఆ పార్టీ పెద్దలు అంగీకరించకపోవచ్చు కానీ అది వాస్తవం. ఎన్టీఆర్ టీడీపీని స్థాపించినప్పుడు కూడా సంజయ్ మంచ్ పార్టీతో పొత్తు పెట్టుకొని బరిలో నిలిచారు. ఇక 1985లో టీడీపీ, బీజేపీ, వామపక్షాలు కలిసి ఎన్నికల బరిలో దిగారు. ఇక ఆ తర్వాత 1994లోనూ టీడీపీ, వామపక్షాలతో కలిసి పోటీ చేసి గెలుపొందింది. ఆ తర్వాత ఆగస్టు సంక్షోభం, 1996 మధ్యంతర ఎన్నికల్లో బాబు నేతృత్వంలోని టీడీపీ, లెఫ్ట్ పార్టీలతో కలిసి బరిలోకి దిగింది. ఆ ప్రభుత్వం మున్నాళ్ల ముచ్చటగానే ముగియడంతో ఇక లాభం లేదని గ్రహించిన చంద్రబాబు ప్లేటు ఫిరాయించి 1999లో బీజేపీతో పొత్తుకు సిద్ధమై వాజ్‌పేయి ప్రభంజనంలో గెలుపు సాధించారు. అలిపిరి ఘటన తర్వాత సానుభూతితో ఎన్నికల్లో గెలుపొందాలన్న ఏకైక లక్ష్యంతో తనతోపాటు కేంద్రం సైతం ముందస్తు ఎన్నికలకు వెళ్లేలా చేసి వారి ఉసురుతీశారు బాబు.

నాటి నుంచి బీజేపీతో పొత్తు పెట్టుకోవడం చారిత్రక తప్పిదమంటూ ఇంటా బయటా మాట్లాడిన బాబు ఆ తర్వాత 2009 ఎన్నికల్లో టీఆర్ఎస్, లెఫ్ట్ పార్టీలతో కలిసి మరోసారి ఎన్నికల బరిలో దిగి చిత్తయ్యారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో మోదీ ప్రభంజనం నేపథ్యంలో తిరిగి బీజేపీ పంచన చేరారు. నాడు మోదీ మేనియాతో అధికారాన్ని దక్కించుకొని... ఆ తర్వాత రోజుల్లో దేశవ్యాప్తంగా బీజేపీని, మోదీ నాయకత్వాన్ని పలుచన చేసే కుట్రకు తెరలేపారు. కేంద్రాన్ని అన్ని విధాలుగా బద్నాం చేసి... ప్రజల ముందు దోషిగా నిలబెట్టాలనుకున్న బాబును ప్రజలే దోషిగా నిలబెట్టిన ఉదంతం 2019 ఎన్నికల్లో మన కళ్ల ముందు ఆవిష్కృతమయ్యింది. ఏ పార్టీతోనూ పొత్తు లేకుంటే బాబు 40 శాతం ఓట్లు సాధించలేరని మళ్లీ రుజువయ్యింది.

ఇప్పుడు వర్తమానంలో మనకు మరో చరిత్ర ఆవిష్కృతమవుతోంది. కేవలం రాజధాని అంటూ మాటలు చెప్పి చివరి మూడు, నాలుగు నెలల సంక్షేమ కార్యక్రమాలతో అధికారాన్ని దక్కించుకోవచ్చన్న మాస్టర్ స్కెచ్ వేసిన టీడీపీ నేతల ఐడియాలను వర్కౌట్ చేస్తానంటూ రంగంలోకి దిగిన చంద్రబాబు ప్రజల ముందు అభాసుపాలయ్యారు. రైతులకు పెట్టుబడి సాయం, మహిళలకు పసుపు–కుంకుమతో చేయూత అందించామని.. పింఛన్లను రెట్టింపు చేయడంతో ఎన్నికల్లో తిరుగులేదని భావించారు. వీటినే బ్రహ్మాస్త్రాలుగా జనంపైకి వదిలారు. ప్రజలను నమ్మించాలనుకున్నారు. అయితే చివరికి మిగిలిందేంటో మనకు స్పష్టంగా తెలుసు.

ఈ నేపథ్యంలో ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేశాక టీడీపీ పెద్ద పెద్ద నేతలు గందరగోళానికి గురయ్యారు. 40 శాతం మంది ప్రజలు తెలుగుదేశానికి ఓటు వేసినా, నాయకులు మాత్రం కార్యకర్తల పక్షాన నిలబడడానికి జంకుతున్నారు. మొత్తానికి టీడీపీ భవిష్యత్తుని తండ్రీకొడుకులపై వదిలేసి లబ్ధి పొందిన నేతలు తలోదారి చూసుకుంటున్నారు. ఇన్నాళ్లూ పార్టీ తల్లిలాంటిదంటూ కబుర్లు చెప్పిన టీడీపీ పెద్దలు ఇప్పుడు ఆ పార్టీని ఎలా వదిలించుకోవాలన్న దానిపై దారులు వెదుక్కుంటున్నారు. బాబును నడిసంద్రంలో ముంచేసే కథనానికి స్క్రీన్‌ప్లే సిద్ధం చేసుకున్నారు. టీడీపీలో ఇన్నాళ్లూ పదవులు అనుభవించిన నాయకులు ఇప్పుడు పక్క పార్టీల వైపు చూస్తున్నారు. అలా అనేకన్నా.. తమ రాజకీయ జీవితం సుఖప్రదం కావడం కోసం పక్కదారి పట్టేందుకు క్యూలైన్లో నిలబడ్డారు.

బాబు వైఫల్యాలకు ఇక్కడ ధృతరాష్ట్రుడి గుడ్డిప్రేమను ప్రముఖంగా చెప్పుకోవాలి. తన తనయుడు లోకేశ్‌ను నేరుగా ఎమ్మెల్సీగా ప్రమోట్ చేయడం, కీలక పదవులు కట్టబెట్టడం చకచకా చేసిన బాబు వందిమాగధుల సలహాల మేరకు లోకేశ్‌ను నాయకుడిగా కాకుండా ఫాలోయర్‌గా మార్చేశారు. మీడియా అధిపతుల సలహాలతో బొక్కబోర్లాపడ్డారు. సొంత కుమారుడ్ని గెలిపించుకునే విషయంలో మంగళగిరి ప్రజల తిరస్కారానికి గురయ్యారు. రాజధాని అంటూ నిత్యం గొప్పలు చెప్పుకునే ప్రాంతంలోనే ప్రజలు చీత్కరించారంటే ఆ పార్టీ పరిస్థితి మిగతా రాష్ట్రంలో ఎలా ఉందో తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు. ఇక పరాజయం తర్వాత బిజినెస్ లైన్లో ఆలోచించే తెలుగుదేశం పార్టీ నేతలు... రాష్ట్రంలో ఇక భవిష్యత్ లేదన్న ఓ నిర్ణయానికి వచ్చేశారు. మొన్నటి వరకు తండ్రికి, తనయుడికి జైకొట్టిన నేతలు ఇప్పుడు తుపాను తీరం దాటేలోగా.. సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. సురక్షితంగా ఉండేందుకు చకచకా పావులు కదుపుతున్నారు.. తాజా పరిణామాలు పరిశీలిస్తే, ఎన్నికల్లో ఓడిపోయిన పెద్దలతోపాటు, పెద్దల సభకు ఎన్నికైన మెజార్టీ టీడీపీ నేతలు ఇప్పుడు పార్టీ ఫిరాయించేందుకు సిద్ధమైపోయారు. ఇదీ 40 ఏళ్ల అనుభవజ్ఞుడి పార్టీలో జరుగుతున్న అసలుసిసలు చిత్రం.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకుడు
ఈ–మెయిల్ : raghuram.delhi@gmail.com

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 270 1083

## 24న కలెక్టర్ల సదస్సు

- కొత్త ప్రభుత్వంలో మొదటి సమావేశం
- పారదర్శక పాలన, ప్రభుత్వ ప్రాధాన్యాలపై సమీక్ష

**సాక్షి, అమరావతి:** ఈ నెల 24వ తేదీన సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నూతన ప్రభుత్వంలో ఇదే మొదటి సదస్సు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో పారదర్శక పాలన, సర్కారు ప్రాధాన్యాలు, గ్రామ సచివాలయాల ఏర్పాటు, ప్రజారోగ్యం మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలు, ఇంటింటికీ నిత్యావసర సరకుల పంపిణీ, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫారాల సరఫరా, వ్యవసాయ రంగం స్థితిగతులు, కరువు, తాగునీటి ఎద్దడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షిస్తారు. ప్రభుత్వ ప్రాధాన్యాల ప్రకారం అజెండా రూపొందించి పంపించాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్ని జిల్లాల కలెక్టర్లు, విభాగాధిపతులు, శాఖల ముఖ్య కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయం అయిదో బ్లాక్ కాన్ఫరెన్సు హాలులో 24వ తేదీ ఉదయం 10 గంటలకు కలెక్టర్ల సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సదస్సులో ఉప ముఖ్యమంత్రులు, మంత్రులు, విభాగాధిపతులు, ముఖ్య కార్యదర్శులు కూడా పాల్గొంటారు. గత ప్రభుత్వం కలెక్టర్ల సదస్సును మొదట ఖరీదైన ప్రైవేటు హోటళ్లలోనూ, తర్వాత కరకట్ట వద్ద నిర్మించిన గ్రీవెన్సు హాలులోనూ నిర్వహించింది. కొత్త సర్కారు మాత్రం రాష్ట్ర పరిపాలనా కేంద్రమైన సచివాలయంలోనే నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం విశేషం.

## న్యాయవ్యవస్థ పట్ల అంకితభావంతో పనిచేయాలి

### అడ్వొకేట్ జనరల్ సుబ్రహ్మణ్యశ్రీరామ్



**విజయవాడ లీగల్:** న్యాయవాదులు న్యాయవ్యవస్థ పట్ల అంకితభావంతో పనిచేయాలని అడ్వొకేట్ జనరల్ సుబ్రహ్మణ్య శ్రీరామ్ అన్నారు. బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) హాల్లో గురువారం అడ్వకేట్ జనరల్ సుబ్రహ్మణ్యం శ్రీరామ్, అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర రెడ్డి, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సుబ్రహ్మణ్యంశ్రీరామ్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామన్నారు. పొన్నవోలు సుధాకరరెడ్డి మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణతో న్యాయవాదులు ముందుకు సాగాలన్నారు. వైవీ రవిప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడుతూ వృత్తిలో ముందుకు సాగాలన్నారు. బీబీఏ అధ్యక్షుడు పోపూరి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ కోర్టు భవన నిర్మాణ పనులు ఇప్పటి వరకు పూర్తి కాలేదని, కోర్టులు నగరంలో వేర్వేరు చోట్ల ఉండడంతో కక్షిదారులు, న్యాయవాదులు, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మాజీ బీబీఏ అధ్యక్షుడు పిళ్లా రవి, చోడిశెట్టి మన్మధరావు, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు వేలూరి శ్రీనివాసరెడ్డి, సుంకర రాజేంద్రప్రసాదు, చలసాని అజయ్‌కుమార్, పలువురు సీనియర్ న్యాయవాదులు ప్రసంగించారు.. సమావేశం అనంతరం సుబ్రహ్మణ్యం శ్రీరామ్, పొన్నవోలు సుధాకరరెడ్డి, వైవీ రవిప్రసాద్‌లను బీబీఏ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు ఘనంగా సన్మానించారు.

## విభజన సమస్యలపై సీఎస్ సమీక్ష

- ముఖ్యమంత్రి సమీక్ష తర్వాత ముందుకెళ్లాలని యోచన

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర విభజన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లం, రాష్ట్ర పునర్విభజన విభాగం ముఖ్యకార్యదర్శి ఎల్.ప్రేమచంద్రారెడ్డి గురువారం సచివాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా ఉన్న ఢిల్లీలోని ఏపీ భవన్ విభజనపై సమీక్షించారు. ఏపీ భవన్ విభజన రెండు రాష్ట్రాలకు న్యాయం జరిగేలా ఎలా ముందుకెళ్లాలనే విషయంపై చర్చించారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ప్రభుత్వ రంగ సంస్థలు, అలాగే పదో షెడ్యూల్లోని ఇనిస్టిట్యూషన్‌కు చెందిన ఉద్యోగులు, ఆస్తులు, నిధుల పంపిణీ ఎలా జరగాలి? చట్టం ఏం చెబుతోందనే అంశాలపై చర్చించారు. విద్యుత్ సరఫరాకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు, డీఎస్‌పీల కేటాయింపు, రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల బదిలీలు, విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ఈ విషయాలన్నింటిపై త్వరలోనే సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమై వివరించాలని, ఆయన నిర్ణయం మేరకు విభజన సమస్యల పరిష్కారానికి ముందుకెళ్లాలని నిర్ణయించారు.

## ఎస్‌ఐ పోస్టులకు 15,780 మంది అర్హత

**సాక్షి, అమరావతి:** పోలీసు శాఖలోని పలు విభాగాల్లో ఎస్సై పోస్టులకు 15,780 మంది అర్హత సాధించినట్లు ఏపీ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. పోలీసు శాఖలో సివిల్, ఏఆర్, ఏపీఎస్పీ ఎస్సై పోస్టులతో పాటు డిప్యూటీ జైలర్, ఫైర్ ఆఫీసర్ పోస్టులకు 2018 నవంబర్ 1న నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23, 24 తేదీల్లో రాష్ట్రంలోని నాలుగు కేంద్రాల్లో తుది రాత పరీక్షలు నిర్వహించారు. విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు, కర్నూలు కేంద్రాల్లో 31,560 మంది అభ్యర్థులు రాత పరీక్షకు హాజరు కాగా, వీరిలో 15,780 మంది అర్హత సాధించినట్లు బోర్డు తెలిపింది. వీరిలో 14,860 మంది పురుషులు, 920 మంది మహిళలు ఉన్నారని పేర్కొంది. వీరంతా అభ్యంతరాలు, సవరణలు ఏమైనా ఉంటే ఈ నెల 20 నుంచి 25వ తేదీ లోపు apslprb.slobj@gmail.comకు తెలపాలని సూచించింది.

## యూరప్ ట్రిప్పు ముగిసేసరికి టీడీపీ ఖాళీ

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

**సాక్షి, అమరావతి:** చంద్రబాబు యూరప్ పర్యటన నుంచి తిరిగి వచ్చేసరికి ఇక్కడ టీడీపీ ఖాళీ అవుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీలోని పలువురు నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడి బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏపీ భవిష్యత్తు బీజేపీదేనని ఆ పార్టీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయుడు మరొక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి రావడమే నిదర్శనమని తెలిపారు.

## బెయిల్ నిరాకరణ.. పిటిషన్ ఉపసంహరణ

- వివేకా హత్య కేసులో నిందితుల నిర్ణయం

**సాక్షి, అమరావతి :** మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న మూలి వెంకటకృష్ణారెడ్డి, ఎద్దుల ప్రకాశ్‌లు తాము దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించిన నేపథ్యంలో వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో పిటిషన్ ఉపసంహరణకు హైకోర్టు అనుమతిచ్చింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వెంకటకృష్ణారెడ్డి, ప్రకాశ్‌లు 2, 3 నిందితులుగా ఉన్నారు. కృష్ణారెడ్డి వివేకా పీఏగా వ్యవహరించగా, ప్రకాశ్ పనిమనిషిగా ఉన్నారు. వీరిద్దరినీ పోలీసులు ఈ ఏడాది మార్చి 28న అరెస్టుచేశారు. ప్రస్తుతం వీరు కడప జైలులో ఉన్నారు. బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేసుకున్నారు. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్ సోమయాజులు విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో వారు తమ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ ఆ మేరకు ఉత్తర్వులు జారీచేశారు.

## 'అమ్మ ఒడి'లో ప్రభుత్వ స్కూళ్లకు ప్రాధాన్యం హర్షణీయం'

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో అమ్మ ఒడి పథకం అమలులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించే తల్లులకు ప్రాధాన్యమిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రకటించడం హర్షణీయమని ఎస్టీయూ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్‌బాబు, ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, జి.హృదయరాజు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

# జాబిల్లిపై చంద్రయాన్–2 ఇలా..

## చిత్రాలను విడుదలజేసిన ఇస్రో



చంద్రుడికి 30 కిలోమీటర్ల ఎత్తులో దక్షిణ ధ్రువ ప్రాంతంలో మృదువైన ల్యాండింగ్ నిర్వహిస్తున్న అంతరిక్ష మిషన్

**శ్రీహరికోట (సూళ్లూరుపేట):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రంలోని రెండో ప్రయోగ వేదిక నుంచి జూలై 15వ తేదీన చంద్రయాన్– 2 ప్రయోగాన్ని నిర్వహించేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు తలమునకలై ఉన్నారు. ఇప్పటికే షార్ కేంద్రంలోని రెండో ప్రయోగవేదికకు సంబంధించిన వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రెండు దశల రాకెట్ అనుసంధానం పనులు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో చంద్రయాన్– 2 చంద్రుడి మీద ఏ విధంగా దిగుతుందనే దానిపై ఇస్రో నాలుగు ఛాయా చిత్రాలను గురువారం విడుదల చేసింది. చంద్రుడిపై ఆర్బిటర్ ద్వారా మోసుకెళ్లిన ల్యాండర్, రోవర్‌లు చంద్రునికి 30 కిలో మీటర్ల ఎత్తులో నుంచి దిగుతున్న నాలుగు దశల ఊహా చిత్రాలను ఇస్రో విడుదల చేసింది.



చంద్రునిపై మృదువైన ల్యాండింగ్ అవుతున్న అంతరిక్ష మిషన్ దృశ్యం



ల్యాండర్ దిగాక అందులో ఉన్న రోవర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం



పరిశోధనలు చేసేందుకు చంద్రుడి ఉపరితలంపై దిగిన మొట్టమొదటి భారతీయ మిషన్

# బీజేపీలోకి బాబు కోవర్టులు!

## కేసుల భయంతో చంద్రబాబు కొత్త నాటకం

- పక్కా వ్యూహంతోనే కమలం గూటికి టీడీపీ రాజ్యసభ సభ్యులు
- వెళ్లిన నలుగురూ చంద్రబాబు సన్నిహితులు, వ్యాపారవేత్తలే
- బీజేపీలో చేరి 'బాస్' కోసం పనిచేసే వ్యూహం
- బాబు తీరుపై మండిపడుతున్న మెజార్టీ టీడీపీ నేతలు

**సాక్షి, అమరావతి:** ఓవైపు ఎన్నికల్లో ఘోర పరాజయం.. మరోవైపు వెంటాడుతున్న కేసుల భయంతో టీడీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు సరికొత్త రాజకీయ నాటకానికి తెరతీశారు. టీడీపీ రాజ్యసభ సభ్యులు నలుగురిని తన కోవర్టులుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోకి వ్యూహాత్మకంగా పంపించారు. అదీ చంద్రబాబుకు వ్యక్తిగతంగా అత్యంత సన్నిహితులైన ఎంపీలే బీజేపీలో చేరడం గమనార్హం. కేసుల నుంచి తనను కాపాడేందుకే చంద్రబాబు సొంత మనుషులను పక్కా వ్యూహంతో బీజేపీలోకి పంపారని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా సాగించిన తన అవినీతి వ్యవహారాలపై విచారణ జరుగుతుందని ఆయన బెంబేలెత్తుతున్నారు. దీంతో తన మనుషులు బీజేపీలో ఉండటం అవసరమని గ్రహించి పక్కాగా కథ నడిపించారు. అయితే చంద్రబాబు రాజకీయ పన్నాగం బెడిసికొట్టడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తన స్వార్థం కోసం పార్టీ పుట్టి ముంచా రని టీడీపీ నేతలు, శ్రేణులు ఆయనపై మండిప డుతున్నాయి. గురువారం కాకినాడలో సమావేశమైన కాపు నేతలు తాజా పరిణామాలపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. మరోసారి సమావేశమై తమ దారి తాము చూసుకోవాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు.

**నావాళ్లు బీజేపీలో ఉండాలి...**

అధికారం కోల్పోవడంతో చంద్రబాబుకు కేసుల భయం పట్టుకుంది. అవినీతి వ్యవహారాలు ఆయన్ను వెంటాడుతున్నాయి. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం కూడా చంద్రబాబు అవినీతి వ్యవహారాలపై నివేదిక తెప్పించుకుంది. తనతోపాటు తన కుమారుడు లోకేశ్‌పై కేసులు నమోదు చేసే అవకాశాలున్నాయని చంద్రబాబుకు స్పష్టత రావడంతో బెంబేలెత్తారు. చంద్రబాబు అంచనాలకు మించి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, కేంద్రంలో బీజేపీ ఏకపక్షంగా ఘన విజయం సాధించాయి. దాంతో ఇక బీజేపీతో సంబంధాల పునరుద్ధరణ సాధ్యం కాదని గుర్తించిన బాబు ప్రత్యామ్నాయ మార్గంగా వ్యక్తిగతంగా అత్యంత సన్నిహితులను బీజేపీలో చేర్పించాలని నిర్ణయించారు.

**అందుకే ఆ నలుగురు...**

యలమంచిలి వెంకట సుజనా చౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేశ్ చంద్రబాబుకు వ్యక్తిగతంగా సన్నిహితులు. బీజేపీలో తన కోవర్టులుగా ఉండేందుకు చంద్రబాబు వారిని పక్కాగా ఎంపిక చేసుకున్నారు. సుజనా చౌదరి, సీఎం రమేష్‌ల వ్యాపార, ఆర్థిక వ్యవహారాలన్నీ చంద్రబాబుకు బినామీలుగానే చేశారని రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. 2010కు ముందు వారి గురించి రాష్ట్రంలో పెద్దగా తెలీదు. మరోవైపు గరికపాటి మోహన్‌రావు పూర్తిగా చంద్రబాబు తరపున రాజకీయ వ్యవహారాలు నెరపుతుంటారు. లోకేశ్‌ను 'తగిన విధంగా' ప్రసన్నం చేసుకోవడం ద్వారానే టీజీ వెంకటేశ్ రాజ్యసభ సభ్యుడయ్యారు. ఆ నలుగురు వ్యాపారవేత్తలు కావడం, వారికి వ్యాపారాల పరంగా ఇబ్బందులు, ఆర్థిక నేరాల కేసులు ఎదుర్కొంటుండటం గమనార్హం. అందుకే ఆ నలుగురినే చంద్రబాబు ఎంపిక చేసి మరీ బీజేపీలోకి పంపించారని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇక తన చేతికి మట్టి అంటకుండా అన్నట్టుగా టీడీపీ ఎంపీలు బీజేపీలో చేరికకు ముహుర్తాన్ని కూడా చంద్రబాబు పక్కాగానే నిర్ణయించారనేది స్పష్టమవుతోంది. ఆయన విదేశీ పర్యటనకు వెళ్లిన వెంటనే ఆ నలుగురు ఎంపీలు బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించడం గమనార్హం. తనకు అత్యంత సన్నిహితులైన నలుగురు ఎంపీలు బీజేపీలో చేరే సమయంలో తాను దేశంలో ఉండకూడదని చంద్రబాబు ముందస్తుగానే నిర్ణయించుకున్నారని, ప్రణాళిక ప్రకారమే చేరిక వ్యవహారం కొనసాగిందని టీడీపీ నాయకులు, శ్రేణులు కూడా అభిప్రాయపడుతుండటం గమనార్హం.

**వచ్చే నెలలో భేటీ అనంతరం కార్యాచరణ...**

తిరుగులేని ప్రజాదరణ ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూకుడు, పనితీరు చూస్తుంటే మరో 10 – 15 ఏళ్ల వరకు ఆయన అధికారంలో ఉండటం ఖాయమని సమావేశంలో పాల్గొన్న నేతలు ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీని నమ్ముకుని తాము మునగడం కంటే మరోదారి చూసుకోవాలని తీర్మానించారని తెలిసింది. దీనిపై కార్యకర్తల అభిప్రాయాలు సేకరించాలని అభిప్రాయానికి వచ్చారు. సమావేశానికి హాజరు కాని మరికొందరు నేతలను కూడా పిలిచి వచ్చే నెలలో మరోసారి భేటీ అనంతరం రాజకీయ కార్యాచరణ ప్రకటించాలని టీడీపీ కాపు నేతలు భావిస్తున్నారు.

### "బాస్ చెప్పినట్లే చేశాం..."

చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి యూరప్ పర్యటకు బుధవారం అలా వెళ్లారో లేదో... ఇటువైపు టీడీపీ ఎంపీలు నలుగురు బీజేపీలో చేరుతున్నట్లు మీడియాకు లీకులు ఇచ్చారు. టీడీపీ అనుకూల మీడియాలో కూడా తాము అనుకున్న విధంగా కథనాలు వచ్చేలా జాగ్రత్త పడ్డారు. మరోవైపు పార్లమెంటులో కీలక స్థానంలో ఉన్న ఓ నేతతో దీనిపై ముందస్తుగానే చంద్రబాబు మంతనాలు జరిపారని తెలుస్తోంది. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న తన సన్నిహితుడు ఇందుకు సహకరించారు. నలుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరడంపై టీడీపీ నేతలు తీవ్ర విమర్శలు చేయకుండా చంద్రబాబు ముందే కట్టడి చేశారు. ఇక బీజేపీలో చేరిన రాజ్యసభ సభ్యులు తమ సన్నిహితుల వద్ద చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రాయలసీమకు చెందిన ఓ నేతను మాజీ మంత్రి ఒకరు సంప్రదించగా 'బాస్ చెప్పినట్టే చేశాం. అక్కడ ఉన్నా మేం ఇక్కడి మనుషులమే కదా.. అంతా అనుకున్నట్లే జరుగుతోంది' అని వ్యాఖ్యానించినట్లు విశ్వసనీయ సమాచారం. గత కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన మరో నేత మాట్లాడుతూ 'కేసులు బిగుసుకోకుండా చూసుకోవాలి... అందుకే అక్కడికి వెళ్తున్నాం... అన్ని అనుకున్నట్లుగా జరిగితే మళ్లీ నాలుగేళ్లకు వెనక్కి వస్తాం' అని వ్యాఖ్యానించారని తెలిసింది. కాకినాడలో గురువారం సమావేశమైన టీడీపీ కాపు నేతల సమావేశంలో ఈ అంశంపై వాడీవేడీ చర్చ సాగింది. చంద్రబాబు తీరుపై నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారని సమాచారం.

# కేసుల భయంతో బాబు అండ్‌కో డ్రామా

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.రామచంద్రయ్య



**వైవీయూ (వైఎస్‌ఆర్ జిల్లా) :** కేసుల భయంతో చంద్రబాబు ఆదేశాల మేరకే టీడీపీ రాజ్యసభ సభ్యులు బీజేపీలో చేరారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి సి.రామచంద్రయ్య అన్నారు. గురువారం వైఎస్సార్ జిల్లా కేంద్రం కడపలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు తన పదవీ కాలంలో చేసిన వికృత చర్యల వల్ల ప్రజాభిమానం కోల్పోయి ఘోర పరాజయం పొందారన్నారు. అయితే ఆయన హయాంలో జరిగిన విచ్చలవిడి అవినీతి, అక్రమాలపై విచారణ చేపడితే తనకు శిక్ష ఖాయమని భావించి టీడీపీ రాజ్యసభ సభ్యులను బీజేపీలోకి పంపించి తనపై కేసులు లేకుండా ఉండేలా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఆర్థిక నేరగాళ్లు, బ్యాంకులను లూటీ చేసినవారు, స్మగ్లర్లు తన అనుయాయులైన టీడీపీ రాజ్యసభ సభ్యులను బీజేపీలోకి పంపించి తనపై చర్యలు లేకుండా ఉండేలా జాగ్రత్త పడుతున్నాడని చెప్పారు. ఇందుకు నిదర్శనం గతంలో ఓటుకు నోటు కేసు నుంచి బయట పడేందుకు చంద్రబాబు తన సన్నిహితులైన నామా నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు వంటివారిని టీఆర్‌ఎస్‌లోకి పంపిన విషయం తెలుగు ప్రజలందరికీ తెలుసన్నారు.

# కేపీఎంజీ ఔట్!

- ఏటా రూ.11 కోట్లు ఆదా
- నిపుణులైన ఉద్యోగులకు బాధ్యతలు

**సాక్షి, అమరావతి:** ఏపీ విద్యుత్ సంస్థలను కొన్నేళ్ళుగా పట్టి పీడిస్తున్న కన్సల్టెన్సీ కేపీఎంజీని ఇంటిదారి పట్టించారు. ఇక మీదట ఆ సంస్థ సేవలు వినియోగించుకోవాల్సిన అవసరం లేదని విద్యుత్ శాఖ కార్యదర్శి శ్రీకాంత్ అన్ని విభాగాలకు ఆదేశాలు జారీచేశారు. దాదాపు దశాబ్ద కాలంగా కేపీఎంజీ కన్సల్టెన్సీ విద్యుత్ సంస్థల్లోని అన్ని విభాగాల్లోకి చొచ్చుకెళ్ళింది. ఇష్టానుసారం ప్రాజెక్టు రిపోర్టులివ్వడం, ఇష్టమొచ్చినట్టు అంచనాలు పెంచడంలో కేపీఎంజీ ప్రమేయం ఉంటోందన్న విమర్శలొచ్చాయి. ఐదేళ్ళుగా విద్యుత్‌శాఖలోని ప్రతీ గణాంకాలను ప్రభుత్వం కోరిన విధంగా తిమ్మిని బమ్మిన చేసి ఇచ్చిన ఘనత ఈ సంస్థదే. కేపీఎంజీ రూపొందించిన వార్షిక ఆదాయ అవసర నివేదికల కారణంగా డిస్కమ్‌ల వాస్తవ అప్పులు, లోటు ఏపీఈఆర్‌సీ దృష్టికి వెళ్ళలేదు. వాస్తవ అప్పులను కప్పిపుచ్చి మోసం చేయడం వల్ల ఇప్పుడు డిస్కమ్‌లకు ఏకంగా రూ. 21 వేల కోట్ల అప్పు ఉన్నట్టు తేలింది. ఏటా విద్యుత్ శాఖ ఈ సంస్థకు కనిష్టంగా రూ.11 కోట్లు చెల్లిస్తోంది. ఇలాంటి సంస్థను తొలగిస్తూ విద్యుత్ సంస్థలు తీసుకున్న నిర్ణయంపై విద్యుత్ ఉద్యోగుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. కేపీఎంజీని తొలగించిన నేపథ్యంలో ఈ బాధ్యతలను కొంతమంది నిపుణులైన ఉద్యోగులకు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. డ్రాఫ్టింగ్ కోసం నిపుణులైన సిబ్బందిని సెక్షన్లలో నియమించుకోవాలని సూచించారు. ఆర్థికపరమైన విశ్లేషణల కోసం కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

# 'కే ట్యాక్స్' విజయలక్ష్మికి ఊరట

- అరెస్టుపై స్టే.. దర్యాప్తు కొనసాగింపునకు ఆదేశం
- మంత్రాంగం నెరిపిన టీడీపీ న్యాయవాదులు
- సహకరించిన పీపీ, ఏపీపీ తదితరులు

**సాక్షి, అమరావతి:** కే ట్యాక్స్ పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తాల్లో వసూళ్లకు పాల్పడిన వ్యవహారంలో రోజుకో కేసుతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మాజీ స్పీకర్, టీడీపీ సీనియర్ నేత కోడెల శివప్రసాద్‌రావు కుమార్తె పూనాటి విజయలక్ష్మికి హైకోర్టు ఊరటనిచ్చింది. నరసరావుపేట పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులో విజయలక్ష్మిని అరెస్ట్ చేయవద్దని పోలీసులను హైకోర్టు సూచించింది. అయితే దర్యాప్తును మాత్రం యథాతథంగా కొనసాగించవచ్చునంది. తదుపరి విచారణను జూలై 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

**విజయలక్ష్మి అరెస్టుపై స్టేకు పెద్ద వ్యూహ రచన**

విజయలక్ష్మికి అనుకూలంగా ఈ ఉత్తర్వులు రావడంలో రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్, అతని సహాయకులు తమ వంతు పాత్ర పోషించారు. దీని వెనుక ఓ పెద్ద వ్యూహ రచనే ఉంది. ఆమె తరుపున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాది.. అంచా పాండురంగారావు. ఇతను టీడీపీ హయాంలో మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా నియమితులయ్యారు. ఈయన రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని వెంకటేశ్వర్లుకు అత్యంత సన్నిహితుడు. వీరిద్దరూ కూడా హైకోర్టు హైదరాబాద్‌లో ఉన్న నాటి నుంచి ఒకే కారులో కలిసి కోర్టుకు వచ్చి వెళ్లేవారు. పోసాని చాంబర్ టీడీపీ న్యాయవాదుల ఆంతరంగిక సమావేశాలకు వేదిక. విజయలక్ష్మి తరపున కేసు దాఖలు చేయడానికి ముందు రోజు, దాఖలు చేసిన రోజు కూడా పాండురంగారావు.. పీపీ పోసాని వెంకటేశ్వర్లును కలిసి చాలా సేపు చర్చలు జరిపారు. వాస్తవానికి వెంకటేశ్వర్లు ప్రభుత్వం మారిన వెంటనే తన పదవికి రాజీనామా చేశారు. అయితే కొన్ని కారణాల వల్ల అది ఆమోదం పొందలేదు. కొత్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకంలో జరుగుతున్న ఆలస్యాన్ని అదునుగా చూసుకున్న టీడీపీ న్యాయవాదులు తమ బుర్రకు పదునుపెట్టారు. ప్రభుత్వం మారినా పబ్లిక్ ప్రాసిక్యూటర్, అదనపు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా తమ వాళ్లే కొనసాగుతుండటం వారికి కలిసొచ్చింది. విజయలక్ష్మిపై కేసు దాఖలైతే, దానిని వ్యతిరేకించే పరిస్థితి ఉండదు కాబటి వెంటనే ఆమె తరపున పిటిషన్ దాఖలుచేసి బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

### 10 నిమిషాల్లోనే కేసు ముగింపు..

పూనాటి విజయలక్ష్మిపై దాఖలు చేసిన కేసు గురువారం విచారణకు రానే వచ్చింది. తాను వస్తే లేనిపోని సమస్యలు వస్తాయన్న ఉద్దేశంతో పోసాని ఈ కేసు వాదనలకు రాలేదు. తన తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మీనారాయణను పంపారు. వాస్తవానికి ఇలాంటి కేసు విచారణకు వచ్చినప్పుడు 'ఇన్‌స్ట్రక్షన్స్' తీసుకుంటామంటూ పీపీ లేదా అసిస్టెంట్ పీపీ ఓ వారానికి వాయిదా వేయిస్తారు. గతంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఏవైనా కేసులు దాఖలు చేస్తే కోర్టు ఎలాంటి సానుకూల ఆదేశాలివ్వకుండా అడ్డుపడేవారు. ఈ కేసు విషయంలో పూర్తి విరుద్ధంగా చేశారు. విజయలక్ష్మి 'కే ట్యాక్స్' పేరుతో ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడిన విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చే పరిస్థితి ఉన్నా, ఆ పని చేయలేదు. ఆమె అరెస్ట్‌పై స్టేను వ్యతిరేకించలేదు. దర్యాప్తు కొనసాగింపు గురించే అసిస్టెంట్ పీపీ వాదనలు వినిపించి మమా అనిపించేశారు. సరిగ్గా 10 నిమిషాల్లోపు కేసును ముగించేలా చేశారు. కే ట్యాక్స్ గురించి, కోడెల కుమారుడు, కుమార్తె వసూళ్ల గురించి కోర్టుకు చెప్పకపోవడంతో కేసు తీవ్రత న్యాయస్థానానికి తెలిసే అవకాశం లేకుండా పోవడంతో న్యాయస్థానం విజయలక్ష్మి అరెస్ట్‌పై స్టే విధించింది.

# మెట్రో నగరాల్లో 350 ఎలక్ట్రిక్ బస్సులు

- రవాణా, ఐ అండ్ పీఆర్ శాఖ మంత్రి పేర్ని నాని
- సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతల స్వీకారం
- దివ్యాంగుల బస్‌పాస్ మూడేళ్లపాటు చెల్లుబాటయ్యే ఫైలుపై తొలి సంతకం

**సాక్షి, అమరావతి :** రాష్ట్రంలోని మెట్రో నగరాల్లో త్వరలో 350 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నట్టు రవాణాశాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రకటించారు. ఆర్టీసీని అన్ని విధాలా ఆదుకుంటామని, దేశంలోనే అత్యుత్తమ ప్రజా రవాణా వ్యవస్థగా తీర్చిదిద్దుతామని చెప్పారు. రవాణా, సమాచారశాఖ మంత్రిగా ఆయన గురువారం వెలగపూడి సచివాలయం ఐదో బ్లాక్‌లోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. దివ్యాంగులు ఒకసారి బస్‌పాస్ తీసుకుంటే మూడేళ్ల పాటు చెల్లుబాటయ్యే ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం నాని మీడియాతో మాట్లాడుతూ రవాణాశాఖ కార్యాలయాల్లో కూడా లైసెన్సులకు దరఖాస్తు చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త వాహనాల కొనుగోలు సమయంలో డీలర్ వద్దే రిజిస్ట్రేషన్ చేయాలని, 24 గంటల్లోగా ఆర్టీవో అనుమతులివ్వాలని ఆదేశించారు. రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలిచ్చేందుకు సీఎం సూత్రప్రాయంగా అంగీకరించినట్టు మంత్రి చెప్పారు.



సచివాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఫైలుపై తొలి సంతకం చేస్తున్న మంత్రి పేర్ని నాని

**ఫిట్‌నెస్ లేకుంటే సీరియస్‌గా పరిగణిస్తాం -..**

ఈ నెల 13 నుంచి ఫిట్‌నెస్ లేని వాహనాల విషయంలో తనిఖీలు చేపట్టి 624 స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశామని.. ఇప్పటిదాకా 357 బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా విద్యా సంస్థల బస్సులు పట్టుబడితే ఇకపై సీరియస్‌గా పరిగణిస్తామని మంత్రి స్పష్టం చేశారు. విద్యా సంస్థల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, తమ బస్సులకు ఫిట్‌నెస్ లేదని చెప్పకుండా రవాణాశాఖ అధికారులపై తప్పులు నెడుతున్నాయన్నారు. ఫిట్‌నెస్ లేని విద్యా సంస్థల బస్సుల విషయంలో తల్లిదండ్రులు తమకు సహకరించాలని మంత్రి కోరారు.

**ఆయా జిల్లాల్లో ఇప్పటి వరకు ఫిట్‌నెస్ లేని బస్సులపై నమోదైన కేసులు, సీజ్ చేసిన బస్సుల వివరాలు..**

| జిల్లా | బస్సులపై నమోదైన కేసులు | సీజ్ చేసిన బస్సుల సంఖ్య |
|---|---|---|
| శ్రీకాకుళం | 22 | 5 |
| విజయనగరం | 15 | 9 |
| విశాఖపట్టణం | 35 | 27 |
| తూర్పుగోదావరి | 36 | 23 |
| పశ్చిమగోదావరి | 67 | 53 |
| కృష్ణా | 139 | 32 |
| గుంటూరు | 87 | 33 |
| ప్రకాశం | 21 | 19 |
| నెల్లూరు | 25 | 10 |
| వైఎస్సార్ కడప | 48 | 48 |
| కర్నూలు | 33 | 28 |
| అనంతపురం | 28 | 28 |
| చిత్తూరు | 68 | 42 |
| మొత్తం | 624 | 357 |

## చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో అఖిల్‌కు స్థానం



ట్రోఫీ అందిస్తున్న పట్టాభిరాం, తుర్లపాటి కుటుంబరావు తదితరులు

**విజయవాడ కల్చరల్:** కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన 'వండర్ కిడ్' నక్కిన సాయి అఖిల్ (9) చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. తన అసాధారణ ప్రతిభతో 1.56 నిమిషాల్లో ఆంగ్లంలో అతి క్లిష్టమైన టంగ్ ట్విస్టర్ (కఠినమైన ఆంగ్ల పదాలు) ద్వారా 50 పదాలు చెప్పి వరల్డ్ రికార్డ్ సాధించాడు. దీంతో పాటు కాంపౌండ్ నౌన్స్ 3 నిమిషాల్లో 568 పదాలు చెప్పాడు. విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సాయి అఖిల్ ఈ అరుదైన ఫీట్ సాధించాడు. చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ తుర్లపాటి పట్టాభిరాం చేతుల మీదుగా ధ్రువీకరణ పత్రం, ట్రోఫీ అందుకున్నాడు.

# గోల్కొండ వజ్రానికి రూ.45 కోట్లు




- భారతీయ రాజుల వజ్రాభరణాలు, కళాఖండాలకు భారీ ధర
- మొత్తం విలువ రూ.756 కోట్లు
- 400 వస్తువులను వేలం వేసిన క్రిస్టీస్

**న్యూయార్క్:** భారత్‌ను పాలించిన మహారాజులు, మొఘలులు వినియోగించిన వజ్రాభరణాలు న్యూయార్క్‌లో నిర్వహించిన ఓ వేలంపాటలో కోట్లకు అమ్ముడుపోయాయి. ప్రఖ్యాత క్రిస్టీస్ వేలంసంస్థ ఈ వేలం నిర్వహించింది. గోల్కొండలో దొరికిన మిర్రర్ ఆఫ్ ప్యారడైజ్ వజ్రం, నిజాం ధరించిన గొలుసు, ఆర్కాట్ నవాబుకు చెందిన వజ్రం, స్వర్ణాభరణాలు, కత్తులు, రత్నాలుసహా దాదాపు 400 పురాతన వస్తువులను వేలం వేశారు. 'మహారాజులు, మొఘలుల వైభవం' పేరిట నిర్వహించిన ఈ వేలంలో క్రిస్టీస్ సంస్థకు రూ.756 కోట్లు వచ్చాయి. భారతీయ నగలు, కళాఖండాలు గతంలో ఎన్నడూ ఇంతటి భారీ ధరకు అమ్ముడుపోలేదని క్రిస్టీస్ పేర్కొంది. 2011లో ఎలిజబెత్ రాణి సేకరించిన వస్తువులు రూ.14.4 కోట్ల ధర పలికాయి. గోల్కొండలో దొరికిన 52.58 క్యారెట్ల బరువైన మిర్రర్ ఆఫ్ ప్యారడైజ్ వజ్రం రూ.45 కోట్లు పలికింది. ఆర్కాట్ నవాబుకు చెందిన 17 క్యారెట్ల గోల్కొండ వజ్రం(ఆర్కాట్–2) రూ.23.5 కోట్లకు అమ్ముడుపోయింది. హైదరాబాద్ నిజాం ధరించిన 33 వజ్రాలు పొదిగిన హారం రూ. 17 కోట్లు పలికింది.


షాజహాన్ కత్తి


మిర్రర్ ఆఫ్ ప్యారడైజ్ వజ్రం



ఇండోర్ మహారాజు యశ్వంత్ రావ్ హాల్కర్ 2 ధరించిన రత్నాలతో కూడిన గొలుసు రూ. 1.44 కోట్లు, జైపూర్ రాజమాత గాయత్రీ దేవి ధరించిన వజ్రపుటుంగరం రూ. 4.45 కోట్లు, 1680–1720 కాలానికి చెందిన వజ్రాలు పొదిగిన హుక్కా సెట్ రూ.5.3కోట్లు, సీతారామాంజనేయుల ప్రతిమలున్న మరో హారం రూ. 5.12 కోట్లు పలికాయి. 5 వరసల ముత్యాల గొలుసు రూ.11.8 కోట్లకు, వజ్రాలహారం రూ. 1.5 కోట్లకు అమ్ముడుపోయాయి. ఖతార్‌కు చెందిన రాజకుటుంబం సేకరించిన ఈ ఆభరణాలను క్రిస్టీస్ వేలం వేసింది. మొఘల్ మహారాజు షాజహాన్ వాడిన బాకు రూ.23.4 కోట్లు పలికింది. హైదరాబాద్ నిజాం నవాబు వాడిన కత్తి రూ. 13.4 కోట్లు పలికింది. భారత్‌కు చెందిన ఒక కత్తి ఇంత ధర పలకడం ఇదే మొదటిసారి. భారత్ సహా 45 దేశాలకు చెందిన ఔత్సాహికులు ఈ వేలంలో పాల్గొన్నారు. జైపూర్, ఇండోర్, బరోడా రాజవంశీకులకు చెందిన ఆభరణాలు, వస్తువులనూ ఈ వేలంలో పెట్టారు.

# ప్రతి ఒక్కరికీ సాధికారతే లక్ష్యం

## జమిలి ఎన్నికలకు సమయం ఆసన్నమైంది

- 'అందరితో కలసి, అందరికీ ప్రగతి, అందరి విశ్వాసం'కోసం కృషి
- బలమైన, సురక్షిత, సమ్మిళిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు
- పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రసంగం

**న్యూఢిల్లీ:** రెండోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వ రోడ్‌మ్యాప్‌ను రాష్ట్రపతి కోవింద్ ఆవిష్కరించారు. 2014లో ప్రారంభమైన నిరంతర, నిరాటంక అభివృద్ధి ప్రయాణాన్ని కొనసాగించేందుకు వీలుగా ప్రజలు గట్టి తీర్పునిచ్చారని చెప్పారు. భారత ప్రజాస్వామ్య విశ్వసనీయతను ఈ సాధారణ ఎన్నికలు పెంపొందించాయన్నారు. రికార్డు స్థాయిలో 61 కోట్ల మంది ప్రజలు ఓటేశారని, వీరిలో మహిళలే ఎక్కువ శాతం ఉన్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో 2022 నాటికి నవభారతాన్ని నిర్మించేలా ప్రతి ఒక్కరికీ సాధికారతను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజలకు సాధికారత కల్పించడం ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం పేదలకు నివాస, ఆరోగ్యపరమైన సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. గురువారం పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి కోవింద్ సుమారు గంటసేపు ప్రసంగించారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రస్తుతం దేశానికి జమిలి ఎన్నికలు అవసరమని అన్నారు. ఎప్పుడూ దేశంలోని ఏదో ఒక ప్రాంతంలో ఎన్నికలు జరుగుతుండటం అభివృద్ధి కార్యక్రమాల వేగం, కొనసాగింపుపై ప్రభావం చూపిస్తోందన్నారు. అందువల్ల ఎంపీలందరూ 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు'అనే అభివృద్ధి కాముక ప్రతిపాదనపై గట్టిగా దృష్టి పెట్టాల్సిందిగా కోరుతున్నానన్నారు. లోక్‌సభలో సగం మంది ఎంపీలు కొత్తగా ఎన్నికైన వారు కావడం, మునుపెన్నడూ లేనివిధంగా 78 మంది మహిళా ఎంపీలుండటం నవభారత దృశ్యాన్ని మన ముందు ఉంచుతోందన్నారు.

### భారత్‌కు ప్రపంచ దేశాల మద్దతు

దేశ భద్రతకు ప్రభుత్వం అత్యంత అధిక ప్రాధాన్యతను ఇస్తోందంటూ మెరుపు దాడులను, పాకిస్తాన్‌లోని ఉగ్ర శిబిరాలపై వైమానిక దాడులను రాష్ట్రపతి ప్రస్తావించారు. తొలుత మెరుపుదాడులతో, ఆ తర్వాత పుల్వామా దాడి నేపథ్యంలో సరిహద్దు పొడవునా ఉగ్ర శిబిరాలపై వైమానిక దాడుల ద్వారా ప్రభుత్వం ఈ విషయంలో తన ఉద్దేశాన్ని, సామర్థ్యాన్ని చాటి చెప్పిందన్నారు. ఉగ్రవాదంపై భారత్ వైఖరికి ప్రపంచ దేశాలు మద్దతు పలుకుతున్నాయన్నారు. జైషే మొహమ్మద్ అధినేత మసూద్ అజార్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ఐక్యరాజ్య సమితి ప్రకటించడం ఇందుకు నిదర్శనమన్నారు. జమ్మూ కశ్మీర్ ప్రజలకు సురక్షితమైన, ప్రశాంత వాతావరణం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందన్నారు.

### రైతు సంక్షేమానికి చర్యలు

నవభారత నిర్మాణం సాధన దిశగా 21 రోజుల్లోనే ప్రభుత్వం.. రైతులు, సైనికులు, విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, మహిళలు, సమాజంలోని ఇతర వర్గాలు లక్ష్యంగా ఎన్నో నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రైతులు, చిరు వ్యాపారులకు పింఛను పథకాలు ప్రారంభించేందుకు, రైతులందరికీ రూ.6 వేల ఇన్‌పుట్ సబ్సిడీ వర్తింపజేసేందుకు తీసుకున్న నిర్ణయాలను రాష్ట్రపతి ప్రస్తావించారు. వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు రానున్న సంవత్సరాల్లో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడం జరుగుతుందని తెలిపారు. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా గత ఐదేళ్లలో పలు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

### సాంఘిక దురాచారాల నిర్మూలన

మహిళలకు సమాన హక్కులు కల్పించేలా ట్రిపుల్ తలాక్, నికా హలాల వంటి సాంఘిక దురాచారాల నిర్మూలనలో ప్రభుత్వం చిత్తశుద్ధిని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. అవినీతిపై ఉక్కుపాదం మోపే విధానాన్ని మరింత పటిష్టం చేసేందుకు నల్లధన వ్యతిరేక కార్యాచరణను వేగంగా ముందుకు తీసుకువెళతామన్నారు. గత రెండేళ్లలో 4 లక్షల 25 వేల కంపెనీ డైరెక్టర్లపై అనర్హత వేటు వేశామని, 3 లక్షల 50 వేల అనుమానాస్పద కంపెనీల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. విదేశాల్లో నల్లధనం దాచుకున్న వారి వివరాలన్నీ ప్రస్తుతం దేశానికి అందుతున్నాయని చెప్పారు. అభివృద్ధిని ప్రోత్సహించడం, ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం త్వరలోనే కొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటిస్తుందన్నారు. సహకార సమాఖ్య వ్యవస్థ విధానాన్ని, స్ఫూర్తిని బలోపేతం చేసేలా దేశ ప్రయోజనాల సాధనకు తమ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలను కలుపుకుని పోతోందని చెప్పారు.


ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించనున్న రాష్ట్రపతి కోవింద్‌ను తోడ్కొని వెళ్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్య, స్పీకర్ ఓం బిర్లా, ప్రధాని మోదీ

### ప్రసంగం సైడ్‌లైట్స్

- ప్రసంగ సమయంలో కావేరీ జలాల సమస్యను తీర్చాలంటూ డీఎంకే పార్టీ సభ్యులు ప్లకార్డులతో నినాదాలు చేశారు.
- రాష్ట్రపతి ప్రసంగంలో మోదీ ప్రభుత్వాన్ని సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్‌ను, రఫేల్ అంశం గురించి ప్రసంగిస్తున్నపుడు ఎన్డీయే సభ్యులు చప్పట్లు చరిచారు.
- ప్రసంగసమయంలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌సహా పలువురు ఎంపీలు మొబైల్ ఉపయోగించడం కెమెరాల కంటపడింది.
- రాష్ట్రపతి వెళ్లిపోయిన తర్వాత ప్రతిపక్ష పార్టీల సభ్యులు పలువురు రాహుల్‌గాంధీని కలిశారు. సెంట్రల్ హాల్ నుంచి బయటకు వస్తూ సోనియా గాంధీ, కేంద్రమంత్రి స్మృతి ఇరానీ పలకరించుకున్నారు.

**కోవింద్ ఏడాదిలో ఇది రెండోసారి**

రాష్ట్రపతి కోవింద్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. క్రీమ్ కలర్ జోధ్‌పురి సూట్ (బంద్‌గలా) ధరించిన కోవింద్ అశ్విక దళం ముందూ వెనుకా నడుస్తుండగా బగ్గీలో కాకుండా కార్లో పార్లమెంటు ఆవరణకు చేరుకున్నారు. అంతకు ముందు తన వ్యక్తిగత అంగరక్షకుల (పీబీజీ) గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి భవనం వెలుపల అశ్విక దళం (పీబీజీ) రాష్ట్రపతి వెంట ఉండటం అరుదుగా కన్పిస్తుంది. సాధారణంగా ఏడాదిలో మూడుసార్లు రాజధాని వాసులకు ఈ దృశ్యం కనువిందు చేస్తుంది. ఈ ఏడాది ఇలా జరగడం నాల్గోసారి.

## సభ సజావుగా సాగేలా సహకరించాలి

### రాజకీయ పార్టీలకు ఉపరాష్ట్రపతి పిలుపు

**సాక్షి, న్యూఢిల్లీ:** ప్రజల భవిష్యత్‌ను నిర్దేశించే పార్లమెంటులో చర్చలు, సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా ప్రతీ సభ్యుడూ సహకరించాలని రాజకీయ పార్టీలను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. పార్లమెంటు సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆయన ఢిల్లీలో తన నివాసంలో వివిధ పార్టీల రాజ్యసభ సభాపక్షనేతలకు ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడారు. రాజ్యసభలో జరిగే చర్చలు దేశంలోని అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఆదర్శంగా నిలుస్తాయని, అందుకే నిర్మాణాత్మక చర్చలకు ప్రాధాన్యతనివ్వాలని సభాపక్షనేతలకు సూచించారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చాక ప్రారంభమైన ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా ముందుకు సాగుతాయని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, అధికార పక్షనేత థావర్ చంద్ గెహ్లాట్, ప్రతిపక్ష నేత గులాంనబీ ఆజాద్, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్, వైఎస్సార్‌సీపీ తరఫున పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి, టీఆర్ఎస్ నుంచి కేశవరావుసహా వివిధ పార్టీల సభాపక్షనేతలు పాల్గొన్నారు. ఈ విందులో ఆంధ్ర వంటకాలు ఏర్పాటుచేశారు.

**ఎంపీలకు ప్రధాని విందు**

మోదీ గురువారం రాత్రి పార్లమెంటు సభ్యులకు విందు ఇచ్చారు. సోనియా, రాహుల్, అఖిలేశ్ యాదవ్ వంటి ప్రముఖ నేతలెవరూ డిన్నర్‌కు హాజరుకాలేదు. తృణమూల్ కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, ఆర్జేడీ ఎంపీలు రాలేదు. అధికార ఎన్డీయే పక్ష నేతలతో పాటు రాజ్యసభలో విపక్ష నేత గులాం నబీ ఆజాద్, డీఎంకే ఎంపీ కనిమొళి, ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్, బీజేపీలో చేరిన టీడీపీ ఎంపీలు సుజనాచౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేష్ హాజరయ్యారు. 'మంచి వాతావరణంలో విందు కొనసాగింది'అని బీజేపీ నేత రాజీవ్ ప్రతాప్ రూడీ చెప్పారు.


హరియాణాలోని గురుగ్రామ్ దగ్గర్లోని మందవ గ్రామంలో చెట్టెక్కిన చిరుత కరెంట్ తీగలు తగిలి ప్రాణాలు కోల్పోయిన విషాదకర దృశ్యం

# లోయలో పడిన బస్సు

## హిమాచల్ ప్రమాదంలో 44 మంది మృతి

**సిమ్లా:** హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలో గురువారం ఓ ప్రైవేటు బస్సు (హెచ్‌పీ 66–7065) అదుపుతప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో 44 మంది మృతి చెందగా, మరో 34 మందికి గాయాలయ్యాయి. జిల్లాలోని బంజార్ తెహసీల్ వద్ద ఉన్న ధోత్ మోర్హ్ దగ్గర బస్సు 300 అడుగుల లోతున్న లోయలో పడిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ షాలిని అగ్నిహోత్రి తెలిపారు. ఎక్కువ మందిని ఎక్కించడం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నామని బంజార్ పట్వారీ షీతల్ కుమార్ అన్నారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్, ముఖ్యమంత్రి జైరామ్ ఠాకూర్ ప్రమాదం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై లోతైన విచారణ చేపట్టాల్సిందిగా సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. విషయం తెలుసుకున్న రవాణా శాఖ మంత్రి గోవింద్ కులు జిల్లాకు బయలుదేరారు. ప్రమాదంలో చనిపోయిన, గాయపడిన వారి కుటుంబాలకు జిల్లా యంత్రాంగం రూ. 50 వేల తక్షణ ఆర్థిక సాయం అందించింది. ప్రభుత్వం రోడ్లను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన చోట్ల రోడ్డు వెడల్పును పెంచాలని సేవ్ లైఫ్ ఫౌండేషన్ సభ్యుడు పీయూష్ తివారీ డిమాండ్ చేశారు.


ప్రమాదంలో గాయపడిన చిన్నారి


లోయలో పడటంతో నుజ్జునుజ్జయిన బస్సు

**కాలువలో వ్యాను బోల్తా ముగ్గురు పిల్లల మృతి**

**లక్నో:** పెళ్లి నుంచి తిరిగొస్తుండగా 29 మంది ప్రయాణిస్తున్న వ్యాను కాలువలో పల్టీ కొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు పిల్లలు గల్లంతయ్యారు. వారిలో ముగ్గురి మృత దేహాలను గురువారం వెలికితీశారు. లక్నోకు సమీపంలోని నగ్రాం ప్రాంతంలోని ఇందిరా కెనాల్‌లో గురువారం తెల్లవారుజామున 3 గంటలకు వ్యాను బోల్తా పడింది. పొరుగున ఉన్న బారాబంకీ జిల్లాలో ఓ పెళ్లినుంచి తిరిగొస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని లక్నో జిల్లా మేజిస్ట్రేట్ కౌశల్‌రాజ్ శర్మ తెలిపారు. ప్రమాదం తరువాత 22 మందిని రక్షించగలిగారు. 5 నుంచి 10 ఏళ్లలోపు ఏడుగురు పిల్లలు గల్లంతవ్వగా, గాలింపుల అనంతరం మూడు మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన నలుగురిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.

## గల్ఫ్ ప్రాంతానికి భారత యుద్ధ నౌకలు

**న్యూఢిల్లీ:** అమెరికా–ఇరాన్‌ల మధ్య ఘర్షణ కారణంగా ఒమన్, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాల్లో ఉద్రిక్తత నేపథ్యంలో ఆ ప్రాంతంలో భారత నౌకాదళం యుద్ధనౌకలను మోహరించింది. ఆ ప్రాంతం గుండా ప్రయాణించే భారత నౌకలకు రక్షణ కోసమే ఈ పని చేసినట్లు నౌకాదళం తెలిపింది. ఒమన్, పర్షియన్ గల్ఫ్ ప్రాంతాల్లో నౌకాదళ విమానంతో నిఘా పెట్టినట్లు వెల్లడించింది. 'ఐఎన్ఎస్ చెన్నై, ఐఎన్ఎస్ సునయనలను ఒమన్, పర్షియన్ సింధుశాఖలకు పంపాం. సముద్రంలో మన నౌకలకు రక్షణ కోసమే ఈ పని చేశాం. గురుగ్రామ్‌లోని ఇన్ఫర్మేషన్ ఫ్యూజన్ సెంటర్ గల్ఫ్ ప్రాంతంలో నౌకల కదలికలపై ఓ కన్నేసింది' అని నౌకాదళం ఆ ప్రకటనలో పేర్కొంది.

## పార్లమెంటు ముందుకు 10 ఆర్డినెన్సులు

**న్యూఢిల్లీ:** గత లోక్‌సభ చివరి సమావేశాల్లో చట్టరూపం దాల్చకుండా ఉండిపోయిన 10 ఆర్డినెన్సుల కాపీలను గురువారం పార్లమెంటు ఉభయ సభల ముందుంచారు. గత మోదీ ప్రభుత్వం ఈ ఆర్డినెన్సులు తెచ్చింది. ప్రస్తుత పార్లమెంటు సమాశాల్లో ప్రవేశపెట్టేందుకు వీలుగా వీటిల్లో చాలా ఆర్డినెన్సులను తాజా బిల్లులుగా మార్చేందుకు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపింది. ట్రిపుల్ తలాక్‌పై ఆర్డినెన్సుతో పాటు భారతీయ వైద్య మండలి (సవరణ), కంపెనీలు (సవరణ), జమ్మూ కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ), ఆధార్ సహా ఇతర చట్టాలు (సవరణ) తదితర ఆర్డినెన్సులు వీటిలో ఉన్నాయి.

## పశ్చిమ బెంగాల్‌లో ఘర్షణలు; ఇద్దరు మృతి

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ ఉత్తర 24 పరగణాల జిల్లాలోని భాత్పురలో ఇరువర్గాల మధ్య అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించగా, 11 మంది గాయపడ్డారు. గొడవలో పాల్గొన్న వర్గాలు అధికార తృణమూల్ కాంగ్రెస్, బీజేపీలకు చెందినవని పోలీసులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టేందుకు గాల్లోకి కాల్పులు జరిపారు. గాయపడిన 11 మందిలో ఆరుగురు పోలీసులు ఉన్నారని డీజీపీ వీరేంద్ర కుమార్ వర్మ తెలిపారు. భాత్పుర పరిసర ప్రాంతాలలో 144 సెక్షన్ విధించారు.

## వయసును ఫోన్ అన్‌లాక్ చెప్తుంది!

**టొరంటో:** ఫోన్ లాక్ చేసే విధానాన్ని బట్టి ఉపయోగించే వారు ఏ వయసుకు చెందిన వారో గుర్తించవచ్చని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలంబియా (యూబీసీ) పరిశోధకులు వెల్లడించారు. వివరాలను తెలుసుకోవడానికి 19 నుంచి 63 వరకు వయసు ఉన్న 134 మందిని ఎంచుకొని వారి ఫోన్లలో ఓ ప్రత్యేక యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఈ యాప్ ద్వారా రెండు నెలల పాటు ఆయా వయసుల వారు ఫోన్‌ను ఎలా అన్‌లాక్ చేస్తున్నారు? ఎంత సమయం ఫోన్‌తో గడుపుతున్నారన్న వివరాలను సేకరించారు. ఈ సర్వేలో పెద్ద వయసు వారు కేవలం కదలకుండా ఇంట్లోగానీ, ఆఫీసులోగానీ ఉన్నపుడే ఎక్కువగా ఫోన్ వాడుతున్నట్లు తేలింది. ఎక్కువ వయసు ఉన్నవారు ఫోన్ అన్‌లాక్ చేయడానికి పిన్ వాడగా, యువకులు ఫింగర్‌ప్రింట్ వాడినట్లు పరిశోధకుల్లో ఒకరైన కాన్‌స్టంటైన్ బెజ్నోసావ్ తెలిపారు. ప్రతి 10 సంవత్సరాల వయసు వ్యత్యాసానికి ఫోన్ వినియోగించే సమయం 25 శాతం తగ్గుతోందన్నారు. లాక్ విషయంలో పురుషులు ఎక్కువగా ఆటోలాక్ మోడ్‌ను వాడగా, మహిళలు లాక్ బటన్ నొక్కుతున్నారు. 20ల వయసులో ఉన్న మహిళలు అదే వయసులోని పురుషుల కంటే ఎక్కువగా ఫోన్ వినియోగిస్తున్నారని తేలింది. ఈ పరిశోధన ద్వారా మానసిక ప్రవర్తనను అంచనా వేయలేమన్నారు. భవిష్యత్తులో తయారు చేయబోయే ఫోన్లను ఆయా వయసుల వారికి అనుగుణంగా తయారు చేసేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# అధ్యక్షుణ్ని పార్టీయే నిర్ణయిస్తుంది

**గెహ్లాట్‌కు నేను ఆమోదం తెలపలేదు: రాహుల్**

**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీకి తదుపరి అధ్యక్షుడు ఎవరో తమ పార్టీయే నిర్ణయిస్తుంది తప్ప తాను కాదనీ, ఆ పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు రాహుల్ గాంధీ గురువారం అన్నారు. 'మీరు రాజీనామా చేసిన తర్వాత ఎవరు పార్టీ అధ్యక్షుడు అవుతారు? గెహ్లాటేనా?' అని రాహుల్‌ను ప్రశ్నించగా ఆయన సమాధానమిస్తూ 'పార్టీ అధ్యక్షుడిని నియమించే వ్యక్తిని నేను కాను. అశోక్ గెహ్లాట్ తదుపరి అధ్యక్షుడయ్యేందుకు నేను ఆమోదం తెలిపాననడం అంతా అబద్ధం' అని అన్నారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన అనంతరం నైతిక బాధ్యత తీసుకుని తాను పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని రాహుల్ ప్రకటించడం, కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆయనను బుజ్జగిస్తుండటం తెలిసిందే. తాను రాజీనామా చేసేందుకు కట్టుబడి ఉంటానని రాహుల్ పట్టుబడుతున్నారు.



**మాటల ప్రవాహంలో అలా అన్నాను..**

'గిరిజనులను తుపాకీతో కాల్చేందుకు ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది' అంటూ తాను చేసిన వ్యాఖ్యలు మాటల ప్రవాహంలో, వచ్చాయని రాహుల్ జాతీయ ఎస్టీ కమిషన్ (ఎన్‌సీఎస్టీ)కి తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని షాదోల్‌లో ఏప్రిల్ 23న ఎన్నికల ప్రచారంలో రాహుల్ మాట్లాడుతూ 'నరేంద్ర మోదీ ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది. దీని ప్రకారం గిరిజనులను అటవీ సిబ్బంది తుపాకీతో కాల్చవచ్చు. వాళ్లు మీ భూములు లాక్కున్నారు. మీ అడవిని, నీళ్లను తీసుకున్నారు. ఇప్పుడు గిరిజనులపై కాల్పులు జరపవచ్చని చెబుతున్నారు' అని వ్యాఖ్యలు చేశారు.

# తుది దశకు బ్రిటన్ ప్రధాని రేసు

**లండన్:** బ్రిటన్ ప్రధానిగా థెరిసా మే స్థానంలో కొత్త కన్జర్వేటివ్ పార్టీ నేతను ఎన్నుకునే ప్రక్రియ గురువారం తుది దశకు చేరుకుంది. పాకిస్తాన్ సంతతికి చెందిన హోం మంత్రి సాజిద్ జావిద్ పోటీ నుంచి నిష్క్రమించగా ఈ పదవికి రేసులో ఉన్న మాజీ విదేశాంగ శాఖ మంత్రి బోరిస్ జాన్సన్ తిరుగులేని మెజారిటీతో ముందంజలో కొనసాగుతున్నారు. రహస్య బ్యాలెట్ల తుది రౌండ్‌లో బ్రిటన్ విదేశాంగ శాఖ మంత్రి జెరెమై హంట్‌ను పర్యావరణ శాఖ మంత్రి మైఖేల్ గోవ్ వెనక్కినెట్టడంతో ఈ రేసులో రెండో స్థానం కోసం జరుగుతున్న యుద్ధం మలుపు తిరిగింది. తాజా సమాచారం ప్రకారం జాన్సన్ 157 ఓట్లతో మొదటి స్థానంలో ఉండగా గోవ్ (61) హంట్ (59) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. బ్రిటన్ సీనియర్ మోస్ట్ మంత్రి అయిన జావిద్‌కు మూడవ దశలో కేవలం 34 ఓట్లే వచ్చాయి. ఈ నేపథ్యంలో జాన్సన్, గోవ్ ప్రధాని పదవికి పోటీ పడనున్నారు. తుది ప్రక్రియలో భాగంగా వారు పలు సమావేశాల్లో ఓటర్లనుద్దేశించి ప్రసంగించాల్సి ఉంటుంది. రెండు టీవీ చర్చల్లో కూడా పాల్గొనాల్సి ఉంటుంది. జూలై 22న విజేతను ప్రకటించే అవకాశం ఉంది.


జాన్సన్


గోవ్

# అమెరికా డ్రోన్‌ను కూల్చిన ఇరాన్

- యుద్ధానికి ఎప్పుడైనా సిద్ధమేనని హెచ్చరిక
- పెద్ద తప్పు చేశారు: ట్రంప్
- పెరిగిన క్రూడ్ ధర

**టెహ్రాన్:** అమెరికా, ఇరాన్‌ల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. తమ భూభాగంలోకి చొచ్చుకువచ్చిన అమెరికాకు చెందిన ఒక నిఘా డ్రోన్‌ను కూల్చివేసినట్టు ఇరాన్ వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏడాది క్రితం ఇరాన్‌తో అణు ఒప్పందం వెనక్కి తీసుకున్నప్పట్నుంచి ఇరు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఏ క్షణమైనా రెండు దేశాల మధ్య యుద్ధం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ తమ దేశ గగనతలంలోకి ప్రవేశించిన మానవరహిత, ఆయుధరహిత ఆర్‌క్యూ 4ఏ నిఘా డ్రోన్‌ను కూల్చేసినట్టు అక్కడ మీడియాలో కథనాలు వస్తున్నాయి. కానీ దానికి సంబంధించిన ఫొటోలను ఇరాన్ ప్రభుత్వం వెల్లడించలేదు. అమెరికా డ్రోన్‌ను కూల్చేసిన విషయాన్ని ధ్రువీకరిస్తూనే తాము నిబంధనలు ఉల్లంఘించి ఇరాన్ భూభాగంలోకి చొరబడలేదని హార్మోజ్‌గాన్ ప్రావిన్స్ వరకు ఆ డ్రోన్ వెళ్లిందని అది అంతర్జాతీయ గగనతలమని అమెరికా సెంట్రల్ కమాండ్ చెబుతోంది. వారం కిందటే అమెరికా డ్రోన్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగిందని అమెరికా మిలటరీ ఆరోపించింది. ఇప్పుడు ఈ డ్రోన్‌ను కూల్చివేసి ఇరాన్ అగ్రరాజ్యానికి ఘాటైన హెచ్చరికలే చేసింది. ''ఏ దేశమైనా మా ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలి. ఇరాన్ జాతీయ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూసుకోవాలి. అమెరికా మా గగనతలంలోకి ప్రవేశిస్తే ఎందుకు ఊరుకుంటాం. అందుకే సరైన సమయంలో సరైన నిర్ణయాన్నే తీసుకొని డ్రోన్‌ని కూల్చివేశాం'' అని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్పొరేషన్ జనరల్ హొస్సెని సలామి వెల్లడించారు. ఇరాన్‌కి ఎవరితోనూ యుద్ధం చేయాలన్న కోరిక లేదు కానీ, ఏ క్షణంలోనైనా యుద్ధం చెయ్యడానికి తామే సిద్ధమేనని సలామి ఘాటైన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ అణు ఒప్పందాన్ని వెనక్కి తీసుకోడమే కాక ఇరాన్‌తో ఎలాంటి వాణిజ్య కార్యకలాపాలు వద్దంటూ అగ్రరాజ్యం ఇతర దేశాలపై ఒత్తిడి పెంచినప్పట్నుంచి ఇరాన్ కవ్వింపు చర్యలకు దిగుతూనే ఉంది. డ్రోన్‌ను కూల్చివేయడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ ఒక డ్రోన్‌ను కూల్చివేసి దానిని అందరికీ ప్రదర్శించడంతో అమెరికా అగ్గిమీద గుగ్గిలమైంది. మున్ముందు పరిస్థితులు ఏ మలుపు తిరుగుతాయోనని ప్రపంచ దేశాలు ఆందోళనతో ఉన్నాయి.


ఇరాన్ కూల్చింది ఈ రకం డ్రోన్‌నే

**పెద్ద తప్పిదమే చేశారు: ట్రంప్**

డ్రోన్‌ను కూల్చివేయడం ద్వారా ఇరాన్ పెద్ద తప్పే చేసిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం అన్నారు. శ్వేత సౌధం ప్రెస్ కార్యదర్శి సారా శాండర్స్ మాట్లాడుతూ ఈ ఘటన గురించి బుధవారం రాత్రి, గురువారం ఉదయం ట్రంప్‌కు తాము వివరాలు వెల్లడించామని చెప్పారు. అనంతరం ట్రంప్ ట్వీట్ చేస్తూ 'ఇరాన్ చాలా పెద్ద తప్పే చేసింది' అని పేర్కొన్నారు. కాగా, ట్రంప్ చేసిన ఈ ట్వీట్ కారణంగా ముడిచమురు ధరలు దాదాపు 6 శాతం వరకు పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్‌లో బ్యారెల్ చమురు ధర 6.3 శాతం పెరిగి 57.13 డాలర్లకు చేరగా, లండన్‌లోని బ్రెంట్ ఫ్యూచర్స్‌లో బ్యారెల్ ధర 64.69 డాలర్లకు చేరింది.

సాక్షి బిజినెస్
శుక్రవారం
21-6-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 489 ▲ | 140 ▲ |
| 39,602 | 11,832 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం...
www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు రాత్రి 11.30గం॥లకు)

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,025 | ▲ | 38 |
| డోజోన్స్ | 26,657 | ▲ | 153 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,424 | ▲ | 21 |
| డాక్స్ | 12,355 | ▲ | 47 |
| షాంఘై | 2,987 | ▲ | 69 |
| నికాయ్ | 21,463 | ▲ | 129 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | కరెన్సీ | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.74 | 70.38 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.68 | 89.80 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.95 | 79.85 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.41 | 65.87 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 46.92 | 49.09 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 50.27 | 52.06 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.79 | 19.50 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.22 | 19.73 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.50 | 10.87 |



# మార్కెట్‌కు ‘ఫెడ్’ జోష్!

### వడ్డీ రేట్లు యథాతథమన్న ఫెడరల్ రిజర్వ్

- అవసరాన్ని బట్టి తగ్గిస్తామని అభయం
- దీంతో ప్రపంచ మార్కెట్లలో లాభాలు
- మన మార్కెట్లో భారీగా షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
- పుంజుకున్న రూపాయి
- బడ్జెట్‌లో సానుకూల చర్యలపై అంచనాలు
- 489 పాయింట్లు లాభపడి 39,602కు సెన్సెక్స్
- 140 పాయింట్లు ఎగసి 11,832కు నిఫ్టీ

వడ్డీరేట్ల విషయంలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ సరళతర విధానం కారణంగా ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. దీనికి మన దగ్గర షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు, వేల్యూ బయింగ్ కూడా జత కావడంతో మన మార్కెట్ కూడా గురువారం భారీగా లాభపడింది. గత మూడు రోజులుగా అంతంత మాత్రం లాభాలతో సరిపెట్టుకున్న సెన్సెక్స్, నిఫ్టీలు భారీ లాభాలు సాధించాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ పుంజుకోవడం, రానున్న బడ్జెట్‌లో వ్యాపార వర్గాలకు అనుకూలమైన చర్యలు ఉంటాయనే అంచనాలు సానుకూల ప్రభావం చూపించాయి. ముడిచమురు ధరలు భగ్గుమన్నా, మార్కెట్ ముందుకే దూసుకుపోయింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 489 పాయింట్లు పెరిగి 39,602 పాయింట్ల వద్ద, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 140 పాయింట్లు ఎగసి 11,832 పాయింట్ల వద్ద ముగిశాయి. అన్ని రంగాల సూచీలు లాభాల్లోనే ముగిశాయి.

**ముడిచమురు ధరలు భగ్గుమన్నా...**

అమెరికాకు చెందిన డ్రోన్‌ను ఇరాన్ కూల్చేసిందన్న వార్తల కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింతగా ప్రజ్వరిల్లుతాయనే ఆందోళన నెలకొన్నది. ఈ నేపథ్యంలో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. ఒక పీపా బ్రెంట్ ముడి చమురు ధర దాదాపు 3% పెరిగి 63.37 డాలర్లకు చేరింది. సాధారణంగా చమురు ధరలు పెరిగితే మన మార్కెట్ పడిపోతుంది. ఈసారి దీనికి భిన్నంగా జరిగింది. ముడిచమురు 3% పెరిగినా, డాలర్‌తో రూపాయి మారకం 23 పైసలు లాభపడటం కలసివచ్చింది.

**703 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్...**

సెన్సెక్స్ నష్టాల్లో ఆరంభమైనప్పటికీ, ఆ తర్వాత పుంజుకుంది. బ్యాంక్, ఫార్మా, వాహన షేర్లలో జోరుగా కొనుగోళ్లు సాగాయి. అమెరికా–చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతల నివారణకు ఒప్పందం కుదిరే అవకాశాలున్నాయన్న ఆశలూ సానుకూల ప్రభావం చూపించాయి. మహారాష్ట్రలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయన్న వార్తలు సెంటిమెంట్‌కు జోష్‌నిచ్చాయి. ఇటీవల నష్టాలతో ధరలు తగ్గి ఆకర్షణీయంగా ఉన్న షేర్లలో వేల్యూబయింగ్ చోటు చేసుకుంది. మరో వారం రోజుల్లో జూన్ సిరీస్ డెరివేటివ్స్ కాంట్రాక్టులు ముగియనుండటంతో షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జరిగాయి. ఒక దశలో 179 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ మరో దశలో 524 పాయింట్లు పెరిగింది. రోజంతా 703 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది. ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి.

**రూ.1.75 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద**

స్టాక్ మార్కెట్ భారీ లాభాలతో ఇన్వెస్టర్ల సంపద రూ.1.75 లక్షల కోట్లు పెరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.1.75 లక్షల కోట్లు పెరిగి రూ.1,61,30,671 కోట్లకు పెరిగింది.

**జెట్ ఎయిర్‌వేస్ షేరు డబుల్...**

జెట్ ఎయిర్‌వేస్ భారీ లాభాలను సాధించింది. స్టాక్ మార్కెట్లో ఏ షేరూ ఏ రోజూ పెరగనంత స్థాయిలో జెట్ ఎయిర్‌వేస్ షేర్ పెరిగింది. ట్రేడింగ్ ఆరంభంలోనే ఈ షేర్ 18 శాతం నష్టంతో జీవితకాల కనిష్ట స్థాయి, రూ.27కు పడిపోయింది. అయితే షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతోఈ ఈ షేర్ పుంజుకుంది. ఇంట్రాడేలో 134 శాతం లాభంతో రూ.77కు ఎగసిన జెట్ ఎయిర్‌వేస్ షేర్ చివరకు 93 శాతం లాభంతో రూ.64 వద్ద ముగిసింది. గత 13 సెషన్లలో ఈ షేర్ దాదాపు 78 శాతం పతనమైంది. ఈ కంపెనీపై దివాలా ప్రక్రియ ప్రారంభించాలని ఎన్‌సీఎల్‌టీలో ఎస్‌బీఐ కేసు వేయడం తెలిసిందే.

**మరిన్ని విశేషాలు..**

- 31 సెన్సెక్స్ షేర్లలో నాలుగు షేర్లు–ఐటీసీ, ఎన్‌టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలీవర్‌లు మాత్రమే నష్టపోయాయి. మిగిలిన 27 షేర్లు లాభాల్లో ముగిశాయి. ఇండియాబుల్స్ హౌసింగ్ షేర్ 8% ఎగసింది.
- యస్ బ్యాంక్ 11 శాతం లాభపడి రూ. 115 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా లాభపడిన షేర్ ఇదే. ఆరంభంలో ఈ షేర్ రెండంకెల స్థాయి, రూ.98.75కి పడిపోయింది. ఈ షేర్ రెండంకెల స్థాయికి పడిపోవడం గత ఐదేళ్లలో ఇదే మొదటిసారి. అయితే షార్ట్ కవరింగ్ కొనుగోళ్ల కారణంగా ఈ నష్టాల నుంచి ఈ షేర్ కోలుకుంది.

### ఫెడ్... రేట్ల తగ్గింపు సంకేతాలు!

అమెరికా ఫెడరల్ రిజర్వ్ పాలసీ రేట్లను ప్రస్తుతమున్న 2.25–2.50 శాతం రేంజ్‌లోనే కొనసాగించాలని నిర్ణయించింది. రేట్ల విషయమై యథాతథ స్థితిని కొనసాగించినప్పటికీ, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వృద్ధి తోడ్పాటుకు తగిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపింది. వివిధ పరిణామాల కారణంగా మందగమనం చోటు చేసుకోవడంతో అవసరమైతే, వచ్చే నెలలోనే రేట్లను అర శాతం మేర తగ్గించగలమని సంకేతాలు ఇచ్చింది. దాదాపు పదేళ్ల తర్వాత ఫెడ్ రేట్లను తగ్గించడానికి సిద్ధమవుతోంది. ఫెడ్ నిర్ణయాన్ని ఇతర దేశాల కేంద్ర బ్యాంక్‌లూ అనుసరించే అవకాశాలుండటంతో ప్రపంచ మార్కెట్లు లాభపడ్డాయి. ఫెడ్ రేట్లను తగ్గిస్తే, వృద్ధి చెందుతున్న దేశాలకు ముఖ్యంగా భారత్‌కు విదేశీ నిధులు వెల్లువలా వస్తాయి. అందుకని ఫెడ్ నిర్ణయంతో మన మార్కెట్ భారీగా లాభపడింది.

## ఐదేళ్ల గరిష్టానికి పసిడి పరుగు



**న్యూఢిల్లీ/న్యూయార్క్:** అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్– నైమెక్స్‌లో పసిడి ధర గురువారం పరుగులు పెట్టింది. ఒక దశలో ఔన్స్ (31.1గ్రా) ధర బుధవారం ముగింపుతో పోల్చి చూస్తే, 45 డాలర్ల లాభంతో 1,395 డాలర్ల వద్ద ట్రేడయ్యింది. పసిడికి ఇది ఐదు సంవత్సరాల్లో గరిష్టస్థాయి. గతంలో పలు సార్లు పసిడి 1,360 డాలర్ల వద్ద తీవ్ర నిరోధాన్ని ఎదుర్కొంది. ఇప్పుడు ఈ స్థాయి దాటడంతో ఒక్కసారిగా 1,400 డాలర్ల వైపు పరుగుపెట్టింది. ఈ స్థాయి దాటితే మరో 50 డాలర్లకు పసిడి పెరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి.

**పరుగుకు కారణం..:** అమెరికాలో వృద్ధి రేటు మందగమనం, దీనితో అమెరికా సెంట్రల్ బ్యాంక్–ఫెడ్ ఫండ్ రేటు తగ్గుతుందన్న అంచనాలు (ప్రస్తుతం 2.25–2.50 శాతం) పసిడి పరుగుకు కారణంగా నిలిచాయి. అమెరికా వృద్ధి మందగమనం వార్తలతో డాలర్ ఇండెక్స్ స్పీడ్ తగ్గడం కూడా గమనార్హం. ఇక వాణిజ్యయుద్ధం వంటి అంశాలు ప్రపంచ వృద్ధి తీరును ఆందోళనలోకి నెడుతున్నాయి. ఆయా అంశాలు పసిడికి తక్షణ బలాన్ని ఇస్తున్నాయి.

**దేశంలో రూ. 1,000 అప్..:** ఇక దేశంలోని మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ చూస్తే, ఈ వార్త రాసే సమయానికి బుధవారం ముగింపుతో పోల్చితే 10 గ్రాముల బంగారం ధర రూ.1,000 లాభంతో రూ. 34,058 వద్ద ట్రేడవుతోంది. ప్రస్తుతం 69.44 వద్ద ఉన్న రూపాయి మరింత బలహీనపడితే, దేశంలో పసిడి పరుగు మరింత వేగంగా ఉండే అవకాశం ఉందని అంచనా.

## ఇదిగో... కియా ‘సెల్టోస్’

- నాల్గవ త్రైమాసికంలో కారు విడుదల
- ధరల శ్రేణి రూ.10 – 17 లక్షలు




**గురుగ్రామ్:** దక్షిణ కొరియా ఆటో రంగ సంస్థ కియా మోటార్స్ తన ప్రీమియం కాంపాక్ట్ ఎస్‌యూవీ ‘సెల్టోస్’ కారును గురువారం ఇక్కడ ప్రదర్శించింది. భారత మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకునే ఈ కారును రూపొందించి, అభివృద్ధి చేసినట్లు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో కంపెనీకి ఉన్న ప్లాంట్ నుంచే మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలతో పాటు ఇతర ఆసియా దేశాలకు ఎగుమతి చేస్తామని స్పష్టం చేసింది. ఈ ఏడాది నాల్గవ త్రైమాసికంలో కారు విడుదల కానుండగా.. ధరల శ్రేణి రూ.10 లక్షల నుంచి రూ.17 లక్షలుగా వెల్లడించింది. బీఎస్–6 ప్రమాణాలతో రూపొందించిన ఈ కారు పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో లభ్యం కానుంది. మూడు ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లతో పాటు సిక్స్–స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ వెర్షన్లతో అందుబాటులోకి రానుంది.

**భారత్‌లో రూ.13,896 కోట్ల పెట్టుబడి**

సెల్టోస్ విడుదల సందర్భంగా సంస్థ ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ హాన్–వూ పార్క్ మాట్లాడుతూ.. ‘వచ్చే రెండేళ్లలో అనంతపురం ప్లాంట్‌లో మొత్తం నాలుగు మోడళ్లు ఉత్పత్తి కానున్నాయి. వీటిలో సెల్టోస్ ఒకటి కాగా, దేశవ్యాప్తంగా 160 నగరాల్లో 265 టచ్ పాయింట్లతో మా ప్రస్థానం మొదలుకానుంది. 2020 నాటికి ఈ సంఖ్య 300 వద్దకు చేరుకోవాలనేది కంపెనీ లక్ష్యం. ఆ తరువాత 2021 నాటికి 350కి పెంచనున్నాం. భారత్‌లో ఇప్పటివరకు 2 బిలియన్ డాలర్లు (రూ.13,896 కోట్లు) మేర పెట్టుబడిపెట్టాం. ఇందులో ఒక్కప్లాంట్ కోసమే 1.1 బిలియన్ డాలర్లు (రూ.7,643 కోట్లు) పెట్టుబడిపెట్టగా.. ఏడాదికి మూడు లక్షల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఈ ప్లాంట్‌కు ఉంది’ అని తెలిపారు.

## నేడు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం

- ఎలక్ట్రిక్ వాహనాల పన్ను 5 శాతానికి తగ్గింపు?
- జీఎస్టీ ఎగవేతలను నిరోధించే పలు ప్రతిపాదనలు
- నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో తొలి భేటీ



**న్యూఢిల్లీ:** ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రోత్సాహంలో భాగంగా జీఎస్టీ రేటు తగ్గింపుపై జీఎస్టీ కౌన్సిల్ శుక్రవారం జరిగే సమావేశంలో ఏదో ఒక నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతం 12 శాతం రేటు ఉండగా, దీన్ని 5 శాతానికి తగ్గించాలన్నది ప్రతిపాదన. పెట్రోల్, డీజిల్ వాహనాలపై ప్రస్తుతం 28 శాతం పన్ను రేటు అమల్లో ఉంది. అక్రమ లాభ నిరోధక విభాగం పదవీ కాలాన్ని మరో ఏడాది పాటు 2020 నవంబర్ వరకు పొడిగించే ప్రతిపాదనపైనా కౌన్సిల్ నిర్ణయాన్ని ప్రకటించనుంది. కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ ఆధ్వర్యంలో జరిగే తొలి జీఎస్టీ కౌన్సిల్ భేటీ ఇది. వాస్తవానికి కౌన్సిల్‌కు ఇది 35వ సమావేశం అవుతుంది. జీఎస్టీ ఎగవేత నిరోధక చర్యల్లో భాగంగా ఈవే బిల్లును జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్‌ఏఐ) చెందిన ఫాస్టాగ్‌తో 2010 ఏప్రిల్ 1 నుంచి అనుసంధానించడం, వ్యాపారుల నుంచి వ్యాపారుల మధ్య జరిగే విక్రయాలు (బీటుబీ) రూ.50 కోట్ల పైన ఉంటే ఈ ఇన్‌వాయిస్ జారీ చేయడం, అన్ని సినిమా హాళ్లలో ఈ టికెట్‌ను తప్పనిసరి చేయాలని రాష్ట్రాలను కోరే అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి.

**లాటరీలపై పన్ను అంశం తేలేనా?**

లాటరీలపై జీఎస్టీ రేటు తగ్గింపుపైనా నిర్ణయం తీసుకోవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం లాటరీలపై భిన్న పన్ను రేట్లు అమల్లో ఉన్నాయి. ఏకీకృత రేటు విషయంలో 8 మందితో కూడిన రాష్ట్రాల ఆర్థిక మంత్రుల బృందం ఏకాభిప్రాయానికి రాలేకపోయింది. రాష్ట్రాలు నిర్వహించే లాటరీలపై 12% రేటు ఉంటే, రాష్ట్ర గుర్తింపుతో నడిచే లాటరీలపై 28 శాతం పన్ను అమలు చేస్తున్నారు. జీఎస్టీ రిఫండ్స్ మంజూరు వ్యవహారాలకు ఒకే ఒక యంత్రాంగం ఉండాలన్న దానిపైనా కౌన్సిల్ చర్చించనుంది. ప్రస్తుతం తిరిగి చెల్లింపులను చూసేందుకు కేంద్రం, రాష్ట్రాల తరఫున రెండు రకాల యంత్రాంగాలు ఉన్నాయి. అలాగే, అప్పిలేట్ అథారిటీ నేషనల్ బెంచ్ ఏర్పాటు అంశం కూడా చర్చకు రానుంది.

## ఇక కిరాణా షాపుల్లోనూ వైఫై సేవలు

### పీసీవో తరహా విధానం ప్రవేశపెట్టడంపై కేంద్రం కసరత్తు



**న్యూఢిల్లీ:** ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా ప్రాచుర్యంలోకి వస్తున్న నేపథ్యంలో దుకాణాదారులు, రెస్టారెంట్లు మొదలైనవి కూడా వైఫై సేవలను విక్రయించే వెసులుబాటు తేవడంపై ప్రభుత్వం దృష్టి పెడుతోంది. గతకాలపు పబ్లిక్ ఫోన్ బూత్‌ల (పీసీవో) తరహాలో ఈ వైఫై సర్వీసులు అందుబాటులోకి తేవాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా వైఫై హాట్‌స్పాట్స్‌ను పెంచే క్రమంలో పబ్లిక్ డేటా ఆఫీస్ (పీడీవో)ల పేరిట వీటిని ఏర్పాటు చేయాలని టెలికం రంగ నియంత్రణ సంస్థ (ట్రాయ్) సూచించింది. అయితే, టెలికం సేవల సంస్థల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో గతంలో దాన్ని పక్కన పెట్టారు. అయితే, ఏదో ఒక రూపంలో పీడీవో తరహా విధానాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని టెలికం శాఖ కార్యదర్శి అరుణ సుందరరాజన్ తెలిపారు. ప్రస్తుత సైబర్ కేఫ్‌ల నిబంధనలకు లోబడి.. పబ్లిక్ డేటా ఆఫీస్ అగ్రిగేటర్లు (పీడీవోఏ) గతకాలపు పీసీవో తరహా సెటప్‌లో ఇంటర్నెట్ సర్వీసులు విక్రయించే అంశం పరిశీలించవచ్చని ట్రాయ్ సిఫార్సు చేసింది. కానీ, ఇప్పటికే తీవ్ర రుణభారంలో ఉన్న పరిశ్రమపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని, జాతీయ భద్రతకు కూడా ప్రమాదకరమని టెలికం ఆపరేటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

## జెట్ దివాలా పరిష్కారానికి 90 రోజుల గడువు

### పరిష్కార నిపుణుడిని కోరిన ఎన్‌సీఎల్‌టీ



**ముంబై:** జెట్ ఎయిర్‌వేస్‌కు వ్యతిరేకంగా దివాలా పరిష్కారం కోసం ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని బ్యాంకుల కూటమి దాఖలు చేసిన దరఖాస్తును జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గురువారం నమోదు చేసుకుంది. గ్రాంట్ థార్న్‌టన్‌కు చెందిన ఆశిష్ చౌచారియాను పరిష్కార నిపుణుడిగా నియమించింది. ఈ అంశం జాతీయ ప్రాధాన్యం గలది కాబట్టి చట్ట ప్రకారం ఆరు నెలల గడువు ఉన్నప్పటికీ, మూడు నెలల వ్యవధిలోపు పరిష్కార ప్రక్రియ కనుగొనేందుకు ప్రయత్నించాలని పరిష్కార నిపుణుడిని ఎన్‌సీఎల్‌టీ బెంచ్ కోరింది. పిటిషన్‌లో ఎస్‌బీఐ జెట్ ఎయిర్‌వేస్ నుంచి రూ.967 కోట్లు తనవంతుగా వసూలు కావాల్సి ఉందని తెలిపింది. ఇందులో మూలధన అవసరాలకు రూ.505 కోట్లు, ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కింద రూ.462 కోట్లను జెట్ ఎయిర్‌వేస్‌కు అందించినట్టు పేర్కొంది. ఈ దరఖాస్తులో జోక్యం చేసుకునేందుకు తమను అనుమతించాలంటూ నెదర్లాండ్‌కు చెందిన లాజిస్టిక్స్ విక్రయదారులు దాఖలు చేసిన పిటిషన్‌ను బెంచ్ తిరస్కరించింది. ప్రతీ 15 రోజులకోసారి పరిష్కార పురోగతిపై నివేదికను సమర్పించాలని, తొలి నివేదిక జూలై 5న దాఖలు చేయాలని పరిష్కార నిపుణుడిని ఎన్‌సీఎల్‌టీ ఆదేశించింది. అదే రోజు ఈ పిటిషన్‌పై బెంచ్ తదుపరి విచారణ చేయనుంది. మొత్తం 26 బ్యాంకులకు జెట్ ఎయిర్‌వేస్ రూ.8,500 కోట్ల మేర బకాయిపడింది. వందలాది విక్రయదారులు, ఉద్యోగులకు రూ.13,000 కోట్లకు పైగా చెల్లింపులు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ 17 నుంచి ఈ సంస్థ కార్యకలాపాలు పూర్తిగా ఆగిపోవడం తెలిసిందే.

## పెరిగిన మారుతీ ‘డిజైర్’ ధర

### రూ.12,690 పెంపు



**న్యూఢిల్లీ:** మారుతీ సుజుకి ఇండియా తన పాపులర్ కాంపాక్ట్ సెడాన్ డిజైర్ కారు ధరను రూ.12,690 మేర పెంచినట్లు ప్రకటించింది. ఈ పెంపు గురువారం నుంచే అమల్లోకి వచ్చింది. నూతన భద్రతా ప్రమాణాలు, ఉద్గార నిబంధనలకు అనుగుణంగా ఈ కారును రూపొందించాల్సి రావడం వల్ల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. పెట్రోల్, డీజిల్ వెర్షన్లలో ఏఐఎస్–145 భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నట్లు నియంత్రణ సంస్థలకు ఇచ్చిన సమాచారంలో తెలిపింది. నూతన ధరల అమలు తరువాత ఢిల్లీ–ఎన్‌సీఆర్‌లో ఈ కారు ధరల శ్రేణి రూ.5,82,613–రూ.9,57,622 కాగా, అంతక్రితం రూ.5,69,923 నుంచి రూ.9,54,522 శ్రేణిలో ఉంది.

## మోటో ‘వన్ విజన్’ ఆవిష్కరణ

### ధర రూ.19,999



**న్యూఢిల్లీ:** ప్రముఖ మొబైల్ హ్యాండ్‌సెట్స్ తయారీ సంస్థ మోటరోలా తాజాగా ‘వన్ విజన్’ ఆండ్రాయిడ్ వన్ స్మార్ట్ ఫోన్‌ను భారత మార్కెట్‌లో ఆవిష్కరించింది. ఈ నెల 27 నుంచి ఈ స్మార్ట్‌ఫోన్ అందుబాటులోకి రానుంది. దీని ధర రూ.19,999. 48 మెగాపిక్సెల్ సెన్సర్ కెమెరా, 25ఎంపీ ఫ్రంట్ కెమెరా, 6.3 అంగుళాల డిస్‌ప్లే, 4 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ మెమరీ, 3500 ఎంఏహెచ్ బ్యాటరీ తదితర ప్రత్యేకతలతో ఈ ఫోన్ మార్కెట్లోకిరానుంది.

# ‘హెచ్1’ దెబ్బ అమెరికాకే..!

- వీసాలపై ఆంక్షలతో అక్కడి సంస్థలకు నిపుణులు దొరకరు
- భారత ఐటీ పరిశ్రమకూ ఇబ్బందే
- నాస్కామ్ వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ:** టెక్నాలజీ నిపుణులకు వీసాలివ్వటంపై మరిన్ని పరిమితులు విధిస్తే అమెరికన్ కంపెనీలకే ప్రతికూలమవుతుందని దేశీ ఐటీ పరిశ్రమల సమాఖ్య నాస్కామ్ వ్యాఖ్యానించింది. ఈ వీసాలపై విదేశీ నిపుణులను నియమించుకునే అమెరికన్ కంపెనీలు సరైన వారు దొరక్క బలహీనంగా మారతాయని, ఉద్యోగాలకు ముప్పు తప్పదని పేర్కొంది. వివాదాస్పద హెచ్–1బీ వీసాలు అత్యధికంగా భారతీయులకే దక్కుతుండటం వారి ప్రతిభకు తార్కాణమని, వీటిలో చాలా మటుకు వీసాలను అంతర్జాతీయ, అమెరికన్ బహుళజాతి దిగ్గజాలు స్పాన్సర్ చేస్తున్నాయని నాస్కామ్ తెలియజేసింది. విదేశీ కంపెనీలు డేటాను తమ దేశంలోనే భద్రపర్చాలంటూ ఒత్తిడి చేసే దేశాలకు ఇచ్చే హెచ్–1బీ వీసాలపై 10–15 శాతం మేర పరిమితి విధించే అంశాన్ని అమెరికా పరిశీలిస్తోందంటూ వార్తలొచ్చిన నేపథ్యంలో నాస్కామ్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఈ అంశంపై ఇప్పటిదాకా అమెరికా ప్రభుత్వం నుంచి అధికారికంగా ధృవీకరణ ఏదీ రాలేదని, అధికారులిచ్చే స్పష్టమైన వివరణ కోసం ఎదురు చూస్తున్నామని నాస్కామ్ తెలిపింది. ఒకవేళ ఇలాంటిదేమైనా అమలు చేసిన పక్షంలో ప్రధానంగా ఉత్తర అమెరికా మార్కెట్ నుంచే భారీగా ఆదాయాలు పొందుతున్న 150 బిలియన్ డాలర్ల భారతీయ ఐటీ పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడనుంది. సాధారణంగా భారతీయ ఐటీ సంస్థలు అత్యధికంగా హెచ్–1బీ వీసాలపైనే తమ ఉద్యోగులను అమెరికాలోని క్లయింట్ లొకేషన్స్‌కు పంపిస్తుంటాయి. అయితే, ఇటీవలి కాలంలో వీసాల పరిశీలన చాలా కఠినతరంగా మారడంతో దేశీ ఐటీ సంస్థలు అమెరికాలోని స్థానికులనే ఎక్కువగా రిక్రూట్ చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నాయి. ‘ఒకవేళ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ఉద్యోగులను రిక్రూట్ చేసుకోవడాన్ని అమెరికా విధానాలు కఠినతరం చేసిన పక్షంలో దాని వల్ల.. వారిపై ఆధారపడి ఉన్న అమెరికా కంపెనీలే బలహీనపడతాయి. ఆయా సర్వీసులను మళ్లీ విదేశాల నుంచి పొందాల్సి వస్తుంది’ అని నాస్కామ్ ఒక ప్రకటనలో తెలిపింది.

**పరిమితులపై ఇంకా సమాచారం రాలేదు: కేంద్ర వాణిజ్య శాఖ**

డేటా లోకలైజేషన్ నిబంధనలు అమలు చేసే దేశాలకిచ్చే హెచ్–1బీ వీసాలపై పరిమితులు విధించే విషయంపై అమెరికా నుంచి అధికారికంగా ఎలాంటి సమాచారం రాలేదని కేంద్ర వాణిజ్య శాఖ వర్గాలు తెలిపాయి. చెల్లింపుల సేవలు అందించే పేమెంట్ సర్వీసుల సంస్థలు భారతీయ వినియోగదారుల డేటాను భారత్‌లోనే ఉంచాలంటూ కేంద్రం గతేడాది ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే, ఇలాంటి నిబంధనలనే వ్యతిరేకిస్తూ.. తాజాగా హెచ్–1బీ వీసాల విషయంలో భారత్ లాంటి దేశాలను అమెరికా టార్గెట్ చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

# 2.76 లక్షల కొత్త కొలువులు

- ఈ ఏడాది ప్రథమార్ధంలో రావచ్చని అంచనా
- ఎఫ్‌ఎంసీజీ, రిటైల్ రంగాల్లోనే అత్యధికం
- టీమ్‌లీజ్ సర్వీసెస్ నివేదికలో వెల్లడి



**ముంబై:** ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలోని తొలి ఆరు నెలల్లో రిటైల్, ఎఫ్‌ఎంసీజీ (ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్) రంగాల్లో అత్యధికంగా 2.76 లక్షల ఉద్యోగాల కల్పన జరగనుంది. విదేశీ రిటైల్ దిగ్గజాలు ఆయా రంగాల్లోకి పెద్ద యెత్తున విస్తరిస్తుండటమే ఇందుకు కారణం. ఏప్రిల్–సెప్టెంబర్ 2019–20 కాలానికి సంబంధించి ఉద్యోగాల అంచనాల నివేదికలో టీమ్‌లీజ్ సర్వీసెస్ సంస్థ ఈ విషయాలు వెల్లడించింది. దీని ప్రకారం రిటైల్ రంగంలో నికరంగా ఉద్యోగావకాశాలు 2 శాతం పెరిగి అదనంగా 1.66 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. ఇక ఎఫ్‌ఎంసీజీలో 1 శాతం వృద్ధితో 1.10 లక్షల కొత్త ఉద్యోగాలు వస్తాయి. 27,560 ఉద్యోగాలతో ఢిల్లీ రిటైల్ రంగం అగ్రస్థానంలో.. 22,770 కొత్త కొలువులతో బెంగళూరు ఆ తర్వాత స్థానంలో ఉంటాయి. విదేశీ రిటైల్ దిగ్గజాల రాకతో పాటు రిటైల్ రంగం భారీగా వృద్ధి చెందడం, కార్యకలాపాలు విస్తరించడం, కంపెనీల కొనుగోళ్లు జరగడం తదితర అంశాలు ఉపాధి కల్పనకు ఊతంగా నిలుస్తున్నాయని టీమ్‌లీజ్ సర్వీసెస్ పేర్కొంది.

**ఎఫ్‌ఎంసీజీలో ముంబై, ఢిల్లీ టాప్..**

రిటైల్‌లో కొత్త కొలువులకు ఢిల్లీ, బెంగళూరు అగ్రస్థానాల్లో ఉండగా.. ఎఫ్‌ఎంసీజీ విభాగంలో ముంబై (14,770 కొత్త ఉద్యోగాలు), ఢిల్లీ (10,880) టాప్ స్థానాల్లో ఉంటాయి. ఫుడ్ పార్కుల ఏర్పాటు, సామర్థ్యాల పెంపు, ప్రస్తుత కంపెనీలు.. ఇతర సంస్థలను కొనుగోళ్లు చేయడం, క్యాష్ అండ్ క్యారీ విభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలు సడలించడం, సింగిల్, మల్టీ బ్రాండ్ రిటైల్‌లో ఆటోమేటిక్ రూట్‌లో పెట్టుబడులకు అనుమతించడం వంటి అంశాలు ఈ ఉపాధి కల్పనకు ఊతంగా ఉండగలవని టీమ్‌లీజ్ సర్వీసెస్ హెడ్ (డిజిటల్, ఐటీ విభాగం)మయూర్ సారస్వత్ తెలిపారు. మొత్తం మీద చూస్తే రిటైల్ ద్వారా 15.11 శాతం, ఎఫ్‌ఎంసీజీ వల్ల 10.31% ఉద్యోగాల వృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. అనుభవజ్ఞులకు మాత్రమే కాకుండా ఫ్రెషర్లకు కూడా బాగానే అవకాశాలు లభించగలవని సారస్వత్ తెలిపారు. కేవలం రిటైల్‌లోనే 33,310 తాజా గ్రాడ్యుయేట్స్‌కు కొత్తగా ఉద్యోగావకాశాలు లభించగలవన్నారు. నివేదిక ప్రకారం 2018–19 అక్టోబర్–మార్చి వ్యవధితో పోలిస్తే 2018–19 ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో రిటైల్, ఎఫ్‌ఎంసీజీ రంగాల్లో ఉద్యోగుల వలసలు భారీగా నమోదయ్యాయి. రిటైల్‌లో 19.82 శాతంగాను, ఎఫ్‌ఎంసీజీలో 16.03 శాతంగాను ఉన్నట్లు నివేదిక పేర్కొంది.

## డాలర్‌తో లాభపడ్డ రూపాయి

**24 పైసలు పెరిగి వారం గరిష్టానికి చేరిక**

**ముంబై:** డాలర్‌తో రూపాయి గురువారం 24 పైసలు (0.34 శాతం) లాభపడింది. దీంతో వారం గరిష్ట స్థాయిలో 69.44 వద్ద ముగిసింది. అమెరికా ఫెడ్ సమీప భవిష్యత్తులో రేట్ల కోత ఉంటుందన్న సంకేతాలు ఇవ్వడం రూపాయి బలపడేలా చేసింది. మరోవైపు ఈక్విటీ మార్కెట్లలో ర్యాలీ కూడా ఫారెక్స్ మార్కెట్లో సెంటిమెంట్‌ను సానుకూల పరిచింది.

### బులియన్ రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,970 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,350 | 0 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 1000 |
| **చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,740 | ▲ 700 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,130 | ▲ 660 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 1000 |
| **హైదరాబాద్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 33,740 | ▲ 700 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,130 | ▲ 660 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 1000 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,000 | ▲ 450 |
| బంగారం (22 క్యారెట్లు) | 31,550 | ▲ 440 |
| వెండి (కిలో) | 38,800 | ▲ 400 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,500 | ▲ 680 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,080 | ▲ 620 |
| వెండి (కిలో) | 39,500 | ▲ 1500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 34,740 | ▲ 720 |
| బంగారం (22 క్యారెట్లు) | 32,130 | ▲ 340 |
| వెండి (కిలో) | 41,300 | ▲ 1000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

### ముడిచమురు... (బ్యారల్)

| | | |
|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 56.89 (రాత్రి 11.30కు) | $53.97 (బుధవారం ముగింపు) |
| బ్రెంట్ | 64.19 (రాత్రి 11.30కు) | $61.82 (బుధవారం ముగింపు) |

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-6-2019

| | |
|---|---|
| విశాఖ | 427-00 |
| చిత్తూరు | 463-00 |
| విజయవాడ | 420-00 |
| నమక్కల్ | 450-00 |
| గోదావరి | 420-00 |

### ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

| కంపెనీ పేరు | ముగింపు ధర | క్రితం ముగింపు |
|---|---|---|
| ADANI PORT | 401.2 | 407.7 |
| ASIAN PAINT | 1392.05 | 1381.15 |
| AXIS BANK L | 771.4 | 770.7 |
| BAJAJ AUTO | 2897.3 | 2822.9 |
| BAJAJ FINSE | 8417.85 | 8257 |
| BAJAJ FINAN | 3582.55 | 3525.5 |
| BHARTI AIRT | 348.55 | 341.1 |
| BPCL | 385.2 | 379.35 |
| BRITANNIA I | 2834.05 | 2875.7 |
| CIPLA LTD | 551.3 | 533.7 |
| COAL INDIA | 260.35 | 257.05 |
| EICHER MOTO | 19793.15 | 19790.7 |
| GAIL (INDIA) | 311.15 | 307.75 |
| GRASIM INDU | 900.8 | 882.05 |
| HCL TECHNOL | 1087.35 | 1084.1 |
| HDFC LTD | 2199.25 | 2175.4 |
| HDFC BANK L | 2426.35 | 2428.35 |
| HERO MOTOCO | 2665.7 | 2606.15 |
| HINDALCO | 194.3 | 190.05 |
| HUL | 1805.05 | 1811.7 |
| INDIABULLS | 599.75 | 555.5 |
| ICICI BANK | 433.4 | 419.8 |
| INDUSIND BA | 1435.6 | 1381.35 |
| BHARTI INFR | 279.05 | 272.1 |
| INFOSYS LIM | 754.9 | 751.9 |
| INDIAN OIL | 156.75 | 154.4 |
| ITC LTD | 277 | 277.2 |
| JSW STEEL L | 269.25 | 260.55 |
| KOTAK MAHIN | 1518.35 | 1497.8 |
| LARSEN & T | 1557.1 | 1505.15 |
| MAHINDRA &M | 627.15 | 615.15 |
| MARUTI SUZU | 6616.75 | 6424.65 |
| NTPC LTD | 134.55 | 134.65 |
| ONGC | 172 | 167.35 |
| POWER GRID | 200.95 | 200.3 |
| RIL | 1296.75 | 1277.35 |
| SBI | 345.15 | 338.85 |
| SUN PHARMAC | 390.5 | 375.2 |
| TATA MOTORS | 159.25 | 154.65 |
| TATA STEEL | 501 | 494.1 |
| TCS | 2277.95 | 2259.9 |
| TECH MAHIND | 725.55 | 735.6 |
| TITAN COMPA | 1306.6 | 1275.1 |
| ULTRATECH C | 4576.05 | 4485 |
| UPL LIMITED | 870.25 | 950.3 |
| VEDANTA LIM | 172 | 168.5 |
| WIPRO LTD | 286.95 | 294.05 |
| YES BANK LI | 114.55 | 103.2 |
| ZEE ENTERTA | 351.7 | 353 |

### నిఫ్టీ నెక్ట్స్ ఫిఫ్టీ

| | | |
|---|---|---|
| ABB INDIA L | 1566.95 | 1554.45 |
| ACC LIMITED | 1539.75 | 1493.6 |
| AMBUJA CEME | 213.7 | 206.45 |
| ASHOK LEYLA | 87.8 | 82.9 |
| BAJAJ HOLDI | 3606.85 | 3579.2 |
| BANDHAN BAN | 535.85 | 543.55 |
| BANK OF BAR | 118.5 | 115.8 |
| BHEL | 70.8 | 67.65 |
| BIOCON LIMI | 253.2 | 250.95 |
| BOSCH LIMIT | 16591.7 | 16259.5 |
| CADILA HEAL | 242.55 | 237.9 |
| COLGATE PAL | 1139.75 | 1145.8 |
| CONTAINER C | 545.6 | 531.1 |
| DABUR INDIA | 387.8 | 381.95 |
| DLF LIMITED | 181.35 | 176.4 |
| AVENUE SUPE | 1336.15 | 1335.7 |
| GENERAL INS | 207.1 | 206.8 |
| GODREJ CONS | 667.65 | 663.7 |
| HAVELLS IND | 785.75 | 784 |
| HDFC AMC LI | 1821.2 | 1802.85 |
| HDFC LIFE I | 440.45 | 437.15 |
| HINDUSTAN P | 292.65 | 295.75 |
| HINDUSTAN Zinc | 233.85 | 231.9 |
| ICICI LOMBA | 1163 | 1151.75 |
| ICICI PRU L | 374.4 | 365.4 |
| VODAFONE ID | 11.9 | 11.4 |
| INTERGLOBE | 1582.25 | 1609.15 |
| L&T FINANCE | 113.5 | 109.65 |
| LUPIN LIMIT | 713.95 | 703.8 |
| MARICO LIMI | 367 | 364.05 |
| UNITED SPIR | 541.6 | 520.2 |
| MOTHERSON S | 127.85 | 125.3 |
| MRF LTD | 54921.7 | 54495.8 |
| NHPC LTD | 24.8 | 24.55 |
| THE NEW IND | 151.55 | 152.6 |
| NMDC LTD. | 108.45 | 108.15 |
| ORACLE FIN | 3243.9 | 3206.35 |
| PAGE INDUST | 20607.6 | 20370.45 |
| PIRAMAL ENT | 1880.4 | 1741.9 |
| PETRONET LN | 236.8 | 235.4 |
| P&G HYGIENE | 10787.6 | 10684.55 |
| PIDILITE IN | 1251.65 | 1245.4 |
| STEEL AUTHO | 49.6 | 47.75 |
| SBI LIFE IN | 698.45 | 696.3 |
| SHREE CEMEN | 21199.55 | 20438.55 |
| SIEMENS LTD | 1272.25 | 1269.3 |
| SHRIRAM TRA | 1094.6 | 1062.75 |
| UNITED BREW | 1347.5 | 1348.85 |

## ఆర్థిక వ్యవస్థలో మందగమన జాడలు...

# ఆర్థిక క్రియాశూన్యత సుస్పష్టం

**ఎంపీసీ భేటీలో ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్య**



**ముంబై:** ఆర్థిక వ్యవస్థలో క్రియాశూన్యత సుస్పష్టంగా కనిపిస్తోందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) గవర్నర్ శక్తికాంత్‌దాస్ పేర్కొన్నారు. జూన్ 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జరిగిన సమీక్ష సందర్భంగా ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 5.75 శాతం) పావుశాతం తగ్గించింది. రేటు తగ్గింపు వరుసగా ఆరు నెలల్లో మూడవసారి. ఈ కాలంలో రేటు 75 బేసిస్ పాయింట్లు తగ్గింది. కమిటీ సమావేశ మినిట్స్ గురువారం విడుదల అయ్యాయి. ఆర్థిక సంవత్సరం నాల్గవ త్రైమాసికంలో ఆర్థిక వృద్ధిరేటు 5.8 శాతానికి పడిపోయిన విషయాన్ని గవర్నర్ ప్రస్తావించారు. పరపతి విధాన కమిటీలోని ఆరుగురు సభ్యులూ ఏకగ్రీవంగా రేటు తగ్గింపునకు సానుకూల నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఆర్థిక వ్యవస్థలో క్రియాశీలత తగ్గిపోయింది. మందగమనం చోటు చేసుకుంటోంది. ఈ పరిణామాల నేపథ్యంలో... రెపో రేటు తగ్గింపునకు ఆర్‌బీఐ శ్రీకారం చుట్టింది. బ్యాంకులకు తగ్గించిన రేటు ప్రయోజనం... సాధారణ వినియోగదారు నుంచి పరిశ్రమల వరకూ అందినప్పుడు అది వ్యవస్థలో రుణ రేటు తగ్గుదలకు తోడ్పడుతుంది. రుణాలపై వడ్డీ తక్కువ కనక రుణాలు ఎక్కువ తీసుకుంటారు. ఇది వృద్ధి మెరుగుదలకు దోహదపడుతుందనేది క్లుప్తంగా ఆర్థిక విశ్లేషణ.

## ఫిచ్ బాటలోనే డీబీఎస్

- 2019–20లో భారత్ వృద్ధి అంచనా కోత



**సింగపూర్:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాలను ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రముఖ బ్యాంకింగ్ సేవల సంస్థ– డీబీఎస్ కుదించింది. 2019– 2020లో కేవలం 6.8 శాతమే నమోదవుతుందని అంచనా వేసింది. ఇప్పటి వరకూ ఈ అంచనాలను డీబీఎస్ 7 శాతంగా పేర్కొంది. ఇటీవలే అంతర్జాతీయ రేటింగ్ సంస్థ– ఫిచ్ 2019– 20 వృద్ధి రేటును వరుసగా రెండవసారి 6.8 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. గడచిన మార్చిలో ఈ రేటును 7 శాతం నుంచి 6.8 శాతానికి తగ్గించింది. అంచనా కుదింపు బాటన ఇప్పుడు డీబీఎస్ నడవడం గమనార్హం.నివేదికలో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే... ఎగుమతులు బలహీనంగా ఉండడం భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపిస్తోంది. వృద్ధి మందగమనం ఆర్‌బీఐ పాలసీ రేటు తగ్గింపునకు దారితీస్తోంది.

## తగ్గిన రుణ, డిపాజిట్ వృద్ధి స్పీడ్!



**ముంబై:** బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాలు, డిపాజిట్ల పరిస్థితిని పరిశీలిస్తే ఆర్థిక వ్యవస్థలో మందగమన జాడలు సుస్పష్టంగా కనిపిస్తున్నాయి. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాలను పరిశీలిస్తే...

- బ్యాంకింగ్ రుణాలు వార్షిక ప్రాతిపదికన చూస్తే, (జూన్ 7వ తేదీతో ముగిసిన పక్షం వరకూ) 9.92 శాతమే పెరిగి రూ.96.52 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక డిపాజిట్లలో వృద్ధిరేటు కూడా కేవలం 12.31 శాతం పెరిగి రూ.125.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.
- గత ఏడాది ఇదే కాలానికి రుణాల్లో వృద్ధిరేటు 12.70% (రూ.85.94 లక్షల కోట్లు)గా నమోదయితే, డిపాజిట్లలో వృద్ధి రేటు 10.7% వృద్ధిరేటు (114.08 లక్షల కోట్లు).
- ఈ ఏడాది మే 24తో ముగిసిన పక్షం వరకూ, రుణాల్లో వృద్ధి రేటు 12.70 శాతం (రూ.96.22 లక్షల కోట్లు)గా నమోదయ్యితే, డిపాజిట్లలో వృద్ధి రేటు 10.09 శాతం (రూ.124.98 లక్షల కోట్లు)గా ఉంది.
- 2018 ఏప్రిల్‌లో నాన్ ఫుడ్ క్రెడిట్ 10.7 శాతం ఉంటే, 2019 ఇదే నెల్లో ఈ రేటు 11.9 శాతంగా నమోదయ్యింది. ఇదే కాలంలో వ్యవసాయం, సంబంధిత అనుబంధ విభాగాల రుణాలు 5.9 శాతం నుంచి 7.9 శాతానికి పెరిగాయి. ఇక సేవల రంగానికి రుణాల వృద్ధి రేటు 20.7 శాతం నుంచి 16.8 శాతానికి తగ్గింది. వ్యక్తిగత రుణాల విషయంలోనూ రేటు 19.1 శాతం నుంచి 15.7 శాతానికి తగ్గింది. పరిశ్రమలకు రుణ వృద్ధి రేటు మాత్రం 1 శాతం నుచి 6.9 శాతానికి పెరిగింది.

## ఇసుజు వి- క్రాస్ ఇప్పుడు కొత్త రూపంలో



**చెన్నై:** నూతన రూపం, మరిన్ని ఆధునిక ఫీచర్లతో ఇసుజు డిమ్యాక్స్ వి–క్రాస్ వాహనం మార్కెట్లోకి విడుదలైంది. వి–క్రాస్ మోడళ్ల ధరలన్నీ ఇంతకుముందు మాదిరే రూ.15.51 లక్షలు (స్టాండర్డ్ రకం), రూ.17.03 లక్షలుగా (జెడ్ రకం, ముంబై ఎక్స్‌షోరూమ్) ఉంటాయి. 20 కొత్త ఆధునిక ఫీచర్లను వీటిల్లో ప్రవేశపెట్టినట్టు కంపెనీ ప్రకటించింది. సఫైర్ బ్లూ, సిల్కీ పెర్ల్ వైట్‌తోపాటు రూబీ రెడ్, టైటానియం సిల్వర్, గ్రే, కాస్మిక్ బ్లాక్, స్ప్లాష్ వైట్ రంగుల్లో లభిస్తాయి.

# టాటా మోటార్స్ సీఎఫ్‌ఆర్ రేటింగ్ తగ్గింపు

- జేఎల్‌ఆర్ బలహీన పనితీరే కారణం
- మూడీస్ వెల్లడి



**న్యూఢిల్లీ:** టాటా మోటార్స్ కార్పొరేట్ ఫ్యామిలీ రేటింగ్(సీఎఫ్‌ఆర్)ను అంతర్జాతీయ రేటింగ్ సంస్థ, మూడీస్ తగ్గించింది. అంతే కాకుండా సీనియర్ అన్‌సెక్యూర్డ్ ఇన్‌స్ట్రుమెంట్స్ రేటింగ్‌ను కూడా తగ్గించింది. టాటా మోటార్స్‌కు చెందిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ పనితీరు బలహీనంగా ఉండటంతో కంపెనీ రుణ స్థితిగతులు దిగజారడం కొనసాగుతోందని, అందుకే రేటింగ్‌ను తగ్గించామని మూడీస్ పేర్కొంది. టాటా మోటార్స్ అవుట్‌లుక్‌ను ప్రతికూలం స్థాయిలోనే కొనసాగిస్తున్నామని తెలిపింది. కంపెనీ ఫ్రీ క్యాష్ ఫ్లోస్ సానుకూల స్థితికి రావడానికి అంచనాల కంటే ఎక్కువ కాలమే పడుతుందని పేర్కొంది. చైనా మార్కెట్లో ఎదురవుతున్న సమస్యలు, యూరప్‌లో డీజిల్ కార్ల అమ్మకాలు తగ్గుతుండటం, ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి పెరుగుతుండటం, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల కోసం చెప్పుకోదగిన స్థాయిలో పెట్టుబడులు పెడుతుండటం...ఈ అంశాలన్నీ జేఎల్‌ఆర్ ఫ్రీ క్యాష్ ఫ్లోస్‌పై తీవ్రమైన ఒత్తిడినే పెంచుతున్నాయని మూడీస్ వివరించింది.

టాటా మోటార్స్ సీఎఫ్‌ఆర్ రేటింగ్‌ను, సీనియర్ అన్‌సెక్యూర్డ్ ఇన్‌స్ట్రుమెంట్స్ రేటింగ్‌ను బీఏ3 నుంచి బీఏ2కు తగ్గించామని మూడీస్ తెలిపింది. ఈ రెండు రేటింగ్‌లు స్పెక్యులేటివ్ అంశాలను, చెప్పుకోదగ్గ క్రెడిట్ రిస్క్‌ను సూచిస్తాయి.

### గురువారం స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్‌ఈ | 2,442 |
| ఎన్‌ఎస్‌ఈ | 33,127 |
| ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్) | 26,32,425 |
| ఎఫ్‌ఐఐ | -438 |
| డీఐఐ | 1,241 |

## మైండ్ ట్రీ బోర్డ్‌లో ముగ్గురు ఎల్ అండ్ టీ డైరెక్టర్లు

Mindtree Welcome to possible

**న్యూఢిల్లీ:** మైండ్ ట్రీ డైరెక్టర్ల బోర్డ్‌లో ఎల్ అండ్ టీ కంపెనీకి మూడు డైరెక్టర్ల పదవులు దక్కనున్నాయి. 66 శాతం వాటా కొనుగోలు ద్వారా మైండ్ ట్రీని ఎల్ అండ్‌టీ టేకోవర్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇక మైండ్ ట్రీ వ్యవస్థాపకుల్లో ఒకరైన సుబ్రతో బాగ్చి వచ్చే నెలలో రిటైరవుతున్నారు. మరోవైపు ఎల్ అండ్ టీ సీఈఓ , ఎమ్‌డీ, ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మైండ్ ట్రీ కంపెనీ బోర్డ్‌లో నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా చేరనున్నారు. మైండ్‌ట్రీ వార్షిక సాధారణ సమావేశం(ఏజీఎమ్) జరిగే జూలై 16న ఆయన డైరెక్టర్‌గా చేరతారు. ఆయనతో పాటు ఎల్ అండ్ టీకి చెందిన జయంత్ దామోదర్ పాటిల్, రామమూర్తి శంకర్ రామన్‌లు కూడా నాన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేరతారు. ఈ చేరికలకు మైండ్ ట్రీ ఏజీఎమ్‌లో వాటాదారులు ఆమోదం తెలపాల్సిఉంది.

# ఈబీ5 పెట్టుబడులతో అమెరికాలో ప్రయోజనాలు

- అక్టోబర్ నుంచి పెరగనున్న పెట్టుబడుల పరిమితి
- ఎంసీఎఫ్ఐ ఇండియా డైరెక్టర్ వివేక్ రావు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** అమెరికాలో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అక్కడ స్థానికత్వ ప్రయోజనాలు పొందడానికి ఉపయోగపడే ప్రస్తుత ఈబీ5 విధానం గడువు త్వరలో ముగిసిపోనుందని మేరీల్యాండ్ సెంటర్ ఫర్ ఫారిన్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎంసీఎఫ్ఐ) ఇండియా డైరెక్టర్ వివేక్ రావు తెలిపారు. ప్రస్తుత విధానం కింద 5 లక్షల డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ సరిపోతుందని కొత్తగా అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చే విధానం ప్రకారం ఇది 13.5 లక్షల డాలర్లకు పెరిగే అవకాశం ఉందని ఆయన చెప్పారు. పెట్టుబడి మొత్తం ఈ స్థాయిలో పెరిగితే భారత్ నుంచి వచ్చే దరఖాస్తుదారుల సంఖ్య దాదాపు 80–90 శాతం తగ్గిపోవచ్చని రావు అంచనా వేశారు. అక్టోబర్‌లోగా దరఖాస్తు చేసుకున్నవారికి పాత పరిమితులే వర్తిస్తాయని, భారతీయ ఇన్వెస్టర్లు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. ఈ విధానం కింద సమీకరించే పెట్టుబడులను ఉపాధి కల్పనకు ఊతమిచ్చే రియల్ ఎస్టేట్, నిర్మాణ తదితర రంగాల్లో ఇన్వెస్ట్ చేయడం జరుగుతుంది. అమెరికాలో ఎక్కడైనా పనిచేసేలా ఇన్వెస్టరుకు గ్రీన్‌కార్డు లభిస్తుంది. ఇన్వెస్టరుతో పాటు వారి కుటుంబానికి కూడా స్థానికత ప్రయోజనాలు అందించే వెసులుబాటు ఈ విధానంలో ఉందని రావు చెప్పారు. అలాగే, నిర్దిష్ట సమయం తర్వాత పెట్టుబడిని కూడా తిరిగి పొందవచ్చు.

అమెరికాలో గ్రీన్‌కార్డ్ పొందే అవకాశం లేనివారు ఇలా ఆ దేశంలో పెట్టుబడులు పెట్టడం ద్వారా గ్రీన్‌కార్డ్‌ను పొందేందుకు అగ్రరాజ్యం వెసులుబాటు కల్పిస్తోంది. ప్రస్తుతం సమీకరించే నిధులను మేరీల్యాండ్ రాష్ట్రం వెస్ట్‌ఫేలియా టౌన్ సెంటర్ నిర్మాణానికి ఉపయోగిస్తోందని, దీని విలువ సుమారు 226 మిలియన్ డాలర్లుగా ఉండగా.. 2021లో పూర్తయ్యే నాటికి 624 మిలియన్ డాలర్లకు చేరగలదని అంచనాలు ఉన్నట్లు రావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇన్వెస్టర్లు భారీ రాబడులు కూడా అందుకోవచ్చన్నారు.

## ఆ లక్ష్యానికి మరో రెండేళ్లు ఆలస్యం: హెరిటేజ్

**హైదరాబాద్:** డెయిరీ కంపెనీ హెరిటేజ్ నిర్దేశించుకున్న లక్ష్యానికి చేరుకోవడానికి మరో రెండేళ్లు ఆలస్యం కానుంది. 2022 నాటికి రూ.6,000 కోట్ల టర్నోవర్ స్థాయికి చేరుకుంటామని గతంలో కంపెనీ వెల్లడించింది. కానీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇది 2024 అవుతుందని తెలిపింది. 'సరఫరా అధికం కావడంతో పాల సేకరణ ధర తగ్గింది. దీంతో కొన్ని మార్కెట్లలో పాలు, పాల ఉత్పత్తుల ధర తగ్గించాల్సి వచ్చింది. ఈ కారణంగా వృద్ధి మందగించింది. ప్రస్తుతం పరిస్థితి మారింది. పాల పొడి నిల్వలు దాదాపుగా ఎగుమతి చేశాం' అని కంపెనీ ఎండీ ఎం.సాంబశివ రావు తెలిపారు. 2018–19లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ టర్నోవర్ 6 శాతం వృద్ధితో రూ.2,515 కోట్లు నమోదు చేసింది.

## విక్రేతలకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకులతో ఫ్లిప్‌కార్ట్ జట్టు



**ముంబై:** తమ ప్లాట్‌ఫాంపై ఉత్పత్తులు విక్రయించే సంస్థలకు సత్వరం మూలధన రుణాలు ఇప్పించే దిశగా ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తాజాగా బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ సంస్థలతో (ఎన్‌బీఎఫ్‌సీ) చేతులు కలిపింది. ఈ ఒప్పందం ప్రకారం 9.5 శాతం వడ్డీ రేటుతో రెండు రోజుల వ్యవధిలోనే రుణాలు మంజూరు కానున్నాయి. ఇందుకోసం గ్రోత్ క్యాపిటల్ పేరిట నిర్వహిస్తున్న సెల్లర్ ఫైనాన్సింగ్ పథకాన్ని ఫ్లిప్‌కార్ట్ పునర్‌వ్యవస్థీకరించింది. దీని కింద 1 లక్ష మంది విక్రేతలు 10 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల నుంచి రుణ సదుపాయం పొందవచ్చు. దరఖాస్తు ఆమోదానికి ఒక రోజు, మంజూరుకు మరో రెండు రోజుల సమయం ఉంటుందని ఫ్లిప్‌కార్ట్ తెలిపింది. ఎస్‌బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా, యాక్సిస్ బ్యాంక్, ఆదిత్య బిర్లా ఫైనాన్స్, టాటా క్యాపిటల్, ఫ్లెక్సిలోన్స్, చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు (సిడ్బి), లెండింగ్‌కార్ట్, ఇండిఫై, హ్యాపీ లోన్స్ సంస్థలతో ఫ్లిప్‌కార్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. సగటున రుణ పరిమాణం రూ. 7 లక్షలుగా ఉంటుందని.. అయితే, విక్రేతలు 9.5 శాతం వడ్డీ రేటుతో రూ. 3 కోట్ల దాకా రుణాలు తీసుకోవచ్చని ఫ్లిప్‌కార్ట్ వివరించింది.




Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Phase – 2, Plot No. 06, 100 Feet Road, Auto Nagar, Vijayawada, Krishna District – 520 007 (AP), and D. No. 5- 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503. Editor: V. Murali, Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23794.

# ప్రపంచ స్థాయి సాంకేతిక అబ్బురం... మన కాళేశ్వరం ప్రాజెక్టు



ప్రారంభకులు

**మాన్యశ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారు**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి

## బంగారు తెలంగాణ
## స్వప్న సాకారం మన కాళేశ్వరం

**37.08 లక్షల ఎకరాలకు నీరందించే**
**అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు**

3 బ్యారేజీలు, 20 రిజర్వాయర్లు, 20 పంపు హౌసులు,
వందల కిలోమీటర్ల కాలువల సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్టు

**ప్రారంభోత్సవ శుభాకాంక్షలు**

-: విశిష్ట అతిథి :-



**శ్రీ ఇ.ఎస్.ఎల్. నరసింహన్ గారు**
T.S. & A.P. గవర్నర్

-: ముఖ్య అతిథులు :-



**శ్రీ దేవేందర్ ఫడ్నవీస్ గారు**, మహారాష్ట్ర ముఖ్యమంత్రి



**శ్రీ వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి గారు**, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

- అత్యున్నత ప్రమాణాలకు ప్రతిష్ఠాపన, నాణ్యతపై నిబద్ధత, కార్యనిర్వహణలో కాలంతో పోటీ, టెక్నాలజీ సరిహద్దులను దాటేందుకు నిరంతర కృషి... ఇవే **మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (MEIL)** విజయానికి బాటలు వేశాయి.
- దేశంలో అత్యంత వైవిధ్యమైన వివిధీకరణ చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ కంపెనీల్లో ఒకటిగా **MEIL** ఎదిగింది.
- రికార్డు సమయంలో ఇరిగేషన్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా అద్భుతాలను సృష్టిస్తున్న **MEIL** ఇప్పుడు ఇరిగేషన్, వాటర్ మేనేజ్‌మెంట్, రోడ్లు, భవనాల నిర్మాణం, విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ ఇంధనాలు, హైడ్రోకార్బన్స్, గ్యాస్ పంపిణీ, పౌరవిమానయాన రంగాల్లో తనదైన స్థానాన్ని ఏర్పరచుకుంది. ఇటీవలే రక్షణ రంగ పరికరాల తయారీ, ఎలక్ట్రిక్ బస్సుల తయారీ, నిర్వహణ రంగాల్లోకి ప్రవేశించింది.
- దేశంలోని 16 రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, టాంజానియా, జాంబియా, కువైట్, జోర్డాన్ దేశాల్లో వివిధ ప్రాజెక్టులను దిగ్విజయంగా పూర్తి చేయడం ద్వారా **MEIL** తన 30 ఏళ్ల ప్రస్థానంలో దేశీయ బహుళజాతి కంపెనీగా ఎదిగింది.
- ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు స్థాపనలో పాలుపంచుకోవడం గర్వంగా భావిస్తోంది **MEIL**. ప్రపంచంలోనే అతిపెద్ద భూగర్భ పంప్‌హౌస్ నిర్మించడం, 139 మెగావాట్ల బాహుబలి మోటార్ల ఏర్పాటు, అతిపెద్ద సర్జ్‌పూల్స్ నిర్మాణం, విస్తృత స్థాయిలో విద్యుత్ సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును తీర్చిదిద్ది గొప్ప సృజనాత్మకత పథకానికి ఆకృతినిచ్చి **MEIL** సరికొత్త మైలురాళ్ళను చేరుకుంది.



**meil**

**MEGHA ENGINEERING & INFRASTRUCTURES LTD**

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం
21-6-2019



హలో హాలీవుడ్
సినిమా పేజిలో...



వెస్ట్‌తో జత పట్టు
లోపలి పేజిలో...

## మంచి విషయం

### కలిసి భోంచేశారు



● కెండెల్, దీపిక

ఇరవై మూడేళ్ల అమెరికన్ మోడల్, టెలివిజన్ స్టార్ కెండెల్ జెన్నెర్, ఆమెకన్నా పదేళ్లు పెద్దదైన మన దీపికా పడుకోన్ ఇద్దరూ కలిసి మంగళవారం న్యూయార్క్‌లోని ప్రెస్బిటేరియన్ హాస్పిటల్‌లో లంచ్ చేశారు. హాస్పిటల్‌లో లంచ్ ఏమిటి?! హాస్పిటల్‌లో లంచ్ కాదు. హాస్పిటల్ వాళ్లు ఏర్పాటు చేసిన లంచ్ అది. న్యూయార్క్‌లోనే ఉన్న 'యూత్ యాంగ్జైయిటీ సెంటర్' కోసం నిధులను సమీకరించే ఒక కార్యక్రమ ప్రారంభోత్సవం అనంతర దీపిక, కెండెల్‌తో మరికొందరు ప్రముఖులు కలిసి విందును ఆరగించారు. అంతకన్నా ముందు దీపిక తన ప్రసంగంలో తనెలా డిప్రెషన్ నుంచి బయటపడిందీ అక్కడివారితో షేర్ చేసుకున్నారు. యువతలో కనిపించే ఆదుర్దా, ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు వంటి మానసిక సమస్యలకు యూత్ యాంగ్జైయిటీ సెంటర్ చికిత్సను అందించడంతో పాటు సంబంధిత వైద్యపరిశోధనలు, అధ్యయనాలు జరుపుతుంటుంది. దీపిక అంటే ఒకే, మరి కెండెల్ అక్కడికి ఎందుకు వచ్చినట్లు? అమెరికన్‌ల యూత్ ఐకన్ ఇప్పుడు ఆవిడ.

### డిజైన్ థింకింగ్



'డిజైన్ థింకింగ్' అనే కొత్త కోర్సు ఒకటి యువ ప్రపంచానికి అందుబాటులోకి వచ్చింది! కాలిఫోర్నియాలోని ప్రతిష్టాత్మక స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న 'స్టాన్‌ఫోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్' సంస్థ.. అక్కడిదే అయిన 'గేట్ లెర్నింగ్' అనే జీవన నైపుణ్యాల శిక్షణ సంస్థతో కలిసి పది వారాల వ్యవధి గల 'డిజైన్ థింగింక్' కోర్సును ప్రవేశపెట్టాయి. ఆంట్రప్రెన్యూర్‌లు, ఎగ్జిక్యూటివ్‌లలో వినూత్నమైన ఆలోచనలు కలిగించే ఉద్దేశించి ఈ కోర్సు ప్రారంభమయింది. అసలి లాంటి ఆలోచన ఒకటి రావడానికి కారణంగా క్రెడిట్ ఇవ్వాల్సింది మాత్రం ఆపిల్స్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్ సంస్థలకే. అక్కడ పనిచేసే వృత్తి నిపుణులు ఇప్పటికే డిసైన్ థింకింగ్‌పై స్టాఫ్‌కి క్లాసులు పెట్టి సేవల్ని, ఉత్పత్తులను సంతృప్తిగా డెలివరీ చేయడం ఎలా అనే విషయమై కొత్త కొత్త థాట్స్ కలిగిస్తున్నారు. స్టాన్‌ఫోర్డ్‌లో డిజైనింగ్ థింకింగ్ కోర్సు పూర్తయ్యాక స్టాన్‌పోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ సంస్థ సర్టిఫికెట్‌ను ప్రదానం చేస్తుంది.

## చెట్టు నీడ

# నాన్న ముద్దులు

ఒకరోజు ప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులతో కలిసి కూర్చుని ఉన్నారు. అంతలో ఒక వ్యక్తి పరుగు పరుగున వచ్చి ''అయ్యా! నా కుమారుడు కనిపించడం లేదు, దయచేసి కాస్త దువా(ప్రార్థన) చేయరా'' అని ప్రాధేయపడ్డాడు.

ప్రవక్త (స) దువా చేయడానికి చేతులు ఎత్తారో లేదో, అప్పుడే అక్కడికి వచ్చిన ఒక వ్యక్తి ''అరే! మీ వాడు ప్రక్కనే ఉన్న తోటలో ఆడుకుంటూ ఉండగా చూసాను'' అని అన్నాడు. ఆ వ్యక్తి పరుగు పరుగున తన కుమారుని వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు. ప్రవక్త (స) ఆ వ్యక్తిని వెనక్కి పిలిచి ''ఇప్పుడు నీవు వెళ్లి నీ కొడుకు కనిపించగానే ఏం చేస్తావు?'' అని అడిగారు. ''ఉదయం నుంచి కనిపించని కుమారుడిని గుండెలకు హత్తుకుని వాడి బుగ్గ మీద ముద్దులు వర్షం కురిపిస్తాను'' అని అన్నాడు ఆ వ్యక్తి. ''నువ్వు మాత్రం అక్కడ అలా చేయకు. ఇంటికి తీసుకుని వెళ్లి అక్కడ నీ ప్రేమంతా చూపించు'' అని అన్నారు ప్రవక్త (స).

'ఇదేమిటి ఉదయం నుంచి కనిపించని కుమారుడు కనిపిస్తే తండ్రి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోయి తన పిల్లవాడిని ముద్దులతో ముంచెత్తడం సర్వ సామాన్యం కదా. ఈయన ఏమిటి ఇలా చెబుతున్నాడు' అని అక్కడ ఉన్న సహచరులంతా ఆశ్చర్యపోయారు. ''అదేమిటి ప్రవక్త (స) గారు, ఎంతటి కఠినాత్ముడైన తండ్రి అయిన సరే తప్పిపోయిన తన చిన్నారి కుమా



రుడు కనిపిస్తే అక్కడికక్కడే తన ప్రేమను వ్యక్తం చేస్తాడు. కారుణ్యమూర్తి అయిన మీరేమో ఇంటికి వెళ్లాక ప్రేమను వ్యక్తం చేయాలంటున్నారు?'' అని ఆశ్చర్యంగా అడిగాడు.

అప్పుడు ప్రవక్త (స) ''అక్కడ నీ పిల్లవాడు ఒంటరిగా లేడు. ఇతర పిల్లలతో కలిసి ఆడుకుంటున్నాడు. అందులో ఎవరైనా తండ్రి లేని అనాథ పిల్లలు ఉండి ఉంటే నువ్వు కురిపించే ప్రేమను చూసి, 'అయ్యో మాకు కూడా ఇలాగే తండ్రి ఉండి ఉంటే మా మీద కూడా ఇలాగే ప్రేమను కురిపించేవాడే' అని ఆ పసి హృదయాలు బాధపడితే రేపు పరలోకంలో సమాధానం చెప్పుకోవాలి. అందుకే వద్దన్నా'' అని అన్నారు.

మూడునాళ్ల ముచ్చట ఈ జీవితం అని తెలిసి కూడా అల్లాహ్ మనకు ఇచ్చిన దాన్ని నలుగురు చూడాలని డాబుసరి ప్రదర్శించే వారు ప్రవక్త (స) గారి ఈ హితబోధ ఒక సారి జ్ఞాపకం చేసుకోవాలి.

**– షేక్ అబ్దుల్ బాసిత్**



అమర జవాన్ పద్మపాణి ఆచార్య కూతురు అపరాజిత

నాన్నా నువ్వంటే ఇష్టం.
నీ కబుర్లు ఎన్నో వింటున్నాను.
ప్రతిసారీ నువ్వు కొత్తగా అర్థమవుతున్నావు.
స్కూలు మ్యాగజైన్‌లో నా తొలి వ్యాసం 'మై డాడీ... మై హీరో'.
ఆ ఇష్టం రోజు రోజుకీ పెరిగిపోతోంది.
నేను తెలుసుకున్న నిన్ను అక్షరాల్లో చూపించాను.
ఆ పుస్తకం పేరు 'అవర్ బబ్లూ... ద హీరో ఆఫ్ ద్రాస్'.
నీ సాహసానికి ప్రతిరూపం అది.
నీ గురించిన జ్ఞాపకాల ప్రతిబింబం కూడా.
నాన్నా! నీకు బెంగవద్దు.
నువ్వు కోరుకున్నట్లే పెరుగుతాను.
ఇట్లు... నీ మౌగ్లీ.
ఇది అపరాజిత తన తండ్రికి రాసిన ఉత్తరంలోని సారాంశం.

**నాన్నను చూళ్లేదు.
నాన్న ఆత్మ తెలుసు.
అపరాజిత కడుపులో ఉండగానే..
నాన్న కార్గిల్‌లో అమరుడయ్యాడు.
కూతురి జ్ఞాపకాల్లో
జీవించే ఉన్నాడు.**

# నాన్నకు శ్రద్ధతో..

ఇండియా–పాకిస్థాన్. ఒకప్పుడది సమైక్య భారతం. ఇప్పుడవి ఇరుగు పొరుగు దేశాలు. ఇరుగు– పొరుగు అనే అందమైన మాట వెనుక అంతర్లీనంగా అప్పుడప్పుడు ఘర్షణ కూడా ధ్వనిస్తూ ఉంటుంది. ఇరు దేశాల సైనికులూ ఒకరి మీద మరొకరు పైచేయి సాధిస్తూ తమ తమ దేశాల పతాకాలకు సగర్వంగా సెల్యూట్ చేస్తుంటారు. అలాంటి సెల్యూట్‌లలో ఒకటి 1999లో చేశారు మన సైనికులు. ఆనాడు దేశమంతటా 'ఆపరేషన్ విజయ్' సంబరాలు చేసుకుంది. కశ్మీర్‌లోని కార్గిల్‌లో రెండునెలల మూడువారాల రెండు రోజుల పోరాటం.. ఆ ఏడాది మే 3వ తేదీ మొదలైంది, జూలై 26తో ముగిసింది. భారత సైనికులు విజయ పతాకం ఎగురవేశారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశమంతా సంతోషంలో మునిగిపోయింది. ఇక్కడ హైదరాబాద్, హస్తినాపురంలోని మేజర్ పద్మపాణి ఆచార్య కుటుంబంలో ప్రతి ఒక్కరి కళ్ల నుంచి ఆనంద భాష్పాలు రాలాయి. ఏడు నెలల గర్భిణి చారులత తన పొట్టను నిమురుతూ 'మీ నాన్న గెలిచాడు కన్నా' అని చెప్పింది. వింగ్ కమాండర్ జగన్నాథాచార్య తన కొడుకు ఫొటోను చూస్తూ 'నీ సేవలు వృథా కాలేదు పాణీ' అనుకున్నాడు. 'దేశవిజయం కోసం అమరుడైన వీరుడివి నువ్వు. నీకు ఓటమి లేదు. నీ బిడ్డకు పరాజయం ఉండదు. నువ్వు సంతోషపడేలా పెంచుతాను నీ బిడ్డను' అని కొడుకు ఫొటో చూస్తూ మౌనంగా తనలో తానే అనుకుంది తల్లి విమలాచార్య. సెప్టెంబర్ 14వ తేదీ పుట్టింది అపరాజిత. పద్మపాణి ఫొటోముందు నిలబడి 'అన్నయ్యా! నీ బిడ్డ తండ్రిలేనిది కాదు, నేనున్నాను' అని అన్నయ్య షర్ట్ వేసుకుని హాస్పిటల్‌కెళ్లింది మహా వీర చక్ర మేజర్ పద్మపాణి ఆచార్య చెల్లెలు ఆమ్రపాలి.



తల్లి చారులతతో అపరాజిత

### మా నాన్న హీరో

నేను చూసింది నాన్న ఫొటోను మాత్రమే. అయితే నాన్న గురించిన ప్రతి చిన్న సంఘటన కూడా తెలుసు. నాన్న నాతో ఉన్నారనే భావనలోనే పెరిగాను. నేను నాన్నతో మాట్లాడతాను కూడా. నా పోషణ, పెంపకం నాన్న పెన్షన్‌తోనే. మరి నాన్న లేడని ఎలా అనుకోగలను. కళ్ల ముందు కనిపించకపోయినంత మాత్రాన లేనట్లు కాదు. నా దృష్టిలో మా నాన్న గొప్ప హీరో.

**– అపరాజిత,**
అమరవీరుడు మేజర్ పద్మపాణి ఆచార్య కుమార్తె

* * *

కార్గిల్ యుద్ధసమయంలో మేజర్ పద్మపాణి ఆచార్య కశ్మీర్‌లో ఇన్‌ఫాంట్రీ ఆఫీసర్‌గా విధుల్లో ఉన్నారు. కార్గిల్‌లో యుద్ధవాతావరణం అలముకొని ఉందని మాత్రమే తెలుసు దేశానికి. యుద్ధం అనివార్యమయ్యే పరిస్థితిని అంచనా వేస్తున్నారు నిపుణులు. యుద్ధం జరుగుతోందని ఏ దేశమూ ప్రకటించలేదు. దాడులైతే జరుగుతూనే ఉన్నాయి. జూన్ 21వ తేదీన పద్మపాణి ఆచార్య ఇంటికి ఫోన్ చేశారు. తన పుట్టినరోజునాడు కుటుంబ సభ్యులతో శుభాకాంక్షలు చెప్పించుకోవడానికి చేసిన ఫోన్ కాల్ అది. యుద్ధక్షేత్రం నుంచి నెలకో, రెండు నెలలకో సాధ్యమైనప్పుడు ఒక్కఫోన్ రావాల్సిందే తప్ప, జవానుల కుటుంబసభ్యులు అక్కడికి ఫోన్ చేయడం కుదరదు. మొబైల్ ఫోన్‌లు లేని రోజులవి. శాటిలైట్ ఫోన్‌లో ఒకటి– రెండు నిమిషాలు మాట్లాడడమే ఎక్కువ. ఆ రోజు పద్మపాణికి ఇంట్లో అందరూ శుభాకాంక్షలు చెప్పారు. ఇంట్లోవాళ్లతో 'ప్రే ఫర్ ద యూనిట్' అని ఆయన ఆ రోజు చెప్పిన మాటను ఇప్పటికీ గుర్తు చేసుకుంటున్నారు వాళ్లు. పద్మపాణి మాటలతో వాళ్లకు యుద్ధం గురించి స్పష్టత వచ్చింది. 'అప్పుడు కూడా తనకోసం ప్రార్థించమని చెప్పలేదు, తన యూనిట్ కోసం ప్రార్థించమని కోరాడు' అని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఎనిమిదో రోజు వార్ ఫీల్డ్ నుంచే మరో ఫోన్. ఈసారి పద్మపాణి నుంచి కాదు, ఆర్మీ ఆఫీసర్ నుంచి. ఆ ఫోన్‌కాల్‌ని చారులత రిసీవ్ చేసుకున్నారు. 'పద్మపాణి భార్యను' అనగానే ఫోన్ కట్ అయింది. ఐదు నిమిషాల్లోనే మళ్లీ ఫోన్. ఈ సారి పద్మపాణి తల్లి విమల తీశారు. దేశమాత కోసం పద్మపాణి అమరుడయ్యాడని తెలిసింది.

### మా బిడ్డే



అపరాజిత పుట్టినప్పుడు తొలిసారి ఎత్తుకున్నది నేనే. తనకు అన్నప్రాశన, చెవులు కుట్టడం, అక్షరాభ్యాసం... అన్నీ నా ఒడిలోనే జరిగాయి. అపరాజితకు తండ్రిగా మా అన్నయ్య చేయాల్సిన కార్యక్రమాలన్నీ నేనే చేశాను. బాధలో ఉన్న మా వదిన చారులతకు ఇబ్బంది కలగకుండా అపరాజిత పనులు నేనే చేసేదాన్ని. నా పెళ్లయిన తర్వాత నా భర్త కూడా అపరాజితను సొంత బిడ్డలాగే చూస్తున్నారు. అపరాజిత, నాకు పుట్టిన పాపాయి ఇద్దరూ మాకు బిడ్డలే. ఈ పిల్లలిద్దరికీ నేను, చారులత ఇద్దరం తల్లులం. అపరాజిత పుట్టకముందే తండ్రిని కోల్పోయింది అనుకుంటారు. కానీ తనిప్పుడు ఇద్దరు తండ్రులు, ఇద్దరు తల్లుల ముద్దుల బిడ్డ.

**– ఆమ్రపాలి,** అపరాజిత మేనత్త

* * *

అపరాజిత ఇవేవీ చూడలేదు, కానీ తాను చూసినట్లే ప్రతి సంఘటననూ కళ్లకు కట్టినట్లు పుస్తకం రాసింది. ఆఖరుకి నానమ్మ తనను ఎత్తుకుని 'నీ బిడ్డకు ఓటమి ఉండదు' అంటూ అపరాజిత అని పేరు పెట్టడం కూడా. నానమ్మ చెప్పిన ప్రతి కథలోనూ హీరో తన తండ్రే. 'అచ్చం మీ నాన్నలాగే ఉన్నావు' అని మనుమరాలిని దగ్గరకు తీసుకుంటూ కొడుకు చిన్నప్పుడు చేసిన అల్లరి పనులన్నీ చెప్పేదామె. పద్మపాణి ప్రేమకథతోపాటు అతడి వీరోచిత సంఘటనలనూ చెప్పేది. ఆటో మీటరు అరవై రూపాయలు తిరిగితే 'పోనీలే ఖాళీగా తిరిగి వెళ్లాలి కదా' అని మరో వంద కలిపి నూట అరవై రూపాయలిచ్చిన సందర్భాల నుంచి.. దసరా ఉత్సవాల్లో ధోవతి, కుర్తా ధరించి పాదాభివందనం చేసిన వాళ్లను ఆశీర్వదించడం వరకు పద్మపాణి చేసిన ప్రాక్టికల్ జోక్స్‌తో సహా ప్రతిదీ పూసగుచ్చేది విమలాచార్య. వాటన్నింటినీ 'అవర్ బబ్లూ... హీరో ఆఫ్ ద్రాస్' పేరుతో అక్షరబద్ధం చేసింది అపరాజిత. ఈ పుస్తకాన్ని అమ్మ, చిన్నాన్న, మేనత్తలు, నానమ్మ, తాతయ్యల జ్ఞాపకాలతో రాసింది.

గత ఏడాది పద్మపాణి జయంతి రోజున ఆ పుస్తకాన్ని ఆవిష్కరించింది. ఈ ఏడాది తండ్రి జయంతికి మరో కొత్త ఆలోచనను తెర మీదకు తెచ్చింది అపరాజిత. 'ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్'కి విరాళమిచ్చే కార్యక్రమాన్ని చేపట్టింది. నానమ్మ 2011లో స్థాపించిన 'మేజర్ పద్మపాణి ఫౌండేషన్' తరఫున ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఫండ్ రైజింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా నేడు హైదరాబాద్‌లోని తాజ్‌బంజారాలో జరిగే డోనర్స్ డిన్నర్‌కి దాదాపుగా 150 మంది దాతలు హాజరు అవుతున్నారు. పద్మపాణి కోర్స్‌మేట్‌లు, యూనిట్‌లో సహ అధికారులు వస్తున్నట్లు చెప్పింది అపరాజిత. తన తండ్రి స్మారకార్థం చేస్తున్న ఈ కార్యక్రమంలో వాళ్లు తమ జ్ఞాపకాలను పంచుకుంటారని, తనకు తండ్రి గురించి మరికొన్ని సంగతులు తెలుస్తాయని సంబరపడుతోంది. ''ఉత్తరాల్లో నాన్నను చూశాను, అక్షరాల్లో నాన్నేమిటో తెలుసుకున్నాను. నాన్న మా మధ్య ఉన్నారు. మాతో ఉన్నారు. ప్రపంచానికి నాన్న గురించి చెప్పడానికి ఇంకా ఎన్నో చేస్తాను'' అంది అపరాజిత.

**– వాకా మంజులారెడ్డి**
ఫొటోలు: జి. అమర్

## నేడు యోగ డే

# హార్టాసన

మనిషన్నాక ఏదో ఒక రోగం, మందన్నాక ఏదో ఒక రూపం ఉండాలి. ముక్కుదిబ్బడ పెద్ద రోగం కాదనకుంటాం. కానీ ముప్పుతిప్పలు పెడుతుంది. కోల్డ్ యాక్ట్ వేస్తాం. విక్స్ వేపోరబ్ రాస్తాం. నివారణ్ తాగుతాం. ఇన్‌హేలర్ పీలుస్తాం. ఇన్నున్నాయి మందులు. ముక్కుదిబ్బడ చిన్న రోగం అనుకుంటే, గుండెదడ పెద్ద రోగం. దిబ్బడకు, దడకు మధ్యలో బాడీలో ఎన్ని పార్టులైతే ఉన్నాయో అన్ని పార్టులకూ ఏదో ఒకటి రాకుండా పోదు, తిన్నగా ఉండం కనుక! తిన్నగా ఉన్నా కూడా వారసత్వంగా ఉన్నవాటిని, వస్తున్నవాటిని తప్పించుకోలేం. వీటన్నిటికీ ట్రీట్‌మెంట్ ఉంది. ట్రీట్‌మెంట్‌తో ప్రతిదీ నయం అవుతుంది. అసలు మాత్రను మింగగానే, గుళికను నోట్లో వేసుకోగానే, మూత నిండా సిరప్ తాగగానే, ఇంజెక్షన్ పొడిపించుకోగానే, సెలైన్ పెట్టించుకోగానే, వేర్లు, చూర్ణాలు, లేపనాలు ఒంటిని తాకగానే.. ఒంట్లో నయం అయిన ఫీలింగేదో తక్షణం కలుగుతుంది. మందును కళ్లతో చూడ్డం వల్ల కలిగే ఫలితం కావచ్చు ఆ ఫీలింగ్. మనకు అనేక వైద్య విధానాలున్నాయి. అలోపతి, నేచురోపతి, హోమియోపతి, యునాని, సిద్ధ, యోగా.. ప్రతి విధానంలోనూ ఔషధానికి ఒక రూపం ఉంది. వీటిల్లో ఒక్క యోగాకే రూపం లేదు! మరి రూపం లేనిది మందెలా అవుతుంది? మందు కానప్పటికీ కోట్లాది మందికి అనేక అనారోగ్యాల నుంచి విముక్తిని ఎలా కల్పించగలుగుతోంది!

యోగాకు రూపం లేదనే మాట తప్పు. రూపం ఉంది. ఆ రూపం పేరే 'ఆసనం'. మిగతా విధానాలన్నీ మెడిసిన్‌ని బయటి నుంచి బాడీకి అందిస్తాయి. యోగాసనం మాత్రం బాడీ తనకై తనే మెడిసిన్‌లని తయారు చేసుకునేలా చేస్తుంది! అద్భుతం కదా!! ఇంకో అద్భుతం కూడా ఉంది చూడండి. ఫిజికల్‌గా, మెంటల్‌గా, స్పిరుచ్యువల్‌గా.. మూడు రకాలుగా యోగా మన దేహానికి స్వస్థతను చేకూరుస్తుంది. అంటే ఒకే ఆసనానికి మూడు యాక్షన్‌లు ఉంటాయని కాదు. భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా చికిత్స దేనికి అవసరం అయితే దానికి ప్రత్యేకంగా ఒక ఆసనం ఉంటుంది. అలాగే ఒక్కో ఆనారోగ్యానికి ఒక్కో ఆసనం చికిత్సగా పనిచేస్తుంది. ఈ రోజు (జూన్ 21) ఇంటర్నేషనల్ యోగా డే. ఐక్యరాజ్య సమితి ఒక రోజు ముందే నిన్న యోగా డేని సెలబ్రేట్ చేసుకుంది. ఇవాళ 'యోగా విత్ గురూస్' అనే అంశంపై న్యూయార్క్‌లో సదస్సు నిర్వహిస్తోంది. ఈ ఏడాది యోగా డేకి ఐరాస థీమ్ : క్లైమేట్ యాక్షన్.

మనం ఆ థీమ్‌ని ఫాలో అవుతూనే, వేరుగా 'యోగా ఫర్ హార్ట్' అనే ఇంకో థీమ్‌తో యోగా డేని జరుపుకుంటున్నాం. కేంద్రంలో మనకు 'ఆయుశ్' అనే మంత్రిత్వ శాఖ ఉంది. ఆయుర్వేదం, యోగా అండ్ నేచురోపతి, యునాని, సిద్ధ, హోమియోపతి.. వీటన్నిటినీ కలిపి 'ఆయుశ్' అని పేరు పెట్టారు. ఆ శాఖ మంత్రి శ్రీపాద్ శయో నాయక్. ఆయనే మనం ఈ ఏడాది యోగా డేని 'యోగా ఫర్ హార్ట్'గా జరుపుకుంటున్నట్లు ప్రకటించారు. ''ఇంటింటికీ యోగా సందేశాన్ని తీసుకెళ్లడం మా ఉద్దేశం''అని ఆ ప్రకట విడుదల చేస్తున్నప్పుడు ఆయన అన్నారు. ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ రాంచీలోని ప్రభాత్ తారా మైదాన్'కు వస్తున్నారు. అక్కడ ఆయన సంకేతమాత్రంగా గుండెకు ఆరోగ్యాన్ని ఇచ్చే యోగాసనాన్ని వేస్తారు. ఇక ఈ ఏడాదంతా.. యోగాసనాలు గుండె చుట్టూ తిరుగుతుంటాయి. అలా ప్రోగ్రాములను ప్లాన్ చేస్తారు. ఈ సందర్భంగా మనమూ, కొన్ని హార్ట్ ఆసనాల గురించి తెలుసుకోవడం సందర్భోచితంగానే కాదు, ఇన్‌స్పైరింగ్‌గా కూడా ఉంటుంది.



# యువర్స్ హార్ట్‌ఫుల్లీ...

గుండె ఆరోగ్యం, హృద్రోగ సమస్యల పరిష్కారానికి ప్రాణాయామం, యోగాసనాలు, ధ్యానసాధన అత్యుత్తమ మార్గం. అయితే గుండె శక్తిమంతంగా మారాలనా లేక గుండె సంబంధవ్యాధుల నుంచి ఉపశమనం పొందడానికి చేస్తున్నామా? అనేది బేరీజు వేసుకుని తదనుగుణంగా యోగాసనాలను ఎంచుకోవాలి. నిలబడి చేసే ఆసనాలతో వెన్నెముక సాగి, రిలాక్స్ అవుతుంది నడుం పైభాగాన ఉండే సోవాస్ మజిల్స్ రిలాక్స్ కావడం వల్ల గుండెకు ఒత్తిడి తగ్గుతుంది. నిలబడి చేసే వాటిలో వృక్షాసనం, ఉత్కటాసనం, త్రికోణాసనం,, వీరభద్రాసనం... వంటివి కూర్చుని చేసే వాటిలో శశాంకాసన, ప్రసారిత మార్జాలాసన, అధోముఖ శ్వానాసనం, చతురంగ దండాసనం, భుజంగాసనం, పర్వతాసనం, పాదహస్తాసనం... వంటి వాటి వల్ల దిగువ అబ్డామిన్ ఆబ్లిక్ మజిల్ చురుకుగా మారి, తద్వారా గుండె కండరాలు శక్తివంతం అవుతాయి. తేలికపాటి ప్రాణాయామాలు, ఎక్కువ సేపు ధ్యానం చేయడం గుండెకు ఆరోగ్యం, సూక్ష్మ ప్రాణయామాలైన సూర్యవేది, చంద్రవేది అనులోమ విలోమ ప్రాణయామాలు, అంగన్యాస, అర్ధంగన్యాస, అరణ్యాస వంటి విభాగ ప్రాణాయామాలు (సెక్షనల్ బ్రీతింగ్ టెక్నిక్స్) హార్ట్‌రేట్ క్రమబద్ధీకరిస్తాయి. శస్త్ర చికిత్స చేయించుకున్నవారు, లంగ్స్‌లో సమస్య ఉన్నవారు భస్త్రిక, కపాలభాతి, అగ్నిసార, ఉడ్డియాన... వంటివి చేయకపోవడం మంచిది.

### 1. ప్రసారిత మార్జాలాసన

వజ్రాసనంలో కూర్చున్న తరువాత (రెండు కాళ్ళు మడిచి కాలి మడమల మీద కూర్చోవాలి) అర చేతులు రెండూ ముందు వైపు నేల మీద, మోకాళ్లు కింద ఉంచి నడుమును పూర్తిగా రిలాక్స్ చేయాలి. ఈ స్థితిలో ఉండి శ్వాస తీసుకుంటూ ఎడమచేతిని ముందుకు, కుడి కాలును వెనుకకు ఒకే సరళ రేఖలో ఉండేటట్లుగా సాగదీస్తూ ఉండి 3 లేదా 5 శ్వాసల తరువాత శ్వాస వదులుతూ కుడిమోకాలు కిందకు, ఎడమచేయి కిందకు తీసుకురావాలి. మళ్ళీ సీటు నడుము భాగాలను రిలాక్స్ చేస్తూ కొంచెం విశ్రాంతి తీసుకున్న తరువాత ఇదే ఆసనం రెండవవైపు కూడా చేయాలి. ఆపోజిట్ చేతిని, కాలుని స్ట్రెచ్ చేయడం వల్ల బ్యాలన్స్ చేయడంలో ఇబ్బంది ఉండదు. మోకాలు సమస్య ఉన్నట్లయితే టర్కీ టవల్‌ని కానీ పలచటి దిండును కాని మోకాళ్ల కింద పెట్టుకోవచ్చు.

### 2. అర్ధ అధోముఖ శ్వాసాసన

మార్జాలాసనంలో లాగానే మోకాళ్ళ మీద ఉండాలి. మోకాలు నుండి సీటు వరకూ (నడుము వరకూ) 90 డిగ్రీల కోణంలో ఉంచి వీపును ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ, నుదురు లేదా గడ్డాన్ని నేల మీద ఉంచి చేతులు రెండూ ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ శ్వాసను సాధారణ స్థితిలో ఉంచాలి. కనీసం 5 లేదా 10 శ్వాసల వరకూ అదే ఆసనంలో ఉండేటట్లయితే, డోర్సల్ స్పైన్‌కి, డెల్టాయిడ్ ట్రెపీజియస్ కండరాలకు బాగా టోనింగ్ జరిగి అప్పర్ బ్యాక్‌కి పూర్తిగా రిలీఫ్ దొరుకుతుంది.

### 3. శశాంకాసన

పైన చెప్పిన అర్ధ అధోముఖశ్వాసాసనంలో నుండి నెమ్మదిగా సీటు భాగాన్ని కిందకు క్రమ క్రమంగా దించి మడమల మీద కూర్చొనే విధంగా ప్రయత్నించాలి. పొట్ట ఛాతీ భాగాలు తొడలపైన ఉంచి శ్వాస వదులుతూ నుదురుని నేలకు వీలైనంత దగ్గరలోకి తీసుకువెళ్ళే ప్రయత్నం చేయాలి. నుదురు నేలకు దగ్గరగా తీసుకు వెళ్ళకపోయినా ఫరవాలేదు. కానీ వెనుక మడమల మీద సీటును ఉంచే ప్రయత్నం చేస్తూ మోకాళ్లు రెండూ కలిసి ఉంచే ప్రయత్నం చేయాలి. చేతులను ముందుకు బాగా స్ట్రెచ్ చేస్తూ ఉంచాలి.






**ఎ.ఎల్.వి కుమార్**
ట్రెడిషనల్ యోగా ఫౌండేషన్

## లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ అన్నయ్యా! నాకు రాంగ్ మెసేజ్‌తో ఒక అమ్మాయి పరిచయం అయ్యింది. చాట్ చేసుకుంటూ.. బాగా దగ్గరయ్యాం. వాళ్ల ఇంట్లో వాళ్లని కూడా నన్ను పరిచయం చేసింది. దాంతో నేను ఆమెకి ప్రపోజ్ చేశాను. ''నువ్వంటే నాకు ఇష్టమే కానీ.. నిన్ను ఆ ఫీలింగ్‌తో ఎప్పుడూ చూడలేదు'' అంది. 'పెళ్లి చేసుకుందాం' అంటే వద్దంది. కానీ ఫోన్ చేస్తే లవర్‌లాగా మాట్లాడుతోంది. నాకు ఏం చెయ్యాలో అర్థం కాలేదు. అప్పటినుంచి తను ఫోన్ చేస్తే ఒక టెన్షన్, చెయ్యక పోతే మరో టెన్షన్. దాంతో రీసెంట్‌గా 'నాకు ఇక ఫోన్స్, మెసేజెస్ చెయ్యకు' అని చెప్పేశాను. అప్పటినుంచి తను నాతో మాట్లాడటం లేదు. నాకు చాలా బాధగా ఉంది అన్నయ్యా! తనంటే నాకు చాలా ఇష్టం. నా ప్రాబ్లమ్‌కి మంచి సలహా చెప్పండి అన్నయ్యా!

– సురేష్

అమ్మో! గుండె పగిలినంతలా ఉంటుంది. అంతగా ఇష్టపడిన అమ్మాయి.. లవర్‌గా మాట్లాడుతూ.. ఫ్రెండ్‌లా ఉండమంటే మెంటల్ ఎక్కదా? అసలు మైండ్ హండ్రెడ్ ముక్కలైనట్లు ఉంటుంది. లవర్‌గా చూసుకుందామన్నప్పుడు.. నిన్ను అలా చూడలేదు అని చెబితే ఓ మై గాడ్..!! హార్ట్ వెయ్యి ముక్కలయినట్లు ఉండదా? అయ్యో సురేష్... ఇలాంటి ఆపద పగవాడికి కూడా రాకూడదు. ఇది చాలదన్నట్లు మనల్ని రెచ్చగొట్టి రెచ్చగొట్టి మనతోనే మెసేజ్‌లు వద్దని చెప్పించిందంటే ఓ మై గాడ్..!! ఇక లైఫ్ అంతా అలా చెప్పి ఉండాల్సింది కాదని మనల్ని మనమే తిట్టుకోవాల్సి వస్తుంది.. ఇప్పుడు ఫోన్ టింగు మనదు. పోనీ టింగుమన్నా.. అమ్మాయి మెసేజ్ కాకుండా ఏ సన్నాసోడిదో అయ్యి చస్తది. పోనీ ఫోన్ బంద్ చేసి కూర్చుందామంటే.. అమ్మాయి మనసు మార్చుకుని మెసేజ్ కొడతాదేమోనన్న భయంతో అదీ చెయ్యలేం.

'సార్ సురేష్ ఆల్రెడీ బాధలో కూరుకుపోయి.. పిచ్చి పిచ్చిగా ఫీల్ అయిపోతుంటే.. మీరేంటి సార్?? రివైన్డ్‌లో స్టోరీ అంతా చెప్పి మళ్లీ గుచ్చి గుచ్చి చంపుతున్నారు సార్!'

మరేం చెప్పమంటావు నీలూ??

'అమ్మాయి టైమ్ పాస్ కోసం సురేష్‌తో ఆడుకుంటుందని నిజం చెప్పచ్చుకదా సార్? అయినా సురేష్ చేసింది కరెక్ట్ సార్..! ఊరికే హర్ట్ పెట్టకుండా.. మైండ్ గేమ్స్ ఆడే అమ్మాయిలైతే ఫస్ట్.. ఫాస్ట్‌గా కనెక్షన్ కట్ చెయ్యాలి సార్!'

lovedoctorram@sakshi.com

## ఈ పాటకు ట్యూన్ తెలుసా?




**నేడు కె.వి.మహదేవన్ వర్ధంతి**

**పల్లవి :**
ఓం... ఓం...
ఓంకారనాదానుసంధానమౌగానమే
శంకరాభరణము
॥ఓంకార...॥

శంకర గళనిగళము
శ్రీహరి పదకమలము (2)
రాగరత్నమాలికా తరళము శంకరాభరణము

**చరణం : 1**
శారదవీణా... శారదవీణా
రాగచంద్రికా పులకిత శారద రాత్రము
॥శారదవీణా॥

నారద నీరద మహతి నినాద
గమకిత శ్రావణగీతము (2)
రసికులకనురాగమై రసగంగలో తానమై (2)
పల్లవించు సామవేదమంత్రము
శంకరాభరణము శంకరాభరణము

**చరణం : 2**
అద్వైతసిద్ధికి అమరత్వలబ్ధికి
గానమె సోపానము (2)
సత్వసాధనకు సత్యశోధనకు
సంగీతమే ప్రాణము (2)
త్యాగరాజ హృదయమై
రాగరాజ నిలయమై (2)
ముక్తినొసగు భక్తియోగ మార్గము మృతియె
లేని సుధాలాపస్వర్గము శంకరాభరణము
॥ఓంకార...॥

పా దా ని శంకరాభరణము
పమగరీ గమపదని శంకరాభరణము
సరిసా నిదపా నిసనీ దపమా గరిగా పమగా
పమదపనిదసనిగరి శంకరాభరణము
దపా దమా మపాదపా మపాదపా
దపా దమా మదపామగా మదపా మగా
గమమద దనినిరి మదదని
నిరిరిగ నిరిరిగ గమమగ
సరిరిస సనినిదదప శంకరాభరణము
రీసపాస రిరిసాస రీసాస
సనిసరీ దనిదరీ సని నీనీనీ
దాదనీని దదనీని దానీని దనిస
దనిస దని దగరిసా నిదప దాదాదా
గరిగా మమగా గరిగా మమగా
గరిగమపగామపద మదపమ గరిసరి
సరిగసరీ గరిమగపమ దప మగపమ దపనిద
పమదప నిదసని దపనిద సనిరీసా
గారీసా గరిసనిద రీసా రిసనిదప సా
గరిసనిద రిసనిదప సరిదపమ
రీసానీ రిసనిదప నీదా
సనిద పమపా రిసనిదప
సనిదపమ దపమగరి గామాదా
నిదని పదమాపా రిసనిదపనీ దపమగరి
రిసనిదప మగరిసని శంకరాభరణము
శంకరాభరణము

**చిత్రం : శంకరాభరణం (1981)**
**రచన: వేటూరి**
**సంగీతం : కె.వి.మహదేవన్**
**గానం : ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం**

కట్‌చేయ్...దాచేయ్...

# ఆన్ వర్క్ మోడ్


రామ్‌చరణ్

ఇటీవల సౌతాఫ్రికాలో సతీమణి ఉపాసనతో కలిసి హాలిడేను బాగా ఎంజాయ్ చేసిన రామ్‌చరణ్ ఇక వర్క్ మోడ్‌లోకి రానున్నారు. రాజమౌళి దర్శకత్వంలో ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా 'ఆర్‌ఆర్‌ఆర్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. దాదాపు 350 కోట్ల బడ్జెట్‌తో డీవీవీ దానయ్య నిర్మిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన ఆలియా భట్ కథానాయికగా నటిస్తున్నారు. ఎన్టీఆర్ సరసన హీరోయిన్ ఇంకా ఫిక్స్ కాలేదు. ఈ సినిమా తాజా షెడ్యూల్ షూటింగ్‌లో సోమవారం నుంచి రామ్‌చరణ్ పాల్గొంటారని సమాచారం. కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణకు టీమ్ ప్లాన్ చేసిందని తెలిసింది. 1921 నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో స్వాతంత్య్ర సమరయోధులు అల్లూరి సీతారామరాజు పాత్రలో రామ్‌చరణ్, కొమరం భీమ్ పాత్రలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. వచ్చే ఏడాది జూలై 30న 'ఆర్‌ఆర్‌ఆర్' మూవీ విడుదల కానుంది.

# హలో హాలీవుడ్


శ్రుతీహాసన్

గతంలో కొంతకాలం సినిమాలకు విరామం ఇచ్చి పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేశారు శ్రుతీహాసన్. లండన్‌లో కొన్ని మ్యూజిక్ షోలు నిర్వహించారు. యాక్టింగ్‌కు ఇచ్చిన విరామానికి ఫుల్‌స్టాప్ పెట్టి మళ్లీ యాక్టింగ్‌పై ఫుల్ ఫోకస్ పెట్టారు. తమిళంలో విజయ్ సేతుపతితో ఓ సినిమా, తెలుగులో రవితేజతో ఓ సినిమా అంగీకరించారు శ్రుతీహాసన్. తాజాగా ఓ ఇంటర్నేషనల్ టీవీ సిరీస్‌లోనూ నటిస్తున్నారని తెలిసింది. హాలీవుడ్‌లో 'బోర్న్' సిరీస్‌లో 5 చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు ఈ చిత్రాల తరహాలోనే 'ట్రెడ్ స్టోన్' అనే సిరీస్‌ను రూపొందిస్తున్నారు. మైఖేల్ ఫోర్బ్స్, మైఖేల్ గ్యాస్టన్, బ్రైన్ జె. స్మిత్ ముఖ్య పాత్రల్లో నటించనున్నారు. ఇటీవలే బుడాపెస్ట్‌లో ఈ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ స్టార్ట్ అయింది. ఇంటర్నేషనల్ స్పై మిషన్ కథాంశంగా రూపొందనున్న ఈ సిరీస్‌లో శ్రుతీహాసన్ ఢిల్లీకి చెందిన నీరా పటేల్ పాత్రలో కనిపిస్తారు. పగలంతా హోటల్‌లో వెయిట్రెస్‌గా కనిపించి రాత్రి హత్యలు చేసే కిల్లర్‌గా మారతారట. త్వరలోనే ఈ సిరీస్ షూటింగ్‌లో శ్రుతీహాసన్ పాల్గొననున్నారు. యూఎస్ టీవీ సిరీస్‌లో నటించనున్న తొలి సౌతిండియన్ హీరోయిన్ కూడా శ్రుతీహాసనే కావడం విశేషం. ఇంతకుముందు 'క్వాంటికో' అనే టీవీ సిరీస్‌లో ఉత్తరాది భామ ప్రియాంకా చోప్రా కనిపించిన సంగతి గుర్తుండే ఉంటుంది.


నితిన్

# న్యూ లుక్.. న్యూ క్యారెక్టర్

'భీష్మ' చిత్రంతో కొత్త ప్రయాణాన్ని సంతోషంగా ఆరంభించానంటున్నారు హీరో నితిన్. 'ఛలో' ఫేమ్ వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా 'భీష్మ' అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రష్మికా మండన్నా కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ గురువారం మొదలైంది. ''దాదాపు ఏడాది తర్వాత కెమెరా ముందుకు వచ్చాను. 'న్యూ డే.. న్యూ లుక్.. న్యూ క్యారెక్టర్'. 'భీష్మ' ప్రయాణాన్ని స్టార్ట్ చేస్తున్నందుకు ఎగ్జైటింగ్‌గా ఉంది'' అని నితిన్ పేర్కొన్నారు. సితార ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై పీడీవీ ప్రసాద్, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా కాకుండా చంద్రశేఖర్ ఏలేటి, కృష్ణచైతన్య దర్శకత్వాల్లో సినిమాలు కమిట్ అయ్యారు నితిన్.


సమీరా రెడ్డి

కొత్త మెరుపుతో సమీరా రెడ్డి మెరిసిపోయారు. ఆ మెరుపు చూసి సమీరా భర్త అక్షయ్ వార్దే మనసు మురిసింది. ఇద్దరి ఆనందానికి సాక్షిగా కుమారుడు హన్స్ మెరిశాడు. ఇప్పుడు సమీరా రెండో బిడ్డకు జన్మనివ్వనున్నారు. గురువారం ఆమె శ్రీమంతం జరిగింది. ''మనం నవ్వితే మనతో పాటు ఈ సమస్తం కూడా నవ్వుతుంది. ఆరోగ్యకరమైన నవ్వు, మానసికంగా ఆనందంగా ఉంటే అదే జీవితకాలపు సంతోషం. కాంచిపురం చీర కట్టుకోగానే నాకే నేను స్పెషల్‌గా కనిపిస్తున్నాను'' అంటూ ఇక్కడున్న ఫొటోలను షేర్ చేశారు. 'జై చిరంజీవ, నరసింహుడు, అశోక్' సినిమాలతో అలరించిన సమీరా రెడ్డి 2014లో అక్షయ్‌ను వివాహం చేసుకొని సినిమాలకు దూరంగా ఉన్నారు. 2015లో వీరికి కుమారుడు పుట్టారు. ఇప్పుడు రెండో బేబీ రాక కోసం ఆనందంగా ఎదురు చూస్తున్నారు.


భర్త అక్షయ్, కొడుకు హన్స్‌తో సమీరా

# ఎమోషనల్ జర్నీ స్టార్ట్


సతీశ్ వేగేశ్న, మెహరీన్, కల్యాణ్ రామ్, కృష్ణప్రసాద్, ఉమేశ్ గుప్తా

ఆదిత్య మ్యూజిక్ కంపెనీ నిర్మాణంలోకి అడుగుపెడుతూ తీయనున్న మొదటి చిత్రం ముహూర్తం గురువారం జరిగింది. కల్యాణ్ రామ్, మెహరీన్ జంటగా దర్శకుడు సతీశ్ వేగేశ్న ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఉమేశ్ గుప్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ముహూర్తానికి 'దిల్'రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముహూర్త సన్నివేశానికి సంగీత దర్శకుడు గోపీ సుందర్ క్లాప్ ఇవ్వగా, జగదీశ్ గుప్తా కెమెరా స్విచ్చాన్ చేశారు. ఉమేశ్ గుప్తా గౌరవ దర్శకత్వం వహించారు. ''జూలై 24న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. హైదరాబాద్, రాజమండ్రి, ఊటీ ప్రాంతాల్లో షూటింగ్ చేస్తాం. సతీశ్ వేగేశ్నగారు అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ కథను సిద్ధం చేశారు'' అన్నారు నిర్మాతలు. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట, సంగీతం: గోపీ సుందర్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: రషీద్ ఖాన్.


రాన్, మాధవన్, ఫిలిస్

# స్పేస్ జర్నీ ముగిసింది

'రాకెట్రీ'లో మాధవన్ అంతరిక్ష ప్రయాణం సెర్బియాలో ముగిసింది. మాధవన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్'. ఈ చిత్రానికి దర్శకుడు కూడా మాధవనే కావడం విశేషం. ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమా చిత్రీకరణ ముగిసింది. నారాయణన్ పాత్రలో మాధవన్ నటించారు. దాదాపు పదిహేడేళ్ల తర్వాత మాధవన్, సిమ్రాన్ జంటగా నటించిన చిత్రం ఇది. ఇంతకుముందు మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'కన్నత్తిల్ ముత్తమిట్టాళ్' (తెలుగులో 'అమృత') సినిమాలో మాధవన్, సిమ్రాన్ నటించారు. ''రాకెట్రీ సినిమా ముగిసింది. నా జీవితంలోనే అత్యద్భుతంగా ఈ సినిమా చిత్రీకరణ జరిగింది. నా హృదయం ఎన్నో భావోద్వేగాలతో నిండిపోయింది'' అన్నారు మాధవన్. ఇందులో హాలీవుడ్ యాక్టర్లు రాన్ డోనాచీ (గేమ్ ఆఫ్ థ్రోన్స్ ఫేమ్), ఫిలిస్ లోగాన్ కీలక పాత్రలు చేశారు.

# ఇమేజ్ అన్నది నటులకు శాపం


ప్రియదర్శి

''నటీనటులను ఎప్పుడూ ఒకే కోణంలో చూడకూడదు. అన్ని పాత్రల్లోనూ చూడాలి. ఫలానా పాత్రలే చేయగలుగుతామనే ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకూడదు. నటీనటులకు ఇమేజ్ అనేది శాపం అని నా అభిప్రాయం. అందుకే కథ నచ్చితే ఏ పాత్ర అయినా చేస్తా'' అన్నారు ప్రియదర్శి. ఆయన లీడ్ రోల్‌లో పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతకింది మల్లేశం జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'మల్లేశం'. సురేశ్ ప్రొడక్షన్స్ సమర్పణలో రాజ్.ఆర్ దర్శకత్వంలో రాజ్.ఆర్, శ్రీ అధికారి నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా ప్రియదర్శి చెప్పిన విశేషాలు.

● కమెడియన్, విలన్, హీరో... ఇలా ఏదీ నేను ప్లాన్ చేసుకోలేదు. ఇండస్ట్రీలో ఏదో ఒక పని దొరికితే చాలనుకున్నా. తమ్మారెడ్డి భరద్వాజ, యుగంధర్‌గారి సంస్థలో యాడ్ ఫిల్మ్స్‌కి అసిస్టెంట్ ప్రొడ్యూసర్‌గా చేశా. ఇండస్ట్రీ అంటే ఏంటి? అనేది అక్కడే నేర్చుకున్నా. ఏడాదిన్నర తర్వాత మానేయాల్సి వచ్చింది.

● నటుడు అవుదామని ఫిక్స్ అయ్యాక పోర్ట్‌ఫోలియో పట్టుకుని స్టూడియోలు తిరగడానికి నేను అంత అందగాణ్ణి కాదు.. అందుకే షార్ట్ ఫిల్మ్స్ చేశా. 'అనుకోకుండా' అనే షార్ట్‌ఫిల్మ్‌కి 10 లక్షల వ్యూస్ వచ్చాయి. నాకు అది 'బాహుబలి' రేంజ్ అన్నమాట. ఐదేళ్ల పాటు ఎక్కడ ఆడిషన్స్ ఉంటే అక్కడికి వెళ్లా. దాదాపు 200 ఆడిషన్స్ ఇచ్చా. 'జున్ను' షార్ట్ ఫిల్మ్ నచ్చడంతో కరీంనగర్‌కి చెందిన వాళ్లు ఓ సినిమా అవకాశం ఇచ్చి, రూ. 5000 డబ్బులు కూడా ఇచ్చారు. కానీ, అది విడుదలవలేదు. మూడు నాలుగు సినిమాల తర్వాత 'బొమ్మల రామారం' సినిమాలో విలన్‌గా చేశా. ఆడిషన్స్‌కి వెళ్లి 'పెళ్లి చూపులు, ఘాజీ' సినిమాలకు ఎంపికయ్యాను. 'పెళ్లి చూపులు' సినిమా నన్ను ఓవర్‌నైట్ స్టార్‌ని చేసింది. ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు.

● 'అ' సినిమా చేస్తున్నప్పుడు రాజ్. ఆర్‌గారు చింతకింది మల్లేశం బయోపిక్ 'మల్లేశం'లో లీడ్ రోల్ చేస్తావా? అని అడిగారు. కథ బాగా నచ్చడంతో ఓకే అన్నా. పైగా 'వైఫ్ ఆఫ్ రామ్' సినిమా చేశాక సీరియస్ పాత్రలు చేయగలం అనే నమ్మకం కుదిరింది.

● మల్లేశం 6వ తరగతి వరకే చదువుకున్నారు. మగ్గం నేసే పనిలో తన తల్లి పడుతున్న కష్టాన్ని చూస్తాడు. మల్లేశం భార్య కూడా కష్టంగా ఉందని మగ్గం పని మానేస్తుంది. దీంతో ఆ పని సులువు కావడానికి 1999లో 'ఆసు' యంత్రాన్ని కనుగొన్నారు మల్లేశం. అప్పటికే చాలామంది మగ్గం పనులు మానేసి ఉంటారు. 'ఆసు' యంత్రం రావడంతో వారందరూ మళ్లీ మగ్గం పనులు మొదలు పెట్టారు. మగ్గం నేసే ప్రతి ఇంట్లో 'ఆసు' యంత్రం ఉండాలన్నది మల్లేశం విజన్. ఆయన సేవల్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లో 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చింది.

● 'మల్లేశం' ప్రివ్యూ చూసిన వాళ్లంతా తెరపై ప్రియదర్శి కాదు.. మల్లేశం కనిపించాడని అంటుంటే చాలా సంతోషంగా అనిపించింది. చేనేత వస్త్రాలను ప్రోత్సహించేందుకు మంత్రి కేటీఆర్‌గారు ఎప్పుడూ ముందుంటారు. మా సినిమాని కూడా ఆయన ఎంతో ప్రమోట్ చేస్తున్నారు. ఈ సినిమా చేశాక చేనేతల కష్టం ఏంటో తెలిసింది. అప్పటి నుంచి నేను కొనే బట్టల్లో 30 శాతం చేనేత వస్త్రాలు ఉండేలా ప్లాన్ చేసుకున్నా. నా ఫ్రెండ్స్‌కి కూడా చెబుతున్నా.

# అందుకే డిటెక్టివ్ కథకి ఓకే చెప్పా


నవీన్

''నేను 7–8 తరగతి చదువుతున్నప్పటి నుంచే నటన, నాటకాలంటే ఇష్టం. పదో తరగతి వరకూ హైదరాబాద్‌లోనే చదివా. మా తల్లిదండ్రుల ఒత్తిడి మేరకు భోపాల్ నిట్‌లో చేరి, ఇంజినీరింగ్ పూర్తిచేశా. యూ ట్యూబ్ నుంచి నా ప్రయాణం బిగ్ స్క్రీన్‌కి మారింది'' అన్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన హీరోగా నటించిన చిత్రం 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'. స్వరూప్‌రాజ్ దర్శకత్వంలో రాహుల్ యాదవ్ నక్కా నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నవీన్ పొలిశెట్టి చెప్పిన విశేషాలు.

● బాంబేలో సినిమా అవకాశాల కోసం తిరిగేవాణ్ణి. కొన్ని ఆడిషన్స్ ఇచ్చాను కూడా. నటన బాగుంది అన్నారే కానీ ఎవరూ అవకాశం ఇవ్వలేదు. ఫ్రెండ్స్ సలహా మేరకు స్టాండప్ కామెడీ ఆడిషన్స్‌లో పాల్గొని గెలిచా. దాంతో యూ ట్యూబ్ చానెల్‌లో నా వీడియోస్ పెట్టారు. 'హానెస్ట్ వెడ్డింగ్' బాగా వైరల్ అవడంతో పాటు పది మిలియన్ వ్యూస్ వచ్చాయి. యూ ట్యూబ్ చానెల్స్‌కి ఇంత ఆదరణ ఉందని అప్పుడే తెలిసింది. 'ఇంగ్లీష్ ఇంటర్వ్యూ' అని మరో వీడియో వాట్సాప్‌లో బాగా వైరల్ అయింది. అది చూసిన డైరెక్టర్ స్వరూప్ రాజ్‌గారు ఫోన్ చేసి, 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'లో డిటెక్టివ్‌గా చేస్తారా? అన్నారు. కథ వినగానే మైండ్ బ్లాంక్ అయిపోయింది. ఆ పాత్ర నాకంత నచ్చింది. పైగా తెలుగులో ఈ మధ్య డిటెక్టివ్ కథలు రాలేదు. ప్రేక్షకులకు కొత్తగా ఉంటుందని ఓకే చెప్పా.

● బెంగళూరులో థియేటర్ ఆర్ట్స్ చేశా. హైదరాబాద్‌లో ఓ థియేటర్ ఆర్ట్స్ వర్క్‌షాప్‌లో నేను, విజయ్ దేవరకొండ కలిశాం. అప్పటి నుంచి మేం ఫ్రెండ్స్. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లో లీడ్ రోల్స్ కోసం ప్రయత్నిస్తే, హీరో ఆపోజిట్ గ్యాంగ్‌కి ఎంపికయ్యాం. ప్రస్తుతం హిందీలో నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'చిచ్చోరే' సినిమాలో ఓ లీడ్ రోల్ చేస్తున్నాను.


రణ్‌వీర్

# యంగ్ బాద్‌షా

''నేను డబ్బు వెనక కాదు, ప్రేమ వెనక పరిగెడతాను'' అంటాడు 'సింబా' సినిమాలో రణ్‌వీర్ సింగ్. విశేషం ఏంటంటే బాలీవుడ్‌లో ప్రస్తుతం డబ్బంతా ఆయన సినిమాల చుట్టే తిరుగుతోంది. ఒక్క ఏడాదిలో రణ్‌వీర్ సింగ్ సినిమాలు చేసిన బిజినెసే అందుకు ఉదాహరణ. ఆయన నటించిన 'పద్మావత్, గల్లీ బాయ్, సింబా' సినిమాలు గత ఏడాది రిలీజయ్యాయి. ఈ మూడు సినిమాలు దాదాపు 800 కోట్లు బిజినెస్ చేయడం విశేషం. ''సినిమా నిర్మాణం రిస్క్. దర్శకుడు, నటీనటులను నిర్మాతలు నమ్ముతారు. ఓ హీరోగా ఆ నమ్మకాన్ని నా సినిమాలు నిలబెట్టడం చాలా సంతోషం. ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీకి నా సినిమాలు తమ వంతు సహాయపడటం సంతృప్తిగా ఉంది'' అన్నారు రణ్‌వీర్. యంగ్ హీరోలు ఇలా వరుస సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు సాధించడం ఇండస్ట్రీకి మంచి పరిణామం. ఇప్పుడు బాలీవుడ్ పరిశీలకులు రణ్‌వీర్‌ను బాలీవుడ్ యంగ్ బాద్‌షా అంటున్నారు.

# బెదిరింపులతో ఓటర్‌ని ఆపలేరు


ప్రశాంత్ గౌడ్

''ఓటర్' సినిమా విడుదల కాకుండా కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. సినిమాని ఆపాలని బెదిరిస్తున్నారు. ఎన్ని బెదిరింపులు వచ్చినా ఆపేది లేదు. అనుకున్న ప్రకారం నేడు విడుదల చేస్తున్నాం'' అన్నారు ప్రశాంత్ గౌడ్. మంచు విష్ణు, సురభి జంటగా నటించిన చిత్రం 'ఓటర్'. కార్తీక్ దర్శకత్వంలో జాన్ సుధీర్ పూదోట నిర్మించిన ఈ సినిమా ఈ రోజు రిలీజ్ అవుతోంది. గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో అడ్వకేట్ వేణు కుమార్ మాట్లాడుతూ– ''ఈ సినిమా స్క్రిప్ట్ విషయంలో వివాదం తలెత్తిన నేపథ్యంలో జాన్ సుధీర్ పూదోట, కార్తీక్‌పై 24 ఫిల్మ్ ఫ్యాక్టరీ సంస్థ కోర్టులో కేసు వేసింది. సినిమాని ఆపాలంటూ వేసిన పిటిషన్‌ని కోర్టు తిరస్కరించింది. సినిమా విడుదల విషయంలో అభ్యంతరం చెప్పకుండా కోర్టు ఆర్డర్ కూడా ఇచ్చింది'' అన్నారు. ఈ చిత్రం ప్రపంచ వ్యాప్త థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్న ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ– ''12ఏళ్లుగా డిస్ట్రిబ్యూటర్‌గా, నిర్మాతగా, ఫైనాన్షియర్‌గా ఉన్నాను. నాపై ఇప్పటివరకూ ఎలాంటి వివాదాలు లేవు. ఓటర్ విలువ చెప్పే చిత్రం ఇది. ఈ పాయింట్ నచ్చి కొనుక్కున్నా. లీగల్‌గా విడుదల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు. కొంతమంది ఎగ్జిబిటర్స్, డిస్ట్రిబ్యూటర్స్‌తో ఉన్న పరిచయాలతో సినిమాని విడుదల చేస్తున్నా'' అన్నారు.

# విద్య కోసం పోరాటం


నందితా శ్వేత

కథానాయిక నందితాశ్వేత ప్రధాన పాత్రలో బి. చిన్నికృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'అక్షర'. అహితేజ బెల్లంకొండ, సురేష్ వర్మ నిర్మించారు. విద్యావ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే అక్షర పోరాటం ఆసక్తిగా సాగుతుంది అని చిత్రబృందం చెబుతోంది. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''ఒక దర్శకుడి ఆలోచన విఫలం కావొచ్చు. కానీ అతని ప్రయత్నం ఎప్పటికీ విఫలం కాకూడదు. ఈ సినిమా కథ బాగా నచ్చింది. టీజర్ బాగుంది. ఇలాంటి కాన్సెప్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న నిర్మాతలకు అభినందనలు. చిన్నికృష్ణ నాకు మంచి మిత్రుడు. నా మొదటి సినిమా 'పటాస్' టేకాఫ్ కావడానికి అతను చేసిన సహాయం మరువలేనిది. నందితా శ్వేత మంచి ఆర్టిస్టు. ఈ సినిమాలో ఆమె లుక్స్ బాగున్నాయి'' అన్నారు. ''నేను చెప్పిన లైన్ విని దర్శకుడిగా నాకు అవకాశం కల్పించిన నిర్మాతలకు థ్యాంక్స్. ఈ చిత్రంలో ఓ సీరియస్ పాయింట్‌ని డిస్కస్ చేశాం. ఈ సినిమాలోని 'అక్షర' పాత్రకు రూపం ఇచ్చిన నందితగారికి థ్యాంక్స్. ఈ కథ వినగానే 'హిట్ కొడుతున్నావ్' అని అనిల్ అన్నాడు. ఎడ్యుకేషన్ అందరికీ అందుబాటులోకి రావాలన్నదే అక్షర చేసే పోరాటం'' అని చిన్నికృష్ణ అన్నారు. ''మెసేజ్ ఓరియంటెడ్ మూవీ ఇది. ఈ సినిమాకు నా కెరీర్‌లో ప్రత్యేక స్థానం ఉంటుంది'' అన్నారు నందిత. ''సినిమాను ఆగస్టులో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు సురేష్ వర్మ. ''అక్షర' సినిమా ఐడియా నాకు పేపర్ మీద ఉన్నప్పటి నుంచి తెలుసు. మంచి కాన్సెప్ట్‌తో వస్తున్నారు'' అన్నారు 'మధుర' శ్రీధర్. ఈ చిత్రంలో మంచి క్యారెక్టర్ చేశానని శ్రీతేజ్ చెప్పారు.




సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
శుక్రవారం
21-6-2019

ఫ్యాషన్

# వెస్ట్‌తో జత పట్టు



**ఇండో వెస్టర్న్ స్టైల్**
**అప్పుడూ .. ఇప్పుడు.. ఎప్పుడూ**
**ఓ కొత్త ట్రెండ్‌ను పరిచయం చేస్తూనే ఉంటుంది.**
**మన సంప్రదాయ పట్టు దుస్తులు**
**వెస్టర్న్ టాప్స్‌తో జత కడితే చాలు**
**ఇలా సరికొత్త స్టైల్‌తో వెలిగిపోతారు.**
**పార్టీలో అందరి చేత కితాబులు అందుకుంటారు.**

మన సంప్రదాయ బెనారస్ పట్టు స్కర్ట్ మీదకు వెస్టర్న్ కేప్ ఇప్పుడు సరైన ఎంపిక అయ్యింది. ఇండోవెస్టర్న్ స్టైల్‌తో ఆకర్షణీయమైన అందం ఎక్కడ ఉన్నా ప్రత్యేకత చాటుతోంది.

లెహంగాకి షార్ట్ క్రాప్‌టాప్, లాంగ్ జాకెట్ జతకడితే చూపులను కట్టడి చేసే స్టైల్ వేడుకలో ఎక్కడ ఉన్నా ప్రత్యేకంగా కనిపిస్తుంది.

ముదురు రంగుల పట్టు స్కర్ట్‌కి వైట్ కాంబినేషన్‌లో షర్ట్ జత చేర్చితే అది ఏ వేడుక అయినా స్పెషల్‌గా కనిపిస్తారు.

పెద్ద అంచు ఉన్న పట్టు లెహంగా దుపట్టాను తలపించే లాంగ్ కేప్ ప్రత్యేక ఆకర్షణ. ఇండోవెస్టర్న్ పార్టీలో స్పెషల్‌గా నిలుస్తుంది.

పట్టు లెహంగాకి .. పట్టు జాకెట్ .. ఇది ఇండియన్ స్టైల్. అయితే జాకెట్ వెస్టర్న్ స్టైల్‌లో క్రాప్‌టాప్‌లో అమరితే అది చూపరులను ఇట్టే ఆకర్షిస్తుంది. వేడుకలో స్పెషల్ అట్రాక్షన్ అవుతుంది.

బాలీవుడ్ టు టాలీవుడ్.. నార్త్ టు సౌత్ .. ఏ ఈవెంట్ అయినా పట్టు స్కర్ట్‌కి వెస్టర్న్ టాప్ జత చేరుతుంది. ఎందరిలో ఉన్నా ప్రత్యేకత కనపడుతుంది. సంప్రదాయ వేడుకైనా, గెట్ టుగెదర్ పార్టీ అయినా ఈ డ్రెస్‌తో స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తారు.

నిర్వహణ: నిర్మలారెడ్డి

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

# బిహార్‌లో పిల్లలకు వస్తున్న జ్వరం ఏమిటి?

## ఇక్కడా వచ్చే అవకాశాలున్నాయా? నివారణ ఎలా?

**బిహార్‌లో పిల్లలకు వస్తున్న జబ్బేమిటి? ఆ పిల్లలను చూస్తుంటే బాధగానూ ఉంది. అలాంటి జబ్బు మన పిల్లలకూ వచ్చే అవకాశాలున్నాయేమోననే ఆందోళన కూడా ఉంది. ఆ జబ్బుకు కారణాలేమిటి? ఆ జబ్బు మన తెలుగు రాష్ట్రాల్లో వచ్చే అవకాశముందా? దానిపై అవగాహన కల్పిస్తూ, దాని నివారణ మార్గం ఏదైనా ఉంటే చెప్పండి.**

**- ఎమ్. కృష్ణచైతన్య, విజయనగరం**

బిహార్‌లోని పిల్లల్లో కనిపిస్తున్న జబ్బు ప్రధానంగా ఒక రకం మెదడు వాపు. దీన్ని అక్యూట్ ఎన్‌సెఫలైటిక్ సిండ్రోమ్‌గా చెబుతున్నారు. అయితే అక్కడి స్థానికులు హిందీలో దీన్ని 'చమ్కీ ఫీవర్' అని కూడా అంటున్నారు. బిహార్‌లోని ముజఫర్‌పూర్, చంపారన్... ఆ చుట్టుపక్కల అనేక జిల్లాల్లో ఇది విస్తృతంగా వ్యాపిస్తూ వందలాది చిన్నారుల ఉసురు తీస్తోంది.

సాధారణంగా ఈ అక్యూట్ ఎన్‌సెఫెలైటిస్ సిండ్రోమ్‌లో పిల్లలకు మొదట తీవ్రమైన జ్వరం (హైఫీవర్) కనిపిస్తుంది. అలాగే పిల్లలు చాలా మబ్బుగా, మందకొడిగా, నీరసంగా ఉంటారు. అయోమయంగా కనిపిస్తుంటారు. ఒక్కోసారి తల్లి దండ్రులను సైతం గుర్తుపట్టలేరు. వెలుతురును భరించలేకపోవడం, రకరకాల భ్రాంతులకు గురికావడం వంటి లక్షణాలూ కనిపిస్తాయి. ఇక జ్వరం తీవ్రమైనప్పుడు ఫిట్స్ రావడం కూడా చాలా సాధారణంగా కనిపిస్తుంది.

**కారణాలు:** సాధారణంగా ఇన్ఫెక్షన్‌లు వచ్చి అవి మెదడును ప్రభావితం చేయడం వల్ల 'అక్యూట్ ఎన్‌సెఫలైటిక్ సిండ్రోమ్' కనిపిస్తుంది. ఈ ఇన్ఫెక్షన్లకు అటు వైరల్, ఇటు బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు ప్రధానంగా కారణమవుతాయి. వైరల్ ఇన్ఫెక్షన్లలో జాపనీస్ ఎన్‌సెఫలైటిస్, ఎంటరో వైరస్, హెర్పిస్ సింప్లెక్స్, ఇన్‌ఫ్లుయెంజా వైరస్ వంటి అనేక వైరస్‌లు ప్రధాన కారణం. ఇక బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు ప్రధానంగా స్ట్రెప్టోకోకస్, స్టెఫాలోకోకస్ వంటి బ్యాక్టీరియాలు కారణం కావచ్చు. నిమోనియాకు దారితీసే ఇన్ఫెక్షన్లు బ్రెయిన్ ఇన్ఫెక్షన్స్‌కు కారణం కావచ్చు. బ్రెయిన్ టీబీ వల్ల కూడా మెదడు ప్రభావితమై ఇలాంటి సమస్యలు రావచ్చు.

ఇక మన తెలుగు రాష్ట్రాల్లోనూ వర్షాకాలం వచ్చే ముందర, వేసవి నుంచి వర్షాకాలంలోకి ప్రవేశించే సమయాల్లో పడే చినుకులు, జల్లులతో దోమలు బాగా పెరిగి, డెంగ్యూ వస్తుంది. గతంలో అంతగా కనిపించకపోయినా ఇటీవల గత ఆర్నెల్లుగా డెంగ్యూ ఇన్ఫెక్షన్ కారణంగా బ్రెయిన్‌కు సంబంధించిన సమస్యలు వచ్చి బ్రెయిన్ ఇన్ఫెక్షన్లు కనిపిస్తున్న కేసులూ పెరిగాయి. ఇక మన పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని నాందేడ్, దాని పరిసర ప్రాంతాల్లో ఇటీవల రికెట్షియల్ ఇన్ఫెక్షన్ ఎక్కువగా కనిపించింది. అది కూడా ఇలాగే మెదడును ప్రభావితం చేసింది. ఈ అన్ని కేసుల్లోనూ బిహార్‌లో కనిపించినట్లుగా పిల్లల్లో మెదడు ప్రభావితమవుతుంది. ఈ ఇన్ఫెక్షన్లలో ఏది సోకినా రెండు మూడు రోజులు జ్వరం వస్తుంది. అయితే మన దేశంలోని పిల్లల్లో పోషకాహార లోపాల వంటి కారణంగా వారు బలహీనంగా ఉండటం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో వెంటనే ఈ తరహా వైరస్‌లు, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ల బారిన పడుతున్నారు. పైగా బిహార్‌లో కనిపిస్తున్న ఈ 'అక్యూట్ ఎన్‌సెఫలైటిక్ సిండ్రోమ్' తక్కువ వ్యవధిలో అంటే రెండుమూడు రోజుల్లోనే తీవ్రజ్వరంతో వారి మెదడుపై ప్రభావం చూపి, ఆ పిల్లల ప్రాణాలను తీస్తోంది.



**ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!**

అక్యూట్ ఎన్‌సెఫలైటిక్ సిండ్రోమ్‌కు ముందర రెండు మూడు రోజుల పాటు జ్వరం వస్తుంది. నిద్ర మబ్బుతో, మందకొడిగా, ఫిట్స్‌తో వస్తుంటారు. వాళ్లు చక్కగా తినలేరు. బ్లడ్‌షుగర్ తగ్గి కాంప్లికేషన్స్ వస్తుంటాయి. మరికొన్ని ఇన్ఫెక్షన్లలో అవి నేరుగా మెదడుపై ప్రభావం చూపకపోయినా ఒంట్లోని ఇతరత్రా శారీరక వ్యవస్థలు అంటే శ్వాసవ్యవస్థపై ప్రభావం చూపి ఊపిరి సరిగా ఆడకపోవడం, రక్తపోటు సమస్యలు, గుండెవేగం తగ్గడం, మూత్రవిసర్జన వ్యవస్థలో (యూరినరీ) ఇన్ఫెక్షన్లు, జీర్ణవ్యవస్థలో ఇన్ఫెక్షన్లు వంటివి కనిపించినప్పుడు వెంటనే చికిత్స అందకపోతే వారిలో 'బ్రెయిన్‌ప్రెషర్' పెరిగిపోతుంది. ఇలా బ్రెయిన్ ప్రెషర్ పెరిగినప్పుడు తక్షణం చికిత్స అందించడం చాలా చాలా అవసరం. లేకపోతే మెదడు దెబ్బతిని ఆ పిల్లల్లో (మోటార్ వ్యవస్థ దెబ్బతినడం వల్ల) శరీరక కదలికలు సరిగా లేకపోవడం, సరిగా నడవలేకపోవడం, చేతులు సరిగా పని చేయక పోవడంతోపాటు వారిలో జ్ఞాపకశక్తి తగ్గడం, నేర్చుకునే శక్తి మందగించడం వంటి సమస్యలు రావచ్చు. అందుకే ఈ దశలో రెండు రోజుల కంటే జ్వరం తగ్గకుండా ఉండటం, అది చాలా తీవ్రమైన జ్వరం (హైఫీవర్)గా కనిపించనప్పుడు తప్పక డాక్టర్‌ను సంప్రదించాలి.

**చికిత్స:** ఈ తరహా జ్వరాల్లో పిల్లలకు రెండు దశల చికిత్స అవసరమవుతుంది. వీరిలో ఇన్ఫెక్షన్ తగ్గడానికి అవసరాన్ని బట్టి యాంటీబయాటిక్ ఇవ్వాలి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌కు మాత్రమే యాంటీబయాటిక్స్ పనిచేస్తాయి. కానీ వైరల్ ఇన్ఫెక్షన్లలో హెర్పిస్ వంటి వాటికి తప్ప చాలా వైరస్‌లకు మందులు ఉండవు. వ్యాధి లక్షణాలను అదుపు చేయడానికి మాత్రమే ఉపయోగించే సింప్టమాటిక్ చికిత్స ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ పిల్లలకు మొదటి దశ చికిత్సగా తక్షణం ఐసీయూలో ఉంచడం, అవసరాన్ని బట్టి యాంటీబయాటిక్స్ లేదా వైరస్‌ను బట్టి కొన్ని యాంటీరిట్రోవైరల్ మందులు ఇవ్వడం, వారి టెంపరేచర్‌ను నార్మల్‌కు తీసుకురావడం, బ్లడ్ గ్లూకోజ్ నార్మల్‌గా ఉండేలా చూడటం, బ్రెయిన్ ప్రెషర్‌ను తగ్గించడం, శ్వాస సరిగా అందేలా చూడటం వంటి తొలిదశ చికిత్స అందించాలి.

ఆ తర్వాత ఆ లక్షణాల కారణంగా పరిస్థితి బాగా దిగజారిపోకుండా చూసే సెకండరీ చికిత్సలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫిట్స్ వంటివి రాకుండానూ ఒకవేళ వచ్చినా అవి భవిష్యత్తులో దీర్ఘ కాలం ప్రభావం చూపకుండా చేసే రెండోదశ చికిత్స అందించాలి. ఈ రెండో దశ చికిత్స (సెకండరీ ట్రీట్‌మెంట్)లో మరింత విషమించకుండా చూస్తారు. వెంటిలేటర్ మీద ఉంచి, మానిటాల్ లేదా హైపర్‌టోనిక్ సెలైన్ ఇస్తారు. బ్రెయిన్ ప్రెషర్ తగ్గిస్తారు. అవసరాన్ని బట్టి ఫిట్స్ మందులు ఇవ్వాల్సి ఉంటుంది. ఫిట్స్ వచ్చిన వారికి ఈఈజీ పరీక్ష చేసి ఫిట్స్ ఇవి ఏ కారణంగా వచ్చాయి, ఇక్కడికి పరిమితమయ్యాయి వంటి అంశాలను గుర్తిస్తారు. ఇలాంటి లక్షణాలు గల పిల్లలకు కొన్ని మందులు ఇచ్చి వారిని ప్రశాంతంగా ఉంచాల్సి ఉంటుంది.

**వ్యాధి నిర్ధారణ:** ఇందుకోసం తొలుత క్లినికల్ ఫీచర్స్ పరిశీలించాలి. అంటే రోగిలో బయటకు కనిపించే అంశాలైన జ్వరం, నీరసం, అయోమయం, బయటి వాతావరణానికీ... దాంతోపాటు మనం ఇచ్చే ఆదేశాలకు స్పందించక పోవడం, గిచ్చడం వంటివి చేసినప్పుడు కదలికలు లేకపోవడం, కనుపాపలు పూర్తిగా స్పందించకపోవడంతోపాటు ఒక వైపు కనుపాప పెద్దగానూ, మరోవైపుది చిన్నగానూ ఉండటం, శ్వాస సరిగా తీసుకోలేకపోవడం వంటి వాటితోపాటు సీటీ స్కాన్ వంటి పరీక్షలతో అక్యూట్ ఎన్‌సెఫలైటిస్‌ను నిర్ధారణ చేయవచ్చు. ఇలాంటి పిల్లలను మొదట ఆసుపత్రికి తీసుకురాగానే వారిని మరింత ఆందోళనకు గురికాకుండా కామ్‌గా ఉండేలా చేసి తక్షణం చికిత్స ప్రారంభించాలి.

### నివారణ

- ఇతరలకు సోకకుండా ఉండేందుకు... దగ్గు, తుమ్ము వచ్చినప్పుడు ఎదుటివారిపై తుంపర్లు పడకుండా చేతుల్ని, చేతి రుమాలు అడ్డుపెట్టుకునేలా పిల్లలకు నేర్పాలి. ఈ నియమాన్ని విధిగా అందరూ పాటించాలి
- దగ్గు, తుమ్ము తర్వాత అలా అడ్డుపెట్టుకున్న చేతుల్ని శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి
- దగ్గు, తుమ్ము సమయంలో ఉపయోగించిన రుమాలు/టిష్యూను వేరొకరు ఉపయోగించకూడదు. దాన్ని సరిగ్గా డిస్పోజ్ చేయాలి
- పరిసరాలను, కిచెన్లను, బాత్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- చాలాసార్లు ఈ ఇన్ఫెక్షన్ ఒకరి నుంచి మరొకరికి వచ్చే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. అందుకే దీని నివారణ కోసం వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం చాలా అవసరం. హ్యాండ్ శానిటేషన్ వాడటం చాలా అవసరం
- ఇక ఇటీవల డెంగ్యూతో సైతం ఇలాగే మెదడును ప్రభావితం చేసే సమస్యలు వస్తున్నాయి కాబట్టి నీటిగుంటలు లేకుండా చూసుకోవడం, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త పడటం కూడా అవసరం. ముఖ్యంగా గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే... చికిత్సకంటే నివారణ మేలు. అసలు పిల్లలకు ఎలాంటి వ్యాధులేమీ రాకుండా నివారణ ప్రక్రియలు పాటించడం, వారిలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందేలా మంచి పోషకాహారం ఇస్తూ ఉండటం అవసరం.



**డాక్టర్ పరాగ్ శంకర్‌రావు డెకాటే,** సీనియర్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ అండ్ పీడియాట్రీషియన్, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్, హైదరాబాద్

పరి పరిశోధన

# గ్రాఫీన్ పొరలతో బ్యాటరీలు!



ఏ వస్తువు, పరికరమైనా.. చౌకగా లభించాలి. వీలైనంత ఎక్కువ ఉపయోగపడాలని అందరం కోరుకుంటాం. బ్యాటరీ విషయానికొస్తే ఇది మరీ ముఖ్యమైపోతుంది. ఈ నేపథ్యంలో బీజింగ్ గ్రాఫీన్ ఇన్‌స్టిట్యూట్, సో చౌ యూనివర్శిటీలు ఓ కీలక ముందడుగు వేశాయి. అతిచౌకగా లభించే గ్రాఫీన్ పొరలతో ఓ ఇంకును తయారు చేశాయి. త్రీడీ ప్రింటింగ్ సాయంతో ఈ ఇంకును ఉపయోగించుకుని బ్యాటరీలను తయారు చేయవచ్చునని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఏసీఎస్ నానో జర్నల్‌లో ప్రచురితమైన వివరాల ప్రకారం.. బ్యాటరీల్లాంటివి తయారు చేసేందుకు గ్రాఫీన్ పొడి రూపంలో ఉండటం అవసరం అయితే ఇప్పటివరకూ తయారు చేసిన గ్రాఫీన్ పౌడర్ స్ఫటికాల్లో చాలా లోపాలు ఉన్నాయి. ఫలితంగా నాణ్యమైన గ్రాఫీన్ ఇంక్‌లను తయారు చేయడం సాధ్యం కాలేదు. తాజాగా జరిగిన పరిశోధనల ఫలితంగా ఈ సమస్యలన్నీ మాయమైపోయాయి. నైట్రోజన్‌తో కూడిన గ్రాఫీన్ పొరలపై స్ఫటికాలను పెంచడం ద్వారా సోడియం క్లోరైడ్ (ఉప్పు) ఉత్పత్తి అయ్యేలా చేశారు. ఆ తరువాత ఈ గ్రాఫీన్ పొరలను నీటిలో ఉంచినప్పుడు ఉప్పు కరిగిపోతుంది. మిగిలేది.. స్వచ్ఛమైన నైట్రోజన్ – గ్రాఫీన్ పొర. ఇందులో అతిసూక్ష్మస్థాయిలో రంధ్రాల్లాంటివి ఉంటాయి. శబ్ద తరంగాల సాయంతో ఈ గ్రాఫీన్ పొరలను వేర్వేరు త్రీడీ నిర్మాణాలను చేపట్టవచ్చు. కొన్ని ప్రత్యేక పదార్థాలను వాడినప్పుడు ఈ త్రీడీ నిర్మాణాలు విద్యుత్తును నిల్వ చేసుకోగల సూపర్ కెపాసిటర్లను తయారు చేయవచ్చు.

# స్మార్ట్‌ఫోన్ తాళం మీ వయసు చెప్పేస్తుంది!



స్మార్ట్‌ఫోన్‌ను మీరెలా లాక్ చేస్తారన్న విషయం ఆధారంగా మీ వయసు ఎంతో చెప్పవచ్చునని అంటున్నారు బ్రిటిష్ కొలంబియా యూనివర్శిటీ శాస్త్రవేత్తలు. అదెలా అనుకుంటున్నారా. చిన్న విషయం చూద్దాం. పాతతరం స్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ఫోన్ తనంతట తానే లాక్ అయిపోవాలని కోరుకుంటే.. కొత్తతరం వాళ్లు దీనికి భిన్నమైన ఆలోచన చేస్తారని ఈ అధ్యయనం చెబుతోంది. అంతేకాకుండా పాతతరం వాళ్లు పిన్ నెంబర్‌ను వాడితే.. కొత్తతరం వాళ్లు వేలిముద్రలు వాడతారు. స్మార్ట్‌ఫోన్ల వాడకానికి వయసుకు మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించేందుకు జరిగిన తొలి అధ్యయనం ఇదేనని అంటున్నారు కాన్‌స్టాంటిన్ బెజ్నోసోవ్ అంటున్నారు. వయసు మళ్లినవారు తమ స్మార్ట్‌ఫోన్‌ను అప్పుడప్పుడూ అన్ లాక్ చేస్తుంటారని చెప్పారు. ఇతరులు మన స్మార్ట్‌ఫోన్లను వాడకుండా చూసేందుకు ఏం చర్యలు తీసుకోవాలన్న విషయంపై తాము పరిశోధనలు చేశామని, ఈ క్రమంలో ఫోన్ల వాడకం తీరుతెన్నులు తెలిశాయని, వీటి ఆధారంగా భవిష్యత్తులో స్మార్ట్‌ఫోన్లను ఎలా డిజైన్ చేయాలో అంచనా వేయవచ్చునని బెజ్నోసోవ్ తెలిపారు. తాము 19 నుంచి 63 మధ్య వయసు వారిపై అధ్యయనం జరిపామని... వీరందరి ఫోన్లలో ప్రత్యేక అప్లికేషన్‌ను ఇన్‌స్టాల్ చేసి రెండు నెలలపాటు పరిశీలన చేసినప్పుడు వీరందరూ ఏ సందర్భాల్లో లాక్ చేస్తారు? అన్‌లాక్ చేస్తారు... అన్న విషయం తెలిసింది. పురుషులతో పోలిస్తే మహిళలు ఎక్కువ కాలం స్మార్ట్‌ఫోన్లు వాడతారని ఈ అధ్యయనం చెబుతోంది. అయితే వయసు పెరిగే కొద్దీ ఈ పరిస్థితిలో మార్పు వస్తుందని.. 50 ఏళ్ల వయసులో మగవారు ఎక్కువగా ఫోన్ వాడితే.. మహిళలు తక్కువ వాడతారని బెజ్నోసోవ్ వివరించారు.

